అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 19-03-2025
సంపుటి : 11 | సంచిక : 77 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ

404 మంది మృతి....150 మందికి పైగా గాయాలు 13లో..

హమాస్ లక్ష్యాలపై పెద్దఎత్తున వైమానిక దాడులు

అసెంబ్లీ గ్రీన్ సిగ్నల్

ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవం

సాకారమైన మూడు దశాబ్దాల కల

- దళితులకు పార్టీలో, ప్రభుత్వంలో ఎన్నో అవకాశాలిచ్చాం
- దామోదర సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్సే
- 2011 జనాభా లెక్కల ప్రకారం వాటాలు పంచాం
- 2026 లెక్కల తర్వాత దామాషా ప్రకారం పెంచుతాం
- పోరాటంలో అసువులు బాసిన వారికి చేయూత అందిస్తాం : అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ బిల్లును మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి బిల్లును ప్రవేశపెట్టింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదం పొందడమనేది కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమని చెప్పారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు దీనికి మద్దతివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంఐఎం సభ్యులు మాజిద్ హుస్సేన్, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బీజేపీ నుంచి పాయల్ శంకర్‌తో పాటు శాసన సభ్యులు కడియం శ్రీహరి, కందుల సామేల్, కె.సత్యనారాయణ, మాణిక్‌రావు, కోట లక్ష్మీకాంతరావు, వివేక్ వెంకటస్వామి, కాలే యాదయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటున్నదని తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. 'బాబూ జగ్జీవన్‌రామ్‌కు మా పార్టీ కేంద్రంలో ఆయా శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీయే. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయి. దశాబ్దాలుగా సాగిన ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావడటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం. ఆ కమిటీ సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్..ప్రజల నుంచి 8,681 దరఖాస్తులను స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫారసులు చేసింది" అని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఈ సందర్భంగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. రిజర్వేషన్లను పెంచడానికి సహేతుకమైన విధానం పాటించాల్సి ఉందన్నారు. 2026 జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఆ జనాభా నిష్పత్తి మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి ...5లో

ఎస్సీలను రాజకీయాలకు వాడుకున్నారు

బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి

ఎస్సీలను కాంగ్రెస్, బీజేపీ రాజకీయాల కోసం వాడుకున్నాయని బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. 2004 నుంచి 14 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2024 వరకు ...5లో

కేంద్రం చొరవ వల్లే వర్గీకరణ

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

కేంద్ర ప్రభుత్వం చూపిన చొరవ వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ అన్నారు. కేంద్రం సుప్రీంకోర్టులో అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేయడంతోనే ...5లో

దేశవ్యాప్తంగా అమలు చేయాలి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

ఎస్సీ వర్గీకరణను దేశవ్యాప్తంగా అమలు చేయాలని సీపీఐ శాసన సభా పక్ష నేత కూనంనేనిసాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగోదనీ, ...5లో

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంపై సీపీఐ(ఎం) హర్షం

కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన బిల్లులను అసెంబ్లీ ఆమోదించడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ స్వాగతించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీ ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలూ కలిసి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అవి చట్టరూపం దాల్చడం కోసం గట్టిగా ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 56శాతం బీసీలున్నారని తెలిపారు. విద్యా, ఉద్యోగాల్లో, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనీ, శాసనసభలో ఉన్న పార్టీలన్నీ కూడా ఆమోదం తెలిపాయని వివరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కులగణనకు వ్యతిరేకంగా ఉన్నందున ఈ రకమైన బిల్లులపై వ్యతిరేకత వ్యక్తం చేసే అవకాశముందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా రిజర్వేషన్లు అమలు జరగాలని పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్లను వర్గీకరిస్తూ కింది తరగతులకు కూడా సామాజిక న్యాయం జరిగేటట్టుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. పార్లమెంట్‌లో చట్టరూపం దాల్చడం కోసం కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. దీనికోసం అన్ని రాజకీయ పార్టీలూ ప్రయత్నం చేయడంతో పాటు, రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఎంపీలు, కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలం దరూ చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. కులగణనకు అనుకూలమని కేంద్ర మంత్రి ...13లో

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు ఎత్తేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వివరాలు 13లో..



దద్దరిల్లిన లోక్‌సభ

కుంభమేళా తొక్కిసలాట ప్రస్తావన లేకుండా మోడీ ప్రకటన

- ప్రతిపక్షాల ఆందోళన
- పలుమార్లు సభ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రకటనలో కుంభమేళా తొక్కిసలాట లేకపోవడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. దీనిపై ఆందోళనకు దిగాయి. దీంతో ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభ దద్దరిల్లింది. సభ పలుమార్లు వాయిదా పడింది. మంగళవారం లోక్‌సభలో కుంభమేళాపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేశారు. కుంభమేళా దేశ చరిత్రలో ఒక మైలురాయి అని, దండి మార్చ్ లాగానే ఇది దేశాన్ని ఏకం చేసిందని పేర్కొన్నారు. అయితే కుంభమేళాకు సంబంధించిన విషాదాల గురించి కూడా ప్రధాని మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రధాని ప్రకటనకు స్పందించేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అనుమతి కోరగా స్పీకర్ ఓం బిర్లా అనుమతివ్వలేదు. దీంతో కుంభమేళా సంబంధిత విషాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళ్లర్పించడానికి కూడా ప్రధాని సిద్ధంగా లేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కుంభమేళాతో సంబంధమున్న విషాదాల గురించి ప్రశ్నలకు సమాధానం ఇవ్వని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వైఖరిపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. ప్రతిపక్ష సభ్యులు శాంతించాలని స్పీకర్ పదే పదే కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో సభా కార్యకలాపాలు మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. సభ ప్రారంభమైన కొద్ది సేపటికే బుధవారానికి వాయిదా పడింది. జనవరి 29న ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో అధికారిక లెక్కల ప్రకారం 30 మంది మరణించారు. ఫిబ్రవరి 18న న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు ...13లో

క్రమపద్ధతిలో 'ఉపాధి' నిర్వీర్యం

రాజ్యసభలో సోనియా గాంధీ



వివరాలు 5లో..

ప్రజాస్వామ్య దేశంలో పోలీసు రాజ్యమా?

- బెయిల్ తిరస్కరణలపై సుప్రీంకోర్టు అసంతృప్తి



న్యూఢిల్లీ : అత్యంత తీవ్రత లేని కేసుల్లో విచారణ పూర్తయినప్పటికీ నిందితుల బెయిల్ పిటిషన్లను ట్రయల్ కోర్టులు తిరస్కరిస్తుండడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ప్రజాస్వామ్య దేశం పోలీసు రాజ్యంగా పనిచేయరాదని వ్యాఖ్యానించింది. పోలీసు రాజ్యంలో చట్టాన్ని అమలు చేసే సంస్థలు అవసరం లేకపోయినా ప్రజలను నిర్బంధించడానికి ఏకపక్షంగా అధికారాలను ఉపయోగిస్తుంటాయని తెలిపింది. రెండు దశాబ్దాల క్రితం చిన్న చిన్న కేసుల్లో బెయిల్ దరఖాస్తులు చాలా అరుదుగా మాత్రమే హైకోర్టుల ముందుకు వచ్చేవని జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ గుర్తు చేసింది.

'ట్రయల్ కోర్టుల్లోనే పరిష్కారం కావాల్సిన బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించాల్సి రావడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వ్యవస్థపై అనవసరంగా భారం పడుతోంది' అని ఓ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ ఓకా అన్నారు. కాగా బెయిల్ పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేయడం ఇది మొదటిసారి కాదు. చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్లో బెయిల్ మంజూరు చేసేటప్పుడు మరింత ఉదారంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు గతంలో అనేక సందర్భాలలో ట్రయల్ కోర్టులకు సూచించింది. కస్టడీలో ఉంచాల్సిన అవసరం లేనప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ పదేపదే ఆదేశాలు ఇస్తున్నప్పటికీ దిగువ కోర్టులు బెయిల్ నిరాకరించడం 'మేధోపరమైన నిజాయితీ లేమి'ని సూచిస్తోందని గతంలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఒక ఛీటింగ్ కేసులో రెండు సంవత్సరాలకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ పూర్తయి, ఛార్జిషీటు దాఖలైన తర్వాత కూడా నిందితుడి బెయిల్ దరఖాస్తును ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తోసిపుచ్చాయి. దీంతో అతను సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. మెజిస్ట్రేట్లు విచారించాల్సిన బెయిల్ దరఖాస్తులను సుప్రీంకోర్టు ముందుకు తీసుకురావడం దురదృష్టకరం. బెయిల్ పొందాల్సిన వ్యక్తులు దానిని పొందలేకపోవడంపై మేము విచారం వ్యక్తం చేస్తున్నాము' అని జస్టిస్ ఓకా అన్నారు.

ఏడు సంవత్సరాల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న కేసులో కస్టడీ అవసరం లేనప్పుడు అరెస్టులు చేయవద్దని 2022లో సుప్రీంకోర్టు దర్యాప్తు సంస్థలపై ఆంక్షలు విధించింది. సమంజసంగా, సకాలంలో బెయిల్ మంజూరు చేయడం ద్వారా వ్యక్తుల స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని దిగువ కోర్టులకు సూచించింది. దర్యాప్తునకు సహకరించిన నిందితులను విచారణ సమయంలో అరెస్ట్ చేయకపోతే ఛార్జిషీటు దాఖలైన తర్వాత కస్టడీలోకి తీసుకోకూడదని కూడా సుప్రీంకోర్టు బెంచ్ చెప్పింది.



మాట్లాడుతున్న తపన్‌సేన్

కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న సార్వత్రిక సమ్మె

నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలి

- ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సేవల ప్రయివేటీకరణ ఆపాలి : కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో


ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలను తీవ్రతరం చేయడాన్ని నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఓడరేవులు, కర్మాగారాలు, విద్యుత్ రంగం, ప్రజా రవాణ అన్నీ స్తంభిస్తాయని ప్రకటించాయి. మంగళవారం నాడిక్కడ ప్యారేలాల్ భవన్‌లో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, అసోసియేషన్‌ల ఉమ్మడి వేదిక నేషనల్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సమావేశం సార్వత్రిక సమ్మెకు రెండు నెలల పాటు జరిగే ప్రచారానికి పిలుపునిస్తూ ఒక ప్రకటనను ఆమోదించింది. లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు 17 పాయింట్ల డిమాండ్ల చార్టర్‌పై సమ్మె నిర్వహించనున్నట్టు స్పష్టం చేసింది. లేబర్‌కోడ్ అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు, ఆ తరువాత రోజు దేశవ్యాప్తంగా ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. నయా ఉదారవాద వినాశకర విధానాలకు ప్రత్యామ్నాయాన్నీ ఈ జాతీయ సమావేశం ప్రకటించింది. మతం, ప్రాంతం, కులం, సంస్కృతి, భాష మొదలైన వాటి ఆధారంగా కార్మికులను విభజించడానికి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న దారుణమైన ప్రయత్నాలను తిప్పికొట్టే ఐక్యతా స్వరాన్ని వినిపించింది. ఈ సమావేశంలో తపన్‌సేన్ (సీఐటీయూ), అశోక్ సింగ్ (ఐఎన్‌టీయూసీ), అమర్‌జీత్ కౌర్ (ఏఐటీయూసీ), హర్భజన్ సింగ్ (హెచ్ఎంఎస్), హరీశ్ త్యాగి (ఏఐయూటీ యూసీ), కె.ఇందుప్రకాశ్ మీనన్ (టీయూసీసీ), లతా బెన్ (ఎస్ఈడబ్ల్యూఏ), రాజీవ్ దిమ్రీ (ఏఐసీసీ టీయూ), జవహర్ ప్రసాద్ (ఎల్‌పీఎఫ్), అశోక్ ఘోష్ (యూటీయూసీ) ప్రసంగించారు. నిరుద్యోగం, పేదరికం, అసమానతలకు దారితీసిన కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా శ్రామిక ప్రజలపై కష్టాలు పెరిగాయన్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాబోయే తీవ్రమైన పోరాటాలకు ఈ సమ్మె ప్రారంభం మాత్రమేనన్నారు. నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సేవల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. ఏప్రిల్ నాటికి జిల్లా, రాష్ట్ర సదస్సులు పూర్తి చేయడంతో పాటు, పాదయాత్రలు, వాహన ర్యాలీలు వంటి బహుముఖ ప్రచార కార్యక్రమాలు ...13లో

ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణపై స్టేటస్‌కో

స్టే ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ-హైదరాబాద్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్‌లో కొందరు రైతుల భూమిని సేకరణ చేయరాదని గతంలో సింగిల్ జడ్జి జారీ చేసిన స్టే ఉత్తర్వులను రద్దు చేసేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. స్టే ఎత్తేయాలని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ ...13లో



పిటిషనర్‌కు కోటి జరిమానా

హైకోర్టు సంచలన తీర్పు

కేసు పెండింగ్‌లో ఉండగా మరో బెంచ్‌లో పిటిషనేంటి?

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డికి కోటి రూపాయల జరిమానా విధించారు. ప్రభుత్వ భూముల కబ్జా యత్నాలను అడ్డుకున్నారు. ఒక పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, మరో ధర్మాసనం వద్ద పిటిషనర్ ...13లో

నేడే రాష్ట్ర బడ్జెట్

- ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రారంభం
- శాసనసభలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి
- శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు

రాబోయే (2025-26) ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈసారి మన పద్దు రూ.3.05 లక్షల కోట్ల నుంచి రూ.3.10 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. గతేడాది రూ.2.91 లక్షల కోట్లతో రేవంత్ సర్కార్ బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ పద్దు మీద ఒక ఐదు శాతం పెంచి ఈసారి ప్రతిపాదించనున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం బడ్జెట్ కు ఆమోదముద్ర వేయనుంది. అసెంబ్లీలోని కమిటీ హాలులో క్యాబినెట్ జరగనుంది. అనంతరం ఉదయం 11 గంటలకు శాసనసభ, మండలి ప్రారంభమవుతాయి. ఉదయం 11.02 గంటలకు శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క పద్దును ప్రతిపాదించనున్నారు. మండలిలో సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. గతేడాది కూడా వీరిద్దరే పద్దును ప్రవేశపెట్టారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, అభివఅద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని అధికారిక వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పు, వాటికి వడ్డీలు, కిస్తీలు చెల్లించడం సర్కారుకు తలకు మించిన భారంగా మారింది. ప్రతి నెలా రూ.18 వేల కోట్ల ఆదాయం మాత్రమే ఖజానాకు వస్తోందనీ, దీంతో జీతభత్యాల చెల్లింపులు, కార్యాలయాల నిర్వహణ, సంక్షేమ కార్యక్రమాల అమలు ఇబ్బందికరంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఇటీవల పలుమార్లు ఆవేదన వెలిబుచ్చిన సంగతి తెలిసిందే. నెలనెలా జీతభత్యాలకు రూ.6,500 కోట్లు, అప్పులు వాటి వడ్డీలకు మరో రూ.6,500 కోట్లు పోగా, మిగిలిన రూ.5,000 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటం కత్తిమీద సాములా తయారైందంటూ వారు వ్యాఖ్యానించారు. అయితే



ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఆర్థిక సాయం, పింఛన్ల పెంపు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక భరోసా, డిగ్రీ ఆపైన చదివే అమ్మాయిలకు స్కూటీలు, కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం తదితర వాగ్దానాలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. వీటిపై ఇప్పటికే ప్రతిపక్షాలతో పాటు ప్రజల నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో బడ్జెట్ కూర్పు ఎలా ఉండబోతోందనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికైనా బడ్జెట్‌లో వివిధ రంగాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలంటూ ప్రజా సంఘాలు, మేధావులు కోరుతున్నారు. ప్రాధాన్యతా క్రమంలో కేటాయింపులుండాలంటూ వారు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. అయితే ఇటీవల వివిధ శాఖలతో నిర్వహించిన ప్రి బడ్జెట్ సమావేశాల్లో గతం కంటే కేటాయింపులు ఎక్కువగా ఉండబోవంటూ డిప్యూటీ సీఎం పరోక్షంగా తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దుబారాను తగ్గించుకుంటూ, రూపాయి రూపాయి పోగేసుకుంటూ, ఆచితూచీ ఖర్చు పెడుతున్నామంటూ ఆయన మంత్రులకు తెలిపారు. అందువల్ల పరిస్థితిని అర్థం చేసుకుని కేటాయింపులు తగ్గించుకోవాలంటూ సూచించారు. ఈ క్రమంలో గత బడ్జెట్ తో పోలిస్తే భారీ కేటాయింపులు, పెద్ద పెద్ద పద్దులు ఉండబోవని తెలుస్తోంది. 2024-25 బడ్జెట్‌కి ఐదు శాతం పెంచి పద్దును ప్రతిపాదించనున్నారని సమాచారం.

పెరిగే అవకాశమున్న అంశాలివే...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం, మహిళా సంఘాలకు చేయూత, విద్య, వైద్యం, భారీ సాగునీటి పారుదల, రోడ్లు, భవనాలు తదితర అంశాలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగే అవకాశముందని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. రాజకీయ కోణంలో ఆలోచించి వీటికి నిధులు పెంచే అవకాశముందని సమాచారం. వీటితో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచు కుని సాగునీటి పారుదల, రైతు భరోసా, వరికి బోనస్, మద్దతు ధరలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్ కార్డుల్లాంటి వాటికి కూడా బడ్జెట్ లో ప్రాధాన్యత నివ్వనున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూని వర్సిటీ మొదలైన వాటికి కాస్త ఎక్కువ మొత్తం నిధులు కేటాయించనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మేడిగడ్డలో డ్రోన్ ఎగురవేతపై కేసులో తీర్పు వాయిదా

కేటీఆర్ ఇతరుల పిటిషన్‌పై ముగిసిన వాదనలు

నవతెలంగాణ-హైదరాబాద్

మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతంలో డ్రోన్ ఎగురవేశారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్‌లపై పోలీసులు నమోదు చేసిన కేసును సవాల్ చేసిన పిటిషన్లపై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు మంగళవారం పూర్తికావడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. మేడిగడ్డ నిషేదిత ప్రాంతంగా కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ, మేడిగడ్డ ప్రాజెక్టు ప్రాంతంపై డ్రోన్స్ ఎగురవేయకుండా నోటిఫికేషన్ వెలువరించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వకుండా, మేము కోరామని చెబితే ఎలాగని హైకోర్టు ప్రశ్నించింది. మేడిగడ్డ సందర్శన సందర్భంగా అనుమతుల్లేకుండా డ్రోన్ వినియోగించారని 2024 జులై 20న మహదేవపూర్ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్, గండ్ర, సుమన్ పిటిషన్ వేశారు. పిటిషనర్లు ప్రాజెక్టును సందర్శించిన మూడు రోజులకు పోలీసులు కేసు నమోదు చేశారనీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వలీషేక్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలని వాళ్ల న్యాయవాది వాదించారు. గత ఏడాది జులై 26న సందర్శించగా అదే రోజు కాకుండా జులై 29న కేసు నమోదు చేశారని వివరించారు. అధికారిక రహస్యాల చట్టం కింద నిషేధిత జాబితా ప్రాంతంగా చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలని చట్టం స్పష్టం చేస్తోందన్నారు. మేడిగడ్డ రిజర్వాయరులో తగినంత నీరు ఉన్నప్పటికీ విడుదల చేయకపోవడంపై కేటీఆర్ తదితరులు సందర్శించిన మాట వాస్తవమేనన్నారు. మేడిగడ్డ రిజర్వాయర్ ఫిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని, అక్కడ డ్రోన్స్ ఎగురవేస్తే ప్రమాదమని, అందుకే అది నిషేధిత ప్రాంతంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. నిషేధిత జాబితాలో చేర్చుతూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ ఏదని హైకోర్టు ప్రశ్నించింది. ఇరు పక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

మేడిగడ్డ కుంగుబాటుకు కేసీఆర్ బాధ్యుడనే ఫిర్యాదును పరిష్కరించండి

మేడిగడ్డ బ్యారేజీ ఫిల్లర్ల కుంగుబాటు ఘటనకు నాటి సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి టి.హరీశ్‌రావులను బాధ్యులను చేయాలంటూ భూపాలపల్లి జిల్లా కోర్టులోని కేసులో వెలువడిన నోటీసులను హైకోర్టు రద్దు చేసింది. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు సవాలు చేసిన పిటిషన్లను జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ పూర్తి చేసి మంగళవారం తుది ఉత్తర్వులను వెలువరించారు. మేడిగడ్డ బ్యారేజీ ఫిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి భూపాలపల్లి లోయర్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని లోయర్ కోర్టు కొట్టివేయడంతో జిల్లా కోర్టులో ఆయన క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. రాజలింగమూర్తి పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్‌రావుతో కలిపి ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టు తన పరిధి లేకున్నా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిందని, ఇలా చేయడం సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు వ్యతిరేకమని కేసీఆర్ తరపు లాయర్లు గతంలో వాదించారు.



గతంలోనే హైకోర్టు, జిల్లా కోర్టు ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. మంగళవారం తీర్పు వెలువరిస్తూ, పిటిషన్లను అనుమతిచ్చింది. కింది కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి ఇటీవల హత్యకు గురైన విష యం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ వల్ల రూ.1.30 లక్షల కోట్ల ప్రజాధనం వెచ్చించారనీ, మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటు వల్ల రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని ప్రభుత్వ వాదన. మేజిస్ట్రేట్ కోర్టు ఫిర్యాదును కొట్టేస్తూ వెలువరించిందని, దీనిపై అసాధారణ పరిస్థితులు ఉంటేనే జిల్లా కోర్టు విచారణకు అనుమతించాలని, అలాంటి పరిస్థితులు ఏమీ లేవని, జిల్లా కోర్టు నోటీసులు చెల్లవని కేసీఆర్, హరీశ్‌రావుల న్యాయవాది వాదన. ఇరుపక్షాల వాదనల తర్వాత గతంలో తీర్పును వాయిదా వేసిన హైకోర్టు, మంగళవారం తీర్పు వెలువరిస్తూ, ఈ వ్యవహారంపై కింది కోర్టు చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. కేసీఆర్, హరీశ్‌లకు జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులను రద్దు చేసింది.

కేసీఆర్‌కు లభించని ఊరట

కేసీఆర్, హరీశ్‌రావు, తదితరులకు నోటీసుల జారీ సమయంలో సెషన్స్ కోర్టు చేసిన వ్యాఖ్యలను హైకోర్టు రద్దు చేసింది. ఇదే సమయంలో రివిజన్ పిటిషన్ విచారణార్హమేనని ప్రకటించింది. రివిజన్ పిటిషన్‌కు ఉన్న చట్టబద్ధతపై తేల్చాలని, చట్టప్రకారం విచారణ చేపట్టాలని జిల్లా కోర్టును ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వులపై రివిజన్ పిటిషన్ విచారణార్హమేనని పేర్కొంది. రివిజన్ పిటిషన్‌పై చట్టప్రకారం విచారణ జరపాలని కింది కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.. మేజిస్ట్రేట్ ఉత్తర్వులపై రివిజన్ చేపట్టే పరిధి జిల్లా కోర్టుకు లేదన్న కేసీఆర్, హరీశ్‌రావుల వాదనను తోసిపుచ్చింది. జిల్లా సెషన్స్ కోర్టుకు రివ్యూ చేసే పరిధి, అధికారం ఉందని వెల్లడించింది. రివిజన్ పిటిషన్ విచారణార్హమేనని, దీనికి నెంబరు కేటాయించాలంటూ కోర్టు సిబ్బందిని ఆదేశిస్తూ సెషన్స్ జడ్జి చేసిన వ్యాఖ్యలు సముచితంగా లేవని తప్పుపట్టింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వులను కొట్టివేయడం ద్వారా ఫిర్యాదుదారుకు ప్రయోజనం ఉండదని, చట్టం ముందు అందరూ సమానులేనని రివిజన్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేయకముందే జిల్లా కోర్టు ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా ఉందని ఆక్షేపించింది. ఇది వారెంట్ కేసా, సమన్ల కేసా అనేది జిల్లా కోర్టులో కేసీఆర్, హరీశ్ తేల్చుకోవాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది.

డీమ్డ్ వర్సిటీల ఏర్పాటు దారుణం

రాష్ట్రంలోని పలు విద్యా సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా కల్పనకు దోహదపడే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో సవాలు చేసింది. ఇష్టారాజ్యంగా డీమ్డ్ యూనివర్సిటీలను ప్రకటించడం సరికాదంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనలపై స్టే విధించాలని కోరింది. ఇలాంటి వర్సిటీలతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్రం తరపున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదించారు. యూజీసీ వాదనలు వినకుండా ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే స్టే విధింపు అభ్యర్థనపై తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. యూజీసీ సహా రాష్ట్రంలోని ఏడు డీమ్డ్ యూనివర్సిటీకు నోటీసులు జారీ చేసింది. అరోరా ఉన్నత విద్య అండ్ పరిశోధన అకాడమీ, చైతన్య, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, కేఎల్ విశ్వవిద్యాలయం(అజీజ్‌నగర్, బౌరంపేట్ క్యాంపస్‌లు), సింబయాసిస్ ఇంటర్నేషనల్, విజ్ఞాన్ ఫౌండేసన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లకు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. 2010, 2016, 2019లో చేసిన యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అధికార పరిధిని ఉల్లంఘించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా డీమ్డ్ యూనివర్సిటీగా ప్రకటించడం పట్ల తప్పుబట్టింది. యూజీసీ నిబంధనలపై స్టే ఇవ్వాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. వీటిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారించింది. ఏజీ వాదనలు కొనసాగిస్తూ, ఏదైనా విద్యా సంస్థ దరఖాస్తు చేసుకున్న 60 రోజుల్లో యూజీసీ స్పందించకుంటే ఆ సంస్థ తనంట తానుగా డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందుతుందన్నారు. ఈ నిబంధన ఆందోళనకరమన్నారు. విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అద్దెకు తీసుకున్న వాణిజ్య షట్టర్‌లలో అరకొర సదుపాలయాలతో నడుస్తున్న సంస్థలు కూడా ఇలాంటి గుర్తింపు పొందుతున్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎసెన్షియాలిటీ(కనీస సౌకర్యాలున్నట్లు) సర్టిఫికెట్ పొందాలన్నారు. యూజీసీ మాత్రం ఈ మార్గదర్శకాలను పాటించడం లేదన్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణలపై వివరణ ఇవ్వండి

రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునుగునూరులో ప్రభుత్వ భూమి రక్షణకు తీసుకునే చర్యలను వివరించాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి చర్యలు శూన్యమని పేర్కొంటూ సరూర్‌నగర్‌కు చెందిన సీహెచ్.ప్రశాంత్ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారించింది. సర్వే నెం.90పి లోని రూ.50 వేల కోట్ల విలువ చేసే 6.28 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకోవడంతోపాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారుల చర్యలు తీసుకోవడం లేదని పిల్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, కొంగరకలాన్ ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం తహసీల్దార్, విద్యుత్ శాఖ ఈఈ, డీఈ, ఏఈ, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోరా?

పత్తి సాగు చేస్తే ప్రతికూల పరిస్థితుల కారణంగా పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోవడంతో హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న అన్నదాత కుటుంబాన్ని ఆదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరును తప్పుబట్టింది. రైతు ఆత్మహత్య చేసుకుని పదేండ్లు అయినప్పటికీ ప్రభుత్వ పరిహారం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా అన్ని అర్హతలుంటే పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు గతంలో తాము ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 2014లో భర్త ఆత్మహత్య చేసుకోగా ప్రభుత్వం పరిహారం మంజూరు చేసినా చెల్లించని ఎమ్మార్వో నిర్లక్ష్య తీరును ఎండగట్టింది. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంతవరకు ఆత్మకూరు మండల తహసీల్దార్ జీత, భత్యాలను నిలిపివేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను ధర్మాసనం ఆదేశించింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన లక్కరుసు మొగిలి రుణాలు చేసి పత్తిసాగు చేశాడు. పంట దిగుబడి లేక చేసిన అప్పులు తీర్చలేకపోవడంతో పురుగుల మందు తాగి 2014 జులై 17న ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అప్పట్లోనే పోలీసులు నివేదిక సమర్పించారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన పథకంలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న రైతు భార్య లక్ష్మి అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు, లక్ష్మి చేసుకున్న దరఖాస్తు చట్ట నిబంధనలకు లోబడి ఉంటే జీవో 173 ప్రకారం రుణ పరిష్కారం రూ. లక్ష, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.5 లక్షలను నాలుగు వారాల్లోగా చెల్లించాలని గత ఏడాది అక్టోబరులో ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు అమలు కాలేదంటూ లక్ష్మి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారించారు. రికార్డులను పరిశీలిస్తే జిల్లా కలెక్టర్ ఫిబ్రవరి 13న రూ. 6 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు ఆ మొత్తాన్ని బాధితురాలికి చెల్లించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా బాధితురాలికి పరిహారం చెల్లించలేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం చెల్లింపులో అసాధారణ జాప్యం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని అభిప్రాయపడింది. బాధితురాలకి చెల్లించాల్సిన సొమ్మును విత్‌డ్రా చేసి చెల్లించే వరకు తహసీల్దార్‌కు జీతభత్యాలను చెల్లించరాదని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది.

పాత ట్రైకార్ రుణాలు ఎత్తేసే కుట్ర

- తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజీవ్‌యువ వికాసం పేరుతో పాత ట్రైకార్ రుణాలను ఎత్తివేసే కుట్రకు ప్రభుత్వం పాల్పడితే తీవ్ర పరిణామాలుంటాయని తెలంగాణ గిరిజన సంఘం హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్రప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిందనీ, కానీ గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ కార్పొరేషన్లలో లక్షలాదిమంది రుణాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారనీ, వారి సంగతేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 2019-20లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఒక్కో కార్పొరేషన్ నుండి అర్హుల లిస్టును ప్రకటించాయని గుర్తు చేశారు. గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించి శాంక్షన్ లిస్ట్‌తో పాటు రూ.219 కోట్ల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే ఇస్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ట్రైకార్‌తో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లలో సైతం వేలాదిమంది లబ్ధిదారుల శాంక్షన్ లిస్టు చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపాయని తెలిపారు. కోట్లాది రూపాయల బకాయిలను విడుదల చేయకుండా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడమేంటని ప్రశ్నించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. వీరందరకీ రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కొరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి కూడా తీవ్ర ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదముందని తెలిపారు. రుణం తీసుకోకపోయినా శాంక్షన్ అయినట్టు ఒక్కసారి ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఎక్కిన తర్వాత తిరిగి దరఖాస్తు చేసుకుంటే తిరస్కరణకు గురవుతుందని పేర్కొన్నారు. లక్షలాదిమంది యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్లలో పెండింగ్‌లో ఉన్న రుణాలను తక్షణం విడుదల చేయాలనీ, రాజీవ్ యువ వికాసంలో ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును మరో నెల రోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్‌ను చేర్చాలి

- ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లతో పాటు వికలాంగుల కార్పొరేషన్‌ను కూడా చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య కోశాదికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రూ. ఆరు వేల కోట్లతో 5లక్షల మంది నిరుద్యోగులకు రూ.1లక్ష నుండి రూ.4 లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం చేసిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రూ.25 వేల మంది నిరుద్యోగ వికలాంగులకు మేలు జరుగుతుందని తెలిపారు.

2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 5శాతం ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించాలని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎక్కడ కూడా వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మిగతా కార్పొరేషన్లకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగుల కార్పొరేషన్ కు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వికలాంగుల కార్పొరేషన్ దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం విది విధానాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలనీ, ఆ పథకం అమలు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు ఇచ్చిన నోటిఫికేషన్లను సవరణ చేసి, వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు అయ్యేలా తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయకుండా లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం అంటే వికలాంగులను మోసం చేయడమేనని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్‌ను చేర్చకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

సెక్యూరిటీ గార్డుల వేతనాలు వెంటనే ఇవ్వాలి

నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్



ఆస్పత్రిలో విధులు బహిష్కరించి ధర్నా

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ఓపీడీఎస్ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులకు బకాయి ఉన్న జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం సెక్యూరిటీ గార్డులు వర్క్ బాయ్‌కాట్ చేసి నిమ్స్ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులకు ప్రతినెలా వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్‌తోపాటు నిమ్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. చట్ట ప్రకారం ప్రతి నెలా7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని ఉన్నా అమలు జరగడం లేదన్నారు. సెక్యూరిటీ గార్డులకు ప్రతినెలా వేతనాలతోపాటు పేస్లిప్స్ ఇవ్వాలని లేబర్ కమిషనర్ చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. డబుల్ డ్యూటీలు చేయించుకుంటూ.. వేతనాలు సరిగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కనీస వేతన చట్టం ప్రకారం ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాలని ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ పెంచలేదని విమర్శించారు. 2021లో సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం పెంచుతూ సెక్యూరిటీ సర్వీసెస్ జీవో 21 వచ్చిందన్నారు. దానిపై యాజమాన్య సంఘాలు కోర్టుకు వెళ్లడంతో ఆ జీవోను గెజిట్ చేయకుండా అప్పటి ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ప్రస్తుతం సెక్యూరిటీ సర్వీసెస్ జీవో 21ని వెంటనే గెజిట్ చేసి కనీస వేతనాలు రూ.18,019కు పెంచాలని హైకోర్టు డైరెక్షన్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. అందువల్ల.. సెక్యూరిటీ సర్వీసెస్ జీవోతో పాటు ఇతర జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఓపీడీఎస్ కాంట్రాక్ట్ సంస్థ ఆపరేషన్ మేనేజర్‌తో జరిగిన చర్చల్లో.. బకాయి వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో సెక్యూరిటీ గార్డులు తిరిగి విధుల్లో చేరారు.

తెలుగు వర్సిటీకి 'సురవరం' పేరు పట్ల కృతజ్ఞతలు

సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, కుటుంబ సభ్యులు

ప్రతియేటా అవార్డు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలనుకుంటున్నట్టు వెల్లడి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, మద్దతిచ్చిన ప్రతిపక్షాలకు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య కృషిని గుర్తించాలనే ప్రజలందరి ఆకాంక్షలను సీఎం రేవంత్‌రెడ్డి గౌరవించినందుకు ట్రస్ట్ అభినందనలు తెలిపింది. ప్రతి ఏడాదీ మే 28న ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని, దాశరథి పురస్కారం మాదిరిగానే 'సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాన్ని' ఇవ్వాలని ప్రభుత్వానికి ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలుగు సాహిత్యం, జర్నలిజం రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి అవార్డుతోపాటు ఈ రంగాల్లో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌ను "సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం" తరపున ఇవ్వాలని ట్రస్ట్ భావిస్తున్నదని, దీనిపై ట్రస్ట్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మరోవైపు కేంద్ర సాహిత్య అకాడమీ ఆదేశాల మేరకు సురవరం ప్రతాపరెడ్డి జీవితం, సాహిత్య కృషిపై "సురవరం ప్రతాపరెడ్డి వాచకం" పుస్తకాన్ని రచించానని, అది ప్రచురణ కావాల్సి ఉందని వెల్లడించారు. ప్రతాపరెడ్డి రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు ప్రత్యామ్నాయ రచనలు నేటికీ లేవన్నారు. ట్రస్టీలు పుష్పలత మాట్లాడుతూ.. తెలుగు భాష మాట్లాడలేని పరిస్థితుల్లో తెలుగు జాతిని మేల్కొల్పేందుకు, తెలుగు సాహిత్య వికాసానికి సురవరం ప్రతాపరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి కృషి చేసిన కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సహకరించిన ప్రభుత్వం, ఇతర ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కొండా లక్ష్మీకాంతారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలనే ప్రతిపాదన దశాబ్దకాలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారం కావడం హర్షణీయమన్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ.. ఇది ఒక వ్యక్తికి కాకుండా తెలుగు సాహిత్య రంగానికి, తెలుగు జర్నలిజానికి, యావత్ సమాజానికి దక్కిన గౌరవమని, తద్వారా తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని అన్నారు. మహనీయుడు ప్రతాపరెడ్డి.. అనేక మహోన్నతమైన సాంఘిక గ్రంథాలను సమాజానికి అందించారని గుర్తు చేశారు. ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య మాట్లాడుతూ.. చీకటిలో మగ్గుతున్న తెలుగు ప్రజల స్వాభిమాన ప్రతీకగా ప్రతాపరెడ్డి నిలిచారని, తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ద్వారా తెలుగు సాహిత్య రంగానికి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని అన్నారు. ట్రస్ట్ సభ్యులు, ప్రతాపరెడ్డి మనుమలు సురవరం అనిల్‌రెడ్డి, సురవరం కపిల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

ఏక కాలంలో ఎన్నికలపై జేపీసీకి స్పష్టం చేసిన జస్టిస్ ఏపీ షా



న్యూఢిల్లీ : 'ఒక దేశం ఒక ఎన్నిక' రాజ్యాంగవిరుద్ధమైన ప్రతిపాదన అని ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎ.పి.షా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముందు ఆయన సాక్ష్యమిస్తూ ఇందుకు సంబంధించి 12పేజీల నోట్‌ను అందచేశారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సూత్రాలను, సమాఖ్య స్వభావాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలని సిఫార్సు చేయడానికి ఎన్నికల కమిషన్‌కు అధికారం ఇవ్వడంతో సహా అనేక అంశాల్లో ఈ బిల్లు లోపభూయిష్టంగా వుందని మాజీ లా కమిషన్ చైర్మన్ కూడా అయిన షా చెప్పారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ప్రతిపాదిత బిల్లు రాజ్యాంగపరమైన అవసరాలన్నింటినీ నెరవేరుస్తోందని పేర్కొంటూ సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, షా వాదనలను తిరస్కరించారు.

దాదాపు ఐదు గంటలపాటు సాగిన విచారణలో బీజేపీ ఎంపీ పి.పి.చౌదరి నేతృత్వంలోని జెపిసి సభ్యులు సాల్వే, షాలను పలు ప్రశ్నలు అడిగారు. ఈ సమావేశం సానుకూలంగా సాగిందని చౌదరి వ్యాఖ్యానించారు. సాల్వేతో సమావేశం మూడు గంటలు కాగా, షాతో సమావేశం రెండు గంటల్లోపే ముగిసింది. కమిటీ అభిప్రాయాలు కోరిన న్యాయ నిపుణుల్లో షా కూడా వున్నారు. ఒక దేశం ఒక ఎన్నిక ప్రతిపాదనతో ఆయన తీవ్రంగా విభేదించారు. పూర్తి స్థాయిలో ఐదేండ్ల కాలానికి అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని షా, కమిటీకి స్పష్టం చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ బిల్లు ఆమోదం పొంది చట్టంగా మారితే వచ్చే పార్లమెంట్ ఎన్నికతో పాటే అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. ఆయా అసెంబ్లీల మిగిలిన కాలపరిమితులతో సంబంధం లేకుండా ఈ ఎన్నికల నిర్వహణ వుంటుంది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుందనే వాదనను కూడా షా సమర్థించలేదని ఆ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లు ప్రతిపాదనలకు ప్రత్యామ్నాయాలు ఏమిటని కమిటీ ప్రశ్నించగా, తన అభిప్రాయాలను తర్వాత కమిటీతో పంచుకుంటానని షా చెప్పారు.

సామ్రాజ్యవాదం, జియోనిజం ప్రమాదకరం

- భారత్‌లో కార్పొరేట్ హిందుత్వ : ఏఐసీ 20వ మహాసభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌ధావలే

- హాజరైన సీపీఐ(ఎం) బ్రిటన్, ఐర్లాండ్ విభాగం



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

బ్రిటన్, ఐర్లాండ్‌లో సీపీఐ(ఎం) విభాగానికి చెందిన అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ కమ్యూనిస్టుల (ఏఐసీ) 20వ మహాసభ ఉత్తేజపూరిత వాతావరణంలో కొనసాగింది. రెండు రోజుల పాటు లండన్‌లోని సౌతాల్‌లో (సీతారాం ఏచూరి నగర్)లో నిర్వహించిన ఈ మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే పాల్గొన్నారు. ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్, ఐర్లాండ్ నుంచి 110 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 15 మంది మహిళలున్నారు. 67 శాతం మంది ప్రతినిధులు 50 ఏండ్ల కంటే తక్కువ వయస్సు గలవారున్నారు. పార్టీ జెండాను 93 ఏండ్ల వయస్సు గల ప్రముఖ నాయకుడు అజిత్‌సింగ్ దోసాంజ్ ఆవిష్కరించారు. సంతాప తీర్మానం, అమరవీరులకు పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ మహాసభను పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ ధావలే ప్రారంభించారు. ప్రపంచంలో, భారతదేశంలో, బ్రిటన్‌లో రాజకీయ సవాళ్లను ఎత్తిచూపారు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం, జియోనిజం ప్రమాదాలను, భారతదేశంలో, బ్రిటన్‌లో ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేట్ హిందుత్వ ప్రమాదాలను ఆయన వివరించారు. అన్ని లౌకిక శక్తుల ఐక్యతను తిరిగి పెంపొందించాలని, అదే సమయంలో సీపీఐ(ఎం) స్వతంత్ర బలం, వామపక్ష శక్తుల బలోపేతంపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐసీ కార్యదర్శి హర్సేవ్ బెయిన్స్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ప్రతి శాఖ నుంచి ఒకరు చొప్పున 20 మంది ప్రతినిధులు తమ అనుభవాలు, విమర్శలు, సూచనలతో నివేదికపై చర్చలో పాల్గొన్నారు. అనంతరం నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్మికుల హక్కులపై, క్యూబా, పాలస్తీనాపై మూడు తీర్మానాలు ఆమోదించారు. ఈ మహాసభ 19 మంది సభ్యుల కార్యనిర్వాహక కమిటీ (ఈసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మధురైలో జరిగిన పార్టీ 24వ మహాసభకు ఇద్దరు ప్రతినిధులు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మూడుసార్లు పూర్తిచేసిన హర్సేవ్ బెయిన్స్ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఏఐసీ నూతన కార్యదర్శిగా జనేష్ నాయర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ముగింపు ప్రసంగంలో అశోక్ ధావలే తక్షణం చేయాల్సిన నిర్మాణ పనులను సూచించారు. మహాసభ ఐక్యత ఉత్సాహంగా ముగిసింది.

అభ్యుదయ, మానవతావాది జనార్ధన్

సంస్మరణ సభలో వక్తలు



విజయవాడ : అభ్యుదయవాది ఆర్.జనార్ధన్ బీమా ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలపై పోరాడారని, పెన్షనర్ల సంఘాలకు స్ఫూర్తిగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. జనార్ధన్ అభ్యుదయ, మానవతా సేవా కార్యక్రమాలు అనుసరణీయమన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులుగా, ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శిగా, డివిజన్ అధ్యక్షులుగా రెండు దశాబ్దాలకుపైగా సేవలందించి ఈ నెల 7న తుదిశ్వాస విడిచిన ఆర్. జనార్ధన్ సంస్మరణ సభ మంగళవారం రాత్రి విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది.

ఐసీఈయూ, ఐసీఆర్ఈఏ సంయు క్తంగా నిర్వహించిన ఈ సభకు జె.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఎఐఐఈఏ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, జనార్ధన్ పెద్ద కుమారుడు, నవ తెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎల్ఐసీ యూనియన్ జోనల్ అధ్యక్షులు పి.సతీష్, ఎల్ఐసీ పెన్షనర్ల నాయకులు బిహెచ్‌వీఎల్. రాధాకృష్ణమూర్తి, ఉద్యోగ సంఘ నాయకులు జి.కిషోర్ కుమార్, జనార్ధన్ రెండో కుమారుడు ఆర్ రఘు, కుటుంబ సభ్యులు, పలు సంఘాల నాయకులు పాల్గొని నివాళు లర్పించారు. 1953లో మచిలీపట్నం ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగిగా చేరి బీమా రంగ జాతీయకరణ, ఆటోమేషన్ వ్యతిరేక పోరాటాల్లో, బీమా ఉద్యోగుల కార్యక్రమాల్లో జనార్ధన్ చురుకైన పాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. మచిలీపట్నంలో మారుతీ వ్యాయామశాల స్థాపకునిగా, రామకృష్ణ మిషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. దివిసీమ తుపాను, మచిలీపట్నంలో వరదలు, గుంటూరు జిల్లాలో కరువు వంటి సందర్భాల్లో ప్రజలకు ఆయన అందించిన సేవలు మారువలేని వన్నారు. యూనియన్ వ్యవహారాలను చిత్తశు ద్ధితో నడపడంతోపాటు తన కుటుంబ సభ్యులను అభ్యుదయ, ప్రజా ఉద్యమాల వైపు ప్రోత్సహించడంలో కీలకపాత్ర పాత్ర పోషించారని కొనియాడారు. కులమత భావాలకు వ్యతిరేకంగా నిలబడ్డారని, శాస్త్రీయ ఆలోచనలను ప్రచారం చేశారని గుర్తు చేశారు. జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని తెలిపారు.

కేవలం ఉద్యోగిగా మాత్రమే కాకుండా సమాజం పట్ల తన బాధ్యతలను నిర్వర్తించేలా ముందుకు సాగారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు సిహెచ్.కళాధర్ ఎన్ఎంకె.ప్రసాద్, ఇవి తులసీరావు, పెన్షనర్ల సంఘం నాయకులు ఎంఎన్ పాత్రుడు, సిహెచ్.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయండి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన సంక్షేమశాఖలోని పండిట్, పి.ఇ.టి పోస్టులను ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా అప్‌గ్రేడ్ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. పండిట్, పి.ఇ.టి పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదన గురించి వివరణివ్వాలని అన్నారు.

ఎప్పటిలోగా ఈ ప్రక్రియ పూర్తవుతుందో చెప్పాలని కోరారు. భద్రాచలం, ఏటూరు నాగారం ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చిన నేపథ్యంలో అక్కడ టీచర్ పోస్టులను మంజూరు చేశారా? అని ప్రశ్నించారు. గత ఆరు సంవత్సరాలుగా తాను ఇవే అంశాలను పదే పదే ప్రస్తావించినట్టు గుర్తుచేశారు. నర్సిరెడ్డి ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ పోస్టుల అప్‌గ్రెడేషన్‌కు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలోని 50 గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలుగా మార్చామనీ, అక్కడి ప్రాంగణాల్లోనే వాటిని నడిపిస్తున్నామని చెప్పారు. వాటికి మొత్తం 1,085 టీచర్ పోస్టులను మంజూరు చేశామని సమాధానమిచ్చారు. మంత్రి సమాధానంపై నర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



సమస్యలు పరిష్కరించండి


జీరో అవర్‌లో సభ్యుల గోడు

- రెండుగంటలు.. 26 మంది సభ్యులు..
- తాగు, సాగునీటిపైనే ఎక్కువ మంది విన్నపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్‌భగీరథతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీరిందని పాలకులు గొప్పలు చెప్పుకున్నా... సాగునీటి వనరుల లభ్యత పెరిగి గ్రౌండ్ వాటర్ పెరిగిందని పాల కులు నొక్కి వక్కాణించి చెబు తున్నా... క్షేత్రస్థాయిలో ఆ రెండు సమస్యలూ తీవ్రస్థాయిలో ఉన్నాయనీ, వాటిని పరిష్కరించాలని జీరో అవర్ సాక్షిగా అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ప్రభుత్వానికి మొరపెట్టుకోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. ఎండలు ముదిరే కొద్దీ ఆ రెండు సమస్యలూ మరింత పెరిగే అవకాశాలున్నాయని స్పష్టంగా అర్థమవుతున్నది. 'జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే సమస్యలను నోట్ చేసుకున్నాం..పరిశీలిస్తాం..అని ఇక్కడ చెప్పి బయటకెళ్లాక చెత్తబుట్టల్లో పారేయకుండా చిత్తశుద్ధితో పరిష్కారంపై దృష్టిసారించాలి' అంటూ దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఎమ్మెల్యే విన్నపాలను కూడా పట్టించుకోలేని స్థితిలో పాలక వ్యవస్థ ఉందా? అన్న సందేహాన్ని లేవనెత్తుతున్నది. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాలను నిర్వహించలేదు. ఉదయం 10:03 నిమిషాలకు జీరో అవర్‌తోనే మొదలైంది. దాదాపు రెండు గంటల పాటు నిర్వహించిన జీరో అవర్‌లో 26 మంది సభ్యులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను సభలో ఏకరువు పెట్టారు. తమ నియోజకవర్గంలోని సమస్యల గోడును చెప్పుకునేందుకు ఒక్కో సభ్యునికి సగటున నాలుగు నిమిషాలు దక్కింది. అధికార పార్టీ నుంచి 12 మంది సభ్యులు, బీఆర్ఎస్ నుంచి ఎనిమిదిమంది, బీజేపీ నుంచి ముగ్గురు, ఎంఐఎం నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరు మాట్లాడారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా తమ నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని దాదాపు అందరూ మొరపెట్టుకున్నారు. ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలనీ, ఆస్పత్రులు నిర్మిం చాలనీ, రోడ్లు బాగు చేయించాలనీ, బస్టాండ్లలో కనీస సౌక ర్యాలు కల్పించాలనీ, చెక్‌డ్యామ్‌లు కట్టించాలనీ, కాల్వలకు మర మ్మతులు చేయించాలని కొందరు విన్నవించారు. మరికొందరు తమ నియోజకవర్గాల్లో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని సభాదృష్టికి తీసుకొచ్చారు. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి వాటిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.







మిషన్‌భగీరథ పైలాన్ వేసిన చౌటుప్పల్‌లోనే నీళ్లొస్తలేవు : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు నియోజకవర్గం ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతమనీ, అక్కడ ప్రస్తుతం తాగు నీటి ఇబ్బందులు నెలకొన్నాయని కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సభాదృష్టికి తీసుకొచ్చారు. మిషన్‌భగీరథ పైలాన్ వేసిన చౌటుప్పల్ పట్టణంలోనే తాగునీళ్లు సరిగా రావడం లేదని వాపోయారు. రూ.50 వేల కోట్ల అప్పుతెచ్చి తీసుకొచ్చిన మిషన్ భగీరథ ద్వారా కాంట్రాక్టర్ల చేతుల్లోకి డబ్బులు పోయాయిగానీ, ప్రజలకు మాత్రం నీళ్లందలేదని విమర్శించారు. తన నియోజకవర్గంలోని మండలాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నా నియోజకవర్గానికీ వెయ్యికోట్లు ఇవ్వండి : కౌశిక్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గానికి రూ.800 కోట్లు కేటా యించడమేంటి? అని బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నిం చారు. తన నియోజక వర్గానికి వెయ్యికోట్ల రూపాయలను కేటాయిం చాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో 107 గ్రామా ల్లోని ఏ ఒక్కఊర్లో రుణమాఫీ వంద శాతం పూర్తయినట్టు చూపితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కల్వల ప్రాజెక్టు కట్టాలని డిమాండ్ చేశారు. పంటలెండిపోకుండా పొలా లకు సాగునీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగతా సభ్యులు లేవనెత్తిన అంశాలిలా...

భూపాలపల్లి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంటలకు నీళ్లను అందించాలని కాంగ్రెస్ సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, కాలువల పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని విన్నవించారు. తన నియోజకవర్గంలో ఎల్లోరాఅజంతా గుహలను తలదన్నేలా ఉన్న పాండవుల గుట్టను, రెండు కిలోమీటర్ల గుహలను పర్యాటక ప్రాంతంగా, పలు దేవాలయాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ సభ్యులు కాలేరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..చే నెంబర్ ఫ్లైఓవర్ కింది భాగంలో సర్వీసు రోడ్లను వేసి తమ నియోజకవర్గ ప్రజల సమస్యను తీర్చాలని కోరారు. మూసారాంబాగ్ బ్రిడ్జిని త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. దోమలు, కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని విన్నవించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పది శాతం పనులు పూర్తిచేస్తే వేలాది ఎకరాలకు సాగునీరందించవచ్చునన్నారు. తన నియోజకవర్గంలోని కొండగట్టు దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని విన్నవించారు. బీఆర్ఎస్ సభ్యులు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ..బీఎన్‌రెడ్డినగర్‌లో 44 కాలనీలకు 118 జీవో ద్వారా క్లియరెన్స్ ఇచ్చినా రిజిస్ట్రేషన్లు ఆపడం తగదన్నారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్ మాట్లాడు తూ..బస్తీదవాఖాల్లో డాక్టర్లు లేరనీ, ప్రాథమికమైన మెడిసిన్స్ అందుబాటులో లేవని ప్రస్తావించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ గోలీలు అందుబాటులో అసలే ఉండటం లేదన్నారు. టెస్టులు కూడా సరిగా చేయడం లేదని చెప్పారు. బస్తీదవాఖాల్లోని సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అధికార పార్టీ సభ్యులు యశస్విని రెడ్డి మాట్లాడుతూ..దేవాదుల పేస్-3లోని ఆరో ప్యాకేజీ పూర్తి చేస్తే తన నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు నీళ్ళందించవచ్చన్నారు. దానిపై ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నవించారు. పెద్దవంగరను మండల కేంద్రంగా ప్రకటించినప్పటికీ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయనీ, వాటికి నిధులు విడుదల చేసి సొంత భవనాలు కట్టించాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ శిథిలావస్థలో ఉందనీ, దాన్ని బాగు చేయించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ..మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాల్టీలకు నిధులు విడుదల చేయాలని కోరారు. మెట్‌పల్లి ఆస్పత్రి పెచ్చులూడు తున్నాయనీ, దాన్ని బాగు చేయించాలని విన్నవించారు. రేగుంట మండలంలో మటుకాలువకు రూ.2 కోట్లు వెచ్చిస్తే రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని సూచించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ..తన నియోజకవర్గంలోని ఫారెస్టు భూముల్లో 40 ఏండ్ల కింద పేదలు ఇండ్లను కట్టుకున్నారనీ, దానికి క్లియరెన్స్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. కాంగ్రెస్ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ..బీఆర్ఎస్ పాపం చేసి కాంగ్రెస్ మీద నెట్టి పెద్దలింగాపురంలో రైతులతో ధర్నాలు చేయించడం సరిగాదన్నారు. ఆ రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. తన మానకొండూరు నియోజకవర్గంలో హైలెవల్ బ్రిడ్జీలు కట్టించాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు రాగమయి మాట్లాడుతూ..సైరోబంకర్ సమస్యను పరిష్కరించాలనీ, కాల్వలకు రిపేరు చేస్తే చాలనీ కొత్తగా మరోమారు భూసేకరణ అవసరం లేదని కోరారు. బీజేపీ సభ్యులు రామారావు పవార్ మాట్లాడుతూ..తన నియోజకవర్గంలో డ్యామేజ్ అయిన 100 చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించారు. ఎంఐఎం సభ్యులు కౌసర్‌మొయినొద్దీన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నిజామాబాద్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పేదలకు పంచాలని ధన్‌పాల్ సూర్యనారాయణ, గుండి బ్రిడ్జిని పూర్తి చేయించాలని కోవాలక్ష్మి, పలు స్కూళ్లకు, ధన్వాడ డిగ్రీ కాలేజీకి కొత్తబిల్డింగులు కట్టించాలని డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని గంగుల కమలాకర్, గోదావరి ముంపు నుంచి తమ నియోజకవర్గంలోని ప్రజలను కాపాడాలని పాయం వెంకటేశ్వర్లు, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లోని అసైన్డ్ భూములకు సంబంధించి పేదలకు పట్టాలివ్వాలని లక్ష్మారెడ్డి, తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని దొంతి మాధవరెడ్డిలు కోరారు.



ఓయూలో ఆంక్షలు తగవు..

ఇందిరాపార్కు వద్ద ప్రజాసంఘాల ఆందోళనలకు అనుమతివ్వాలి : కూనంనేని

అసెంబ్లీ జరిగే సమయంలో హైదరాబాద్ కేంద్రంగా ధర్నాలు చేస్తే సభాదృష్టికి తమ సమస్యలు వెళ్తాయనీ, కొంతమేరకైనా పరిష్కారమవుతాయనే ఆశతో ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నాలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని సీపీఐపక్ష నేత కూనంనేని సాంబశివరావు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరా పార్కు వద్ద ఆందోళనకు అనుమతి ఇవ్వకపోవడం సబబు కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధర్నా చౌక్ ఎత్తేస్తే అనేక పోరాటాలు చేశామని గుర్తుచేశారు. హైకోర్టు ఆదేశాల ద్వారా మళ్లీ ధర్నాచౌక్‌లో ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. మళ్లీ గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరించకుండా ఆందోళనలకు అనుమతి ఇవ్వాలని విన్నవించారు. పదేండ్ల కిందటి వరకు ధర్నాచౌక్‌కు మంత్రులు వెళ్లి ధర్నాలు చేసేవారికి ఏదో ఒక హామీ ఇచ్చివచ్చే సాంప్రదాయం ఉండేదనీ, దాన్ని పునరుద్ధరించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాట క్షేత్రంగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాలు ధర్నాలు, ర్యాలీలు, నినాదాలు చేయొద్దని ఆంక్షలు విధించడం ప్రభుత్వానికి తగదని అభిప్రాయపడ్డారు. తక్షణమే ఆంక్షలను ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కళాకారులను, ఉద్యమకారులను గ్రామసభలు పెట్టి గుర్తించి వారికి ఏదో ఒక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి రన్నింగ్ కామెంట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ రన్నింగ్ కామెంట్ ఏంది? కౌశిక్‌రెడ్డి ఆగు. నామీద ఆవేశం చూపడమేంటి తమ్ముడూ. బీఆర్ఎస్ సభ్యులకు ఏది మంచిదో..దేని గురించి మాట్లాడుతున్నారో కూడా తెల్వదు. ప్రజాసమస్యల గురించి ధర్నాలు చేసేందుకు అనుమతివ్వాలని తప్పా?' అంటూ కూనంనేని చురకలు అంటించారు.

రంగారెడ్డి జిల్లాలో ఇల్లీగల్‌గా ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకోవాలి : మల్‌రెడ్డి రంగారెడ్డి

గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లాలో కొందరికి ఇల్లీగల్‌గా ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకోవాలనీ, దాని ద్వారా వచ్చే డబ్బులతో తమ జిల్లాను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సభాదృష్టికి తీసుకొచ్చారు.

రెండు వేల కోట్ల రూపాయల విలువైన 95 ఎకరాలను కొందరికి అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. తమ జిల్లాలో అన్యాక్రాంతం అవుతున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తుర్కయంజాల్ చెరువు మధ్యలో వేల లారీలతో మట్టిపోసి రోడ్లు వేసి కబ్జా చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలోని భూములను అమ్మి ఇతర ప్రాంతాల్లో ఖర్చుపెట్టడమేంటని అడిగారు. ఆ నిధులను తమ జిల్లా అభివృద్ధికి ఎక్కువ ఖర్చుపెట్టాలని విన్నవించారు. లేదంటే భవిష్యత్తులో రంగారెడ్డి జిల్లాలో ఉద్యమం వస్తుందని హెచ్చరించారు.

అప్లయ్.. అప్లయ్.. నో రిప్లయ్ : దానం

జీరో అవర్‌లో లేవనెత్తే సమస్యల విషయంలో అప్లయ్..అప్లయ్..నోరిప్లయ్ అన్నట్టు పరిస్థితి ఉందని బీఆర్ఎస్ సభ్యులు దానం నాగేందర్ వాపోయారు. తానూ గతంలో మంత్రిగా పనిచేశాననీ, నోట్ చేసుకుంటాం అని డస్ట్‌బిన్‌లో పేపర్లు పడేసే ధోరణి ఉందని చెప్పారు. ప్రస్తుత మంత్రులైనా అలా చేయకుండా సమస్యల పరిష్కారం మీద దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. తాను అసెంబ్లీలో సీనియర్ సభ్యుడిని కాబట్టి ఎవ్వరూ తనకు చెప్పాల్సిన అవసరం లేదనీ, తాను మాట్లాడే సమయంలో అనవసరంగా జోక్యం చేసుకోవద్దని బీఆర్ఎస్ సభ్యులకు సూచించారు. తన నియోజకవర్గంలోని పలు స్కూళ్లలో గుడ్లు పెట్టడం లేదనీ, వాటిని పెట్టించాలని విజ్ఞప్తి చేశారు. పలు పాఠశాలల్లో తన నిధుల నుంచి ఆర్వోఆర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని విన్నవించారు. సోషల్‌మీడియాను అరికట్టాలనీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు కొందరు చిన్నపేపర్లు, యూటూబ్ ఛానళ్ల వారితో మిలాఖత్ అయ్యి సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. తన నియోజకవర్గంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో వెంకట్‌రెడ్డి పేదల ఇండ్లను లాక్కుని అపార్ట్‌మెంట్ కట్టారనీ, అక్కడ దానికి ఎలా పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యేగా తాను ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చునన్నారు. తనకు క్యాంపు కార్యాలయం కోసం స్థలమివ్వాలని కోరారు.


నవతెలంగాణ

న్యాయం గెలుస్తుందన్న మాట నిజమేకాని
గెలిచేదంతా న్యాయం కాదు - శ్రీశ్రీ

బుధవారం 19 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

'కంచె చేను మేస్తే'



రాష్ట్రంలో ప్రభుత్వ భూముల్ని వేలం వేసేందుకు రంగం సిద్ధమైందా? దీని ద్వారా ఖజానాపై భారం తగ్గనుందా? భూములమ్మితే తప్ప ఆర్థిక వ్యవస్థ కుదుటపడే అవకాశం లేదా? అంటే, అవుననే సమాధానమే వస్తోంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన నాలుగు వందల ఎకరాల భూముల్ని రాష్ట్ర సర్కార్ అమ్మకానికి పెట్టి రూ.18వేల కోట్ల నిధుల్ని సమకూర్చుకోవాలని చూస్తున్నది! ఈ వేలాన్ని విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ విద్యార్థులు ఇటీవల పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గతంలోనూ ఈ భూములు అన్యా క్రాంతం అవుతున్నాయని, కబ్జాదారుల నుంచి భూముల్ని కాపాడాలని పోరాటాలు చేశారు. అయితే నాటికీ, నేటికీ ఒక తేడా.

ఇప్పటికే ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్లు, ఫార్మసీ, ఐటీ పార్కులు, అభివృద్ధి అంటూ పేదల భూములను కారుచౌకగా లాక్కోవడంతో నిర్వాసితులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అది చాలదన్నట్టు పరిశోధనలకు, మేధో సంపత్తికి నిలయమైన యూనివర్సిటీ భూముల్ని కూడా వేలం వేయడమంటే భవిష్యత్తు తరానికి విద్యను దూరం చేయడమే. ఇప్పటికైనా భూముల వేలంపై పునరాలోచించాలి. పిలిచిన టెండర్లను వెంటనే నిలిపివేయాలి. భూముల్ని రక్షించే పద్ధతుల్ని విడనాడి భక్షించే విధంగా ముందుకెళ్తే గనుక 'కంచె చేను మేస్తే' అన్న సామెతను కాంగ్రెస్ సర్కార్ నిజం చేసినట్టే!

గతంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల్ని కబ్జా చేసేందుకు యత్నించడంతో ఆ భూముల్ని ప్రభుత్వం కాపాడాలని ఉద్యమించారు. ప్రస్తుతం సర్కారే ఈ భూముల్ని ప్రయివేటుకు కట్టబెడుతుండటం అందరినీ కలవరపెడుతున్న అంశం. హెచ్‌సీయూ భూములపై ఈ నెల పది హేనవ తేదీన తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (టీజీఐఐసీ) టెండర్లను కూడా ఆహ్వానించింది. దీనిపై విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కోర్టులో పిటిషన్ వేసేందుకు సన్నద్ధమవుతున్నాయి.

అసలు హెచ్‌సీయూ భూముల్ని ఎందుకు వేలం వేస్తున్నారన్నది ప్రశ్న? 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం యూనివర్సిటీకి చెందిన నాలుగు వందల ఎకరాల భూమిని ఒక స్పోర్ట్స్ అకాడమీకి ఎకరానికి రూ.యాభై వేల చొప్పున కేటాయించింది. కానీ ఈ భూమిలో అకాడమీ కార్యకలాపాలు కొనసాగించకపోవడంతో సర్కారే మళ్లీ స్వాధీనం చేసుకుంది. ఇప్పుడు ఆ భూములపై ప్రస్తుత ప్రభుత్వం కన్నుపడింది. టీజీఐఐసీ ద్వారా వేలం వేసి నిధుల సమీకరణకు సిద్ధమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు భూములమ్మేందుకు ఇలాంటి ప్రయత్నమే చేసి భంగపడింది. హైదరాబాద్‌లోని ముఖ్యమైన ప్రాంతాలు, కార్పొరేషన్లు, సర్కార్ ఆధీనంలో ఉన్న భూములమ్మి వేల కోట్ల రూపాయల్ని పోగుచేసేందుకు ప్రయత్నించింది. దీనిపై అప్పటి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పెద్ద ఎత్తున విరుచుకుపడింది. భూములమ్మితే ఊరుకోబోమని హెచ్చరించింది. ఇతర పక్షాలు, ప్రజలు, విద్యావంతులు, మేధావుల ప్రతిఘటనతో ఆ విషయం అంతటితో సద్దుమణిగింది. మరి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన సర్కార్ ఏం చేస్తున్నది? 'కేసీఆర్ చెప్పుల్లోనే ..కాళ్లు దూర్చేందుకు' సిద్ధమౌతున్నది.

కేంద్రీయ విశ్వవిద్యాలయానిది ఒక చరిత్ర. 1969 తెలంగాణ ఉద్యమంలో 399 మంది పోరాటయోధులు అమరులవ్వగా, వారి బలిదానంగా 610 జీవో విడుదలైంది. తెలంగాణ ఉద్యమం తొలిదశలోని ఆరుపాయింట్ల ఫార్ములాలో రెండవ అంశంగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఏర్పడింది.ఆర్టికల్ 371 ప్రకారం ఏర్పడిన ఈ వర్సిటీ మొత్తం 2324 ఎకరాలు ఉండేది. రానురానూ గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, బస్‌డిపో, టీఐఎఫ్ఆర్‌లాంటి అనేక ప్రాజెక్టుల కోసం ఈ భూమినే ప్రభుత్వాలు వాడుకున్నాయి. చివరకు మిగిలింది పద్దెనిమిది వందల ఎకరాలు. ఇప్పుడు వేలం వేస్తున్నది అందులోని భూమే. మరోవైపు ఓయూ, కాకతీయ, తెలంగాణ విశ్వ విద్యాలయాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని పరిస్థితి. కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకున్న భూమిని విడిపించాల్సింది పోయి వర్సిటీ భూములను అమ్మకానికి పెట్టడం సమంజసమా? ఇదిగాక, ఇలాంటి విధానాల్ని వ్యతిరే కిస్తూ ఉద్యమించకుండా వర్సిటీల్లో ర్యాలీలు, ధర్నాలు నిషేధిస్తున్నట్టు సర్క్యులర్ జారీచేయడం విద్యార్థుల గొంతు నొక్కడం కాదా!

హెచ్‌సీయూ.. దక్షిణ భారతంలో ఉన్నతమైన ప్రమాణాలతో, నాణ్యమైన విద్యా,పరిశోధనలతో పేరు ప్రఖ్యాతలు గడించింది. భవిష్యత్తులో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు వందల ఎకరాల భూమి అవసరం. ప్రభుత్వం అక్రమంగా భూములమ్మితే యూనివర్సిటీ భవిష్యత్తు అంధకారమే. అంతేకాదు, వర్సిటీ భూమిలో వేలాది చెట్లు, పక్షులు, వివిధ జాతుల జంతువులు, వందల సంవత్సరాల నాటి శిలలు (రాక్స్) ఉన్నాయి. ఈ భూముల్ని వేలం వేస్తే పరిస్థితేమిటి? పర్యావరణం గురించి ఆలోచించరా? ఇప్పటికే ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్లు, ఫార్మసీ, ఐటీ పార్కులు, అభివృద్ధి అంటూ పేదల భూములను కారుచౌకగా లాక్కోవడంతో నిర్వాసితులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అది చాలదన్నట్టు పరిశోధనలకు, మేధో సంపత్తికి నిలయమైన యూనివర్సిటీ భూముల్ని కూడా వేలం వేయడమంటే భవిష్యత్తు తరానికి విద్యను దూరం చేయడమే. ఇప్పటికైనా భూముల వేలంపై పునరాలోచించాలి. పిలిచిన టెండర్లను వెంటనే నిలిపివేయాలి. భూముల్ని రక్షించే పద్ధతుల్ని విడనాడి భక్షించే విధంగా ముందుకెళ్తే గనుక 'కంచె చేను మేస్తే' అన్న సామెతను కాంగ్రెస్ సర్కార్ నిజం చేసినట్టే!

విప్లవ ధృవతార మల్లు స్వరాజ్యం



వెట్టిచాకిరీ రద్దు చేయాలని, దున్నేవానికి భూమి కావాలని, నైజాం నవాబు గద్దె దిగాలనే నినాదాలతో సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినది. ఆ పోరాట ఫలితంగానే తెలంగాణలో నాలుగు వేల మంది వీరమరణం పొందారు.మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి.పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేశారు. భూస్వాముల భూములు,గడీలు ప్రజల స్వాధీనమైనవి.వెట్టిచాకిరీ రద్దయింది.వడ్డీ వ్యాపారం అక్రమ బేదాఖళ్లు నిలిపి వేయబడ్డాయి. వ్యవసాయ కూలిరేట్లు పెంచబడ్డాయి. గ్రామాలను గ్రామ రైతు కమిటీలు పాలించాయి. ఇలాంటి విప్లవ పోరాటంలో కీలకపాత్ర పోషించిన ధీర వనిత, అణగారినవర్గాల హక్కుల గొంతుకగా నిలిచారు కామ్రేడ్ మల్లుస్వరాజ్యం. ఆమె తృతీయ వర్ధంతి నేడు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెంలో ని ఓ భూస్వామ్య కుటుంబంలో 1931లో మల్లు స్వరాజ్యం జన్మించారు. చిన్ననాడే పోరాట పంథాను ఎంచుకున్నారు. పదకొండేండ్ల వయస్సులో ఆమె తండ్రి చనిపోయాడు.అక్క శశికళ కూడా పోరా టంలో మూడేండ్లపాటు జైలు జీవితం గడిపారు.స్వరాజ్యం తల్లి చుక్కమ్మ గొప్ప సామ్యవాది.తన కుటుంబమంతా నేటికి విప్లవ రాజకీయాలతో పెనవేసుకొని ఉన్నది. నాడు చెక్క పలకలపై ఇసుకలో ఓనమాలు దిద్దుకొని క్రమంగా ఐదో తరగతి వరకు విద్యను అభ్యసించారు. చిన్నతనంలో కమ్యూనిస్టు భావాలు అలవర్చుకొని దోపిడీకి వ్యతిరేకంగా,తన సొంత గ్రామంలో గ్రామ పటేళ్లను,పెత్తందార్లను ఎదిరించి పాలేర్ల సంఘం పెట్టి కూలిరేట్ల ఉద్యమంతో ప్రారం భమైన ఆమె విప్లవ జీవితం ఎనిమిది దశాబ్దాల పాటు ఎన్నడూ వెను దిరగలేదు. విప్లవమే జీవితంగా భావించారు. ఎన్ని కష్ట నష్టాలొచ్చినా, పోరాటాలకు తట్టుకోలేక భూస్వాములు ఆమె సొంత ఇంటిని ధ్వంసం చేసినా, స్వరాజ్యంను పట్టుకుంటే బహుమ తులిస్తామని నాటి సర్కార్ ప్రకటించినా మొక్కవోని ధైర్యంతో తన అన్న భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి (బి.యన్.) అడుగు జాడల్లో నడిచిన పోరాట యోధురాలు స్వరాజ్యం.

1945, 1948 సంవత్సరాల్లో సాగిన వీరోచిత రైతాంగ పోరాటంలో స్వరాజ్యం కీలక పాత్ర పోషించారు. నైజాం సర్కారును గడగడలాడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో దళ కమాండర్‌గా, గోదావరి అడవుల్లో మూడేండ్ల పాటు పాటు పనిచేశారు. ఆమె మొదట జోన్ కార్యకర్తగా ఆ తర్వాత ప్రాంతీయ కమిటీ సభ్యురాలిగా, గుండాల కేంద్రంలో కోయ లను ఉత్తేజపరిచి వారికి నాయకత్వం వహించి పోరాటాల్లోకి దింపారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ అణగారిన వర్గాల్లోకి, వ్యవసాయ కార్మికుల్లోకి చొచ్చుకొని పోయి వారిలో ఒకరిగా ప్రజలతో మమేకమయ్యే లక్షణం కలిగి ఉన్న స్వరాజ్యం జీవితాంతం పేదల అభ్యున్నతికే తపించారు. తదనంతరం మార్క్సిస్టు పార్టీ ఉద్యమంలో కీలకమైన బాధ్యత నిర్వహిస్తూ తుంగతుర్తి శాసనసభ్యురాలిగా గెలిచి ప్రజా ప్రతినిధిగానూ సేవలందించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా,మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక పోరాటల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. నైజాం రజాకార్ల బారి నుండి రైతాంగాన్ని రక్షించుకొనేందుకు పదివేల మంది గ్రామరక్షక దళాలు, రెండు వేల మంది గెరిల్లా సాయుధ దళాలు నిర్మించారు. ఫలితంగా సాగిన పోరాటంలో మధ్యయుగాల నాటి నైజాం నవాబు పాలన అంతమొందింది.కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన సాయుధ రైతాంగ పోరాటం అనేక విజయాలు సాధించింది. ఫలితంగా దేశ వ్యాప్తంగా భూసంస్కరణ చట్టం, కౌలుదారి చట్టాలు రూపొందాయి. పౌర హక్కులు, ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయి. ఈ చారిత్రక పోరా టంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం పాత్ర అద్వితీయం, అజరామరం.ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శం

(నేడు సూర్యాపేటలో మల్లు స్వరాజ్యం తృతీయ వర్ధంతి సభ)

- ములకలపల్లి రాములు,
9490098338

ఎమెన్‌పై అమెరికా దాడి, గాజాలో తిరిగి మారణకాండ!



ఎం కోటేశ్వరరావు
8331013288

సామ్రాజ్యవాదులకు ప్రత్యేకించి ప్రపంచాన్ని తన చంకలో పెట్టుకోవాలని చూస్తున్న అమెరికాకు నిత్యం ఎక్కడో ఒక చోట ఉద్రిక్తతలు లేదా యుద్ధం ఉండాల్సిందే. అప్పుడే అక్కడి మిలిటరీ పరిశ్రమలు పని చేస్తాయి, బిలియన్ల కొద్దీ లాభాలు సంపాదించి పెడతాయి. ఒక వైపు ఉక్రెయిన్‌లో పోరు నివారిస్తా, పుతిన్‌తో మాట్లాడతా అంటున్న ట్రంప్ మరోవైపు మధ్య ప్రాచ్యంలోని ఎమెన్‌పై శనివారం నుంచి వైమానిక దాడులకు తెరతీశాడు. దీనికి కారణమేమిటి ? ఈ సందర్భంగా తోడేలు - మేకపిల్లను కథను గుర్తుకు తెచ్చుకోవాలి. కాలువ నీటిని మురికి చేస్తూ నేను తాగేందుకు పనికి రాకుండా చేస్తున్నావంటూ మేకపిల్లతో తోడేలు దెబ్బలాటకు దిగింది. అదేమిటి నువ్వు ఎగువ ఉన్నాను, నేను దిగువ ఉన్నాను, పైన నీళ్లు ఎలా మురికి అవుతాయని మేకపిల్ల ప్రశ్నించింది. నువ్వు గాకపోతే నీ అమ్మ మురికి చేసిందంటూ తోడేలు మేకపిల్ల మీద దాడి చేసి మింగేసింది. తాజా దాడులకు ట్రంప్ చెబుతున్న కారణం కూడా అదే మాదిరి ఉంది. ఎర్ర సముద్రంలో నౌకలపై జనవరి 19 తర్వాత ఎమెన్ ఎలాంటి దాడులు జరపలేదు కదా ఇప్పుడెందుకు దానిపై యుద్ధానికి దిగారని ప్రశ్నిస్తే గతంలో వారు చేసిన దాడులతో మాకు ఎంతో నష్టం జరిగింది, ప్రాణాలకు ముప్పు తలెత్తిందని ట్రంప్ చెబుతున్నాడు. నిజానికి దుష్టాలోచనతోనే అమెరికా తెగించింది. గాజాలో కుదిరిన శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయిల్ మరోసారి అక్కడి పౌరులను హత్య చేసేందుకు పూనుకుంది. సోమవారం రాత్రి నుంచి ఆకస్మి కంగా వైమానిక దాడులు జరిపి వందలాది మంది ప్రాణాలు తీసింది. ఎలాంటి ముందస్తు ప్రకటనలూ చేయలేదు. మానవతా పూర్వక సాయం చేస్తున్న ప్రాంతాలను కూడా వదల్లేదు. ఇదే సమయంలో దానికి మద్దతుగా ఎమెన్‌పై అమెరికా దాడులు ప్రారంభించింది.ఈ రెండింటిని వేర్వేరుగా చూడలేము.

ఉద్రిక్తతలను సడలించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అగ్రరాజ్యం అమెరికా మధ్య ప్రాచ్యంలో మరోసారి అగ్నికి ఆజ్యం పోసింది. శనివారం నుంచి ఎర్ర సముద్ర తీరంలోని ఎమెన్‌పై వైమానిక దాడులకు పూనుకుంది. రాజధాని సనా నగరంతో సహా ముప్పై ప్రాంతాల మీద దాడులు జరుగుతున్నట్లు పెంటగన్ వర్గాలు పేర్కొన్నాయి. దానికి ప్రతిగా ఆ ప్రాంతంలో తిష్టవేసిన అమెరికా విమానవాహక యుద్ధనౌక, ఇతర మిలిటరీ నౌకలపై హౌతీ సాయుధులు దాడులు చేస్తున్నారు. అమెరికా దాడులకు తక్షణ కారణంగా చెబుతున్న సాకును చూస్తే దుష్టాలోచన కడుపులో పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు విరామంగా శాంతి ఒప్పందం కుదిరింది. దాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్‌ను పల్లెత్తు మాట అనని ట్రంప్ ఎమెన్‌పై దాడులకు ఆదేశించాడు. పదిరోజులుగా గాజాలోని పాలస్తీనియన్లకు బయటి నుంచి వస్తున్న సాయాన్ని అందనీయకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటున్నది. అలాగే కొనసాగితే తాము అటువైపు వెళ్లే నౌకలపై దాడులకు దిగుతామని హౌతీలు ప్రకటించారు తప్ప కొత్తగా ఎలాంటి దాడి చేయలేదు.ఈ ప్రకటనను సాకుగా తీసుకొని తమ నౌకలకు ముప్పు తలెత్తిందని, స్వేచ్ఛగా నౌకాయానం జరగాలంటూ దాడులు జరుపుతున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ దాడుల్లో కొంత మంది నేతలను చంపివేసినట్లు అధ్యక్ష భవనం ఒక ప్రకటన చేసింది. మొత్తం యాభైమూడు మంది మరణించారు.

గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు విరామంగా శాంతి ఒప్పందం కుదిరింది. దాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్‌ను పల్లెత్తు మాట అనని ట్రంప్ ఎమెన్‌పై దాడులకు ఆదేశించాడు. పదిరోజులుగా గాజాలోని పాలస్తీనియన్లకు బయటి నుంచి వస్తున్న సాయాన్ని అందనీయకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటున్నది. అలాగే కొనసాగితే తాము అటువైపు వెళ్లే నౌకలపై దాడులకు దిగుతామని హౌతీలు ప్రకటించారు తప్ప కొత్తగా ఎలాంటి దాడి చేయలేదు.ఈ ప్రకటనను సాకుగా తీసుకొని తమ నౌకలకు ముప్పు తలెత్తిందని, స్వేచ్ఛగా నౌకాయానం జరగాలంటూ దాడులు జరుపుతున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ దాడుల్లో కొంత మంది నేతలను చంపివేసినట్లు అధ్యక్ష భవనం ఒక ప్రకటన చేసింది. మొత్తం యాభైమూడు మంది మరణించారు.

గాజా ప్రాంతంపై దాడులకు తెగబడి 2023 అక్టోబరులో మారణకాండకు పాల్పడిన ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ అప్పటి నుంచి ఇటీవలి శాంతి ఒప్పందం వరకు 136 యుద్ధ, వాణిజ్య నౌకలు ప్రత్యేకించి ఇజ్రాయెల్ వైపు ప్రయాణించేవాటిమీద హౌతీలు దాడులు జరిపారు.క్షిపణులు, డ్రోన్లతో జరిపిన దాడుల్లో రెండు నౌకలు మునిగిపోగా నలుగురు నావికులు మరణించారు. శాంతి ఒప్పందం అమల్లోకి వచ్చిన జనవరి 19 నుంచి ఎలాంటి దాడుల్లేవు. గాజాలోని పౌరులకు అందచేస్తున్న సాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ నౌకల మీద దాడులు చేస్తామని గత బుధవారం నాడు హౌతీలు ప్రకటించగా ఆ సాకుతో శనివారం నుంచి అమెరికా దాడులకు తెగబడింది." హౌతీల దాడుల కారణంగా అమెరికా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్ల నష్టం జరిగింది.అమాయకుల ప్రాణాలకు ముప్పు తలెత్తింది " అని ట్రంప్ సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాడు. గాజాను మొత్తంగా సర్వనాశనం చేసి వేలాది మంది పౌరులను ఊచకోత కోసి ఇజ్రాయిల్ కలిగించిన బాధ, వేదనలు ట్రంప్‌కు కనిపించలేదు. ప్రస్తుతం ఎర్ర సముద్రంలో యుఎస్ఎస్ హారీట్రూమన్ విమానవాహక నౌక, మూడు నౌకాదళ డెస్ట్రాయర్లు, ఒక క్రూయిజర్‌ను అమెరికా మోహరించింది. ఇవిగాక యుఎస్ఎస్ జార్జియా అనే క్రూయిజ్ క్షిపణి జలాంతర్గామి కూడా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నది. అమెరికా షిప్పింగ్, వైమానిక, నౌకాదళ ఆస్తుల రక్షణకు, స్వేచ్ఛగా నౌకా విహారం కోసం దాడులు చేసినట్లు ట్రంప్ చెప్పాడు.హౌతీల చర్యలకు పూర్తి బాధ్యత ఇరాన్‌దే అని ఆరోపించాడు. హౌతీల దాడులను ఇరాన్ చేసినట్లుగానే పరిగణిస్తామన్నాడు. నౌకలపై దాడులను ఆపేంతవరకు తమ దాడులు కొనసాగుతాయని చెప్పాడు.2025 జనవరి 20న రెండవసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరొక దేశంపై ట్రంప్ జరిపిన తాలిదాడిగా చరిత్రలో నమోదైంది.

2015లో ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందం నుంచి గతంలో ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం ఏకపక్షంగా ఉపసంహరించుకుంది. తాజాగా మరోసారి దాని గురించి చర్చించేందుకు ముందుకు రావాలని ఇరాన్‌కు లేఖ రాసినట్లు అమెరికా చెప్పింది. తాము సముఖంగానే ఉన్నామని అయితే వత్తిడి, బెదిరింపులతో చర్చలకు వచ్చేది లేదని, తమకు అందిన లేఖలో కొత్త విషయాలేమీ లేవని, దాని మీద తరువాత స్పందిస్తామని ఖమేనీ నాయకత్వం స్పష్టం చేసింది. ఒకవైపు సంప్రదింపుల ప్రకటనలు చేస్తూనే మరోవైపు రెచ్చగొట్టే విధంగా ట్రంప్ ఆచరణ ఉంది.తమతో ఒప్పందానికి రాకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తామని బెదిరించాడు.తమ విదేశాంగ విధానం ఎలా ఉండాలో ఆదేశించే అధికారం అమెరికాకు లేదని ఇరాన్ స్పష్టం చేసింది.తమపై దాడులకు దిగిన అమెరికా నౌకాదళంపై రెండుసార్లుగా పద్దెనిమిది క్షిపణులు, ఒక డ్రోన్‌తో దాడి చేసినట్లు ఎమెన్ హౌతీలు ప్రకటించారు. రెండు పక్షాలూ మిలిటరీ చర్యలను విరమించాలని ఐరాస కోరింది. అమెరికా దాడుల పర్యవసానాలను గల్ఫ్ దేశాలు పరిశీలిస్తున్నాయి, పరిమిత దాడులా లేక నిరవధికంగా సాగించేది స్పష్టం కాలేదు. తమ నౌకలపై దాడులను నిలిపివేసేంతవరకు తమ చర్యలు కొనసాగుతాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ అన్నాడు. అమెరికా 47 వైమానిక దాడులు జరిపింది. ప్రపంచ నౌకా రవాణా ఎర్ర సముద్రం ద్వారా పన్నెండుశాతం జరుగుతోందని, అమెరికా దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని చర్చలు జరపాలని రష్యా కోరింది.చైనా కూడా అదే మాదిరి స్పందించింది.



2015లో ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందం నుంచి గతంలో ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం ఏకపక్షంగా ఉపసంహరించుకుంది. తాజాగా మరోసారి దాని గురించి చర్చించేందుకు ముందుకు రావాలని ఇరాన్‌కు లేఖ రాసినట్లు అమెరికా చెప్పింది. తాము సముఖంగానే ఉన్నామని అయితే వత్తిడి, బెదిరింపులతో చర్చలకు వచ్చేది లేదని, తమకు అందిన లేఖలో కొత్త విషయాలేమీ లేవని, దాని మీద తరువాత స్పందిస్తామని ఖమేనీ నాయకత్వం స్పష్టం చేసింది. ఒకవైపు సంప్రదింపుల ప్రకటనలు చేస్తూనే మరోవైపు రెచ్చగొట్టే విధంగా ట్రంప్ ఆచరణ ఉంది.తమతో ఒప్పందానికి రాకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తామని బెదిరించాడు.తమ విదేశాంగ విధానం ఎలా ఉండాలో ఆదేశించే అధికారం అమెరికాకు లేదని ఇరాన్ స్పష్టం చేసింది.తమపై దాడులకు దిగిన అమెరికా నౌకాదళంపై రెండుసార్లుగా పద్దెనిమిది క్షిపణులు, ఒక డ్రోన్‌తో దాడి చేసినట్లు ఎమెన్ హౌతీలు ప్రకటించారు. రెండు పక్షాలూ మిలిటరీ చర్యలను విరమించాలని ఐరాస కోరింది.

నాలుగో వంతు షియా, నాలుగింట మూడువంతుల సున్నీ ముస్లిం తెగలతో కూడిన దేశం ఎమెన్. మిలిటరీ, నౌకారవాణా రీత్యా కీలకమైన అరేబియా-ఎర్ర సముద్రాలను కలిపే ఏడెన్ గల్ఫ్‌లో ఉన్న ఆసియా దేశం. ఎదురుగా ఆఫ్రికాలోని జిబౌటీ ఉంది. సౌదీ అరేబియా, ఓమన్, ఎర్ర సముద్రం, అరేబియా సముద్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. అరేబియా సముద్రంలో ప్రవేశించాలంటే ఎమెన్ దాటి రావాల్సిందే. ఈ కీలకమైన ప్రాంతాన్ని అదుపులోకి తెచ్చుకొనేందుకు అమెరికా దీర్ఘకాలంగా ప్రయత్నిస్తున్నది. మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ కేంద్రంగా ఉన్న ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమైనపుడు ఉత్తర ఎమెన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. అయితే బ్రిటీష్ వారు ఏడెన్ గల్ఫ్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని దక్షిణ ఎమెన్ ప్రాంతాన్ని తమ రక్షిత వలస దేశంగా ఉంచుకున్నారు.1960దశకంలో సోవియట్ యూనియన్ మద్దతుతో రెండు సంస్థలు వలస పాలకులపై తిరుగుబాటు చేశాయి. దాంతో ఉత్తర ఎమెన్‌లో 1967లో విలీనం చేసేందుకు ఆంగ్లేయులు ప్రతిపాదించారు. తర్వాత జరిగిన పరిణామాల్లో 1972లో ఉత్తర,దక్షిణ ఎమెన్ ప్రాంతాలలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఉత్తర ఎమెన్‌లో ఉన్నవారికి కమ్యూనిస్టు వ్యతిరేక సౌదీ అరేబియా, దక్షిణ ఎమెన్‌కు సోవియట్ మద్దతు ఇచ్చింది. అదే ఏడాది కైరోలో కుదిరిన ఒప్పందం మేరకు రెండు ప్రాంతాలను విలీనం చేసేందుకు నిర్ణయించారు. రెండు చోట్ల వేర్వేరు ప్రభుత్వాలు ఉన్నాయి. 1979లో తిరిగి అంతర్యుద్ధం చెలరేగింది.1990లో విలీనం జరిగే వరకు ఉత్తర ఎమెన్‌కు సౌదీ మద్దతు కొనసాగింది.

వర్తమాన విషయాలకు వస్తే పేరుకు ఎమెన్ దేశంగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రాంతాన్ని పాలించే ప్రభుత్వం పేరుకు మాత్రమే ఉంది. మొత్తం ఆరు సాయుధ శక్తులు ఆయా ప్రాంతాలపై పట్టు కలిగి ఉన్నాయి. నిత్యం చర్చల్లో ఉండేది హౌతీలు. ఎందుకంటే రాజధాని సనాతో సహా కీలక ప్రాంతాలన్నీ వారి చేతిలో ఉన్నాయి. అమెరికా లేదా ఇజ్రాయిల్ చేసే దాడులన్నీ ఈ ప్రాంతం మీదనే. వీరికి ఇప్పుడు ఇరాన్ మద్దతు ఇస్తుండగా వ్యతిరేకించే శక్తులకు గతంలో సౌదీ అరేబియా సాయం చేసేది. చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్, సౌదీ సాధారణ సంబంధాలు నెలకొల్పుకొనేందుకు అంగీ కరించటంతో ఇప్పుడు సౌదీ సాయం నిలిచిపోయింది.హౌతీలను వ్యతిరేకించేవారికి అమెరికా మద్దతు కొనసాగుతోంది. ఇజ్రాయిల్‌తో పాటు తన మద్దతుదార్లకు తోడ్పడేందుకు అమెరికా గతంలో, తాజా దాడులు జరుపుతోంది. హౌతీ అంటే దేవుడి సహాయకులు అనే అర్థంతో పాటు ముస్లింలో ఒక గిరిజన తెగ అది. ఇతర ముస్లింలకు దీనికి తేడా ఉంది, వీరు ఎమెన్‌లో తప్ప మరో ఏ ఇస్లామిక్ దేశంలోనూ లేరు.

శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయిల్ నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు బయటి నుంచి వస్తున్న సాయాన్ని అందకుండా అడ్డుకుంటున్నది.మరోవైపు హమాస్ మీద నిందలు వేస్తూ సోమవారం రాత్రి నుంచి గాజాలోని గుడారాల్లో ఆశ్రయం పొందిన అభాగ్యుల మీద వైమానిక దాడులకు తెగబడి 200 మందికి పైగా ప్రాణాలు తీసినట్లు వార్తలు వచ్చాయి. మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నానికి అందిన సమాచారం మేరకు 300గా తేలింది. వీరిలో ఎక్కువ మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. హమస్ తిరిగి సాయుధంగా తయారవుతున్నదని, వారి నేతల మీదనే దాడులు జరుపుతున్నట్లు ఇజ్రాయిల్ ప్రపంచాన్ని నమ్మించేందుకు పూనుకుంది. బందీల విడుదలకు హమస్ తిరస్కరిస్తున్నదని, కాల్పుల విరమణకు తమ ప్రతిపాదనలను ఆమోదించటం లేదంటూ పెద్ద ఎత్తున దాడులకు మిలిటరీని పంపాలని ప్రధాని నెతన్యాహు ఆదేశించాడు. గాజాలో నరక ద్వారాలు తెరుస్తామని మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ చెప్పాడు. గతంలో అంగీకరించిన ఒప్పందంలో రెండవ దశను ఉల్లంఘించేందుకే తాజా దాడులని పరిశీలకులు చెబుతున్నారు. ఇజ్రాయిల్ ఏకపక్షంగా కాల్పుల విరమణకు స్వస్తి పలుకుతున్నదని హమాస్ విమర్శించింది. మరోసారి ప్రారంభమైన దమనకాండకు అమెరికా కూడా బాధ్యత వహించాల్సిందే !

రవాణా రంగ కార్మికుల 'చలో పార్లమెంటు'



వి.ఎస్.రావు
9490098890

దేశంలోని ఆర్టీసీలను రక్షించుకోవడం కోసం, రవాణా రంగాన్ని కాపాడుకోవడం కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం 2025 మార్చి 24న 'చలో పార్లమెంట్'కు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) పిలుపునిచ్చింది. ఇది కేంద్రానికి ఒక హెచ్చరిక లాంటిది. దశాబ్దకాలంగా మోడీ అనుసరిస్తున్న విధానాల వలన రవాణా రంగం, ఈ రిక్షా మొదలుకొని ఆటో, టాక్సీ, లారీ, ప్రయివేటు బస్సు, ఆర్టీసీ వగైరాలన్నీ తీవ్ర సంక్షోభంలో నెట్టబడ్డాయి. కార్మికుల పని పరిస్థితులు దుర్భరంగా మారాయి.ఎం.వి.యాక్ట్- 2019ను తీసుకొచ్చిన కేంద్రం భారతదేశంలో ఇప్పటి వరకున్న పర్మిట్ వ్యవస్థను మార్చివేసింది. గతంలో స్టేజి క్యారేజి, కాంట్రాక్ట్ క్యారేజీలుగా ఉన్న పర్మిట్‌లను నేషనల్ పర్మిట్‌గా మార్చి వందశాతం ప్రయివేటును ప్రోత్సహిస్తున్నారు. నేషనల్ టూరిస్ట్ పర్మిట్ పేరుతో కారు నుండి బస్ వరకు కేవలం రూ.10వేల నుండి 3లక్షల వరకు చెల్లిస్తే ఒక ఏడాది పాటు దేశంలో ఎక్కడ నుండి ఎక్కడికైనా, ఎన్నిసార్లయినా స్టేజి క్యారేజీగా నడుపుకొనే అవకాశం ప్రయివేటు యజమానులకు కల్పించి, ఆర్టీసికి పోటీగా ప్రయివేటును ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా వేల ప్రయివేటు బస్సులు తెలంగాణ రాష్ట్ర రోడ్లపై కూడా కనపడుతున్నాయి. 'అగ్రిగేటర్స్' పేరుతో యాప్ ఆధారిత సంస్థలను ప్రజారవాణాలోకి అనుమతించారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి సంస్థలతో పాటు ఎటువంటి పర్మిట్ లేకుండానే అనేక సంస్థలు ఈ రోజున ఆర్టీసికి పోటీగా రాష్ట్ర రోడ్లపై తిరుగుతున్నాయి.

ఆలిండియా టూరిస్ట్ పర్మిట్‌లు విరివిగా ఇవ్వాలని, అది కూడా అప్లయ్ చేసుకొన్న ఏడు రోజుల్లోపు ఇవ్వాలని, ఏ కారణం చేతనైనా అలా ఇవ్వలేకపోతే 8వ రోజు నుండి పర్మిట్ పొందిన సంస్థగా భావించి బస్సులు నడుపుకోవచ్చని జీఎస్ఆర్ 302(అ)18 ఏప్రిల్ 2023న కేంద్రం విడుదల చేసింది. డీజిల్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణం కాపాడు తామని, ప్రత్యామ్నాయ ఇంధనం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్‌లను ప్రోత్సహిస్తున్నది. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో ఫేమ్-1, ఫేమ్-2, పీఎంఈ బస్, ఎన్ఈబిపీ, పీఎంఈ డ్రైవ్ వంటి అనేక పథకాలను ముందుకు తెచ్చింది. విద్యుత్ బస్‌లన్నీ ప్రయివేటు సంస్థల నుండి 'గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్-జీసీసీ' పద్ధతిలో తీసుకోవాలనే నిబంధనను పెట్టింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలన్నీ ఆ విద్యుత్ బస్సుల కన్సార్టియంలకే చెందుతున్నాయి. ఈ విద్యుత్‌బస్సుల స్కీంలో వచ్చే విద్యుత్‌బస్సుల టెండర్లు నిర్వహించే బాధ్యతను 'కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్-సీఈఎస్ఎల్‌కు అప్పజెప్పింది. విద్యుత్ బస్‌ల నిర్వహణ పేరుతో ఈ రోజు విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలు అన్ని ఆర్టీసీల్లో తిష్టవేస్తున్నాయి. విద్యుత్ బస్సులను ప్రోత్సహించడం పేరుతో పర్మిట్ అవసరమే లేని విధంగా నిబంధనలు సవరించారు.

2030 నాటికి భారతదేశంలో ప్రస్తుతం ఆర్టీసీల ద్వారా నడపబడుతున్న లక్షా నలభై వేల బస్సులతోపాటు మొత్తం ఎని మిది లక్షల విద్యుత్ బస్సులను తీసుకుని రావాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం చేసింది. ఈ విద్యుత్ బస్సుల విధానంలో ఆర్టీసీలు నిర్వహించేది మధ్యవర్తి పాత్రగానే ఉంటుంది. హైదరాబాద్‌లోని అనుభవం పరిశీలిస్తే, విద్యుత్ బస్ సంస్థకు కి.మీ. రూ.67లో చెల్లించాలి. ఆ బస్సుపై ఇద్దరు కండక్టర్లు పనిచేస్తారు కాబట్టి వారి జీతాల ఖర్చు కి.మీ. రూ.22, దీంతోపాటు ఓవర్ హెడ్స్ ఖర్చు మరో రూ.7 ఉంటుంది. అంటే హైదరాబాద్ నగరంలో విద్యుత్ బస్సులకు కి.మీ. రూ.96 ఖర్చు వస్తుంటే, మహాలక్ష్మి పథకంతో కలిపి ఆదాయం రూ.50 వస్తుంది. అంటే కి.మీ.కు రూ.46 ఆర్టీసీ అదనంగా చెల్లించాలి. ఆ డబ్బులు ఎక్కడ నుండి తెచ్చిస్తారు? ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండ్‌గా ఆ డబ్బులు ఇవ్వాలి, కానీ ఇవ్వడం లేదు. ఆ రకంగా ఆర్టీసి కోలుకోలేని స్థితిలోకి నెట్టబడుతున్నది. వేలాది కోట్ల రూపాయలు కార్మికుల సొమ్మును ఆర్టీసీ వాడుకున్నది. వేతన ఒప్పందాలు చేయడం లేదు. ప్రకటించిన వేతన ఒప్పందాల అరియర్స్ కూడా చెల్లించడం లేదు.



ఎం.వి.యాక్ట్ సవరణలు చేసి స్క్రాప్ పాలసీని ముందుకు తెచ్చారు. వాహన ఉత్పత్తిదారుల లాభాలను గ్యారెంటీ చేయడమే ఈ పథకం లక్ష్యం. వేలకోట్ల నిధుల లేమితో కొత్త బస్‌లు కొనుగోలు చేసే స్థితిలో ఆర్టీసీలు లేవు. ఆర్టీసీ బస్సులు స్క్రాప్ చేసిన స్థాయిలో బస్సులు కొనలేవు, కాబట్టి ప్రజల అవసరాల పేరుతో వివిధ మార్పుల ద్వారా ప్రయివేటు బస్సులు ఆర్టీసీల్లో నిండిపోతాయి. లేదా ఆర్టీసీలు క్షీణించిపోయి, బోర్డు మాత్రమే ఆర్టీసీది ఉండి, సంస్థ మొత్తం ప్రయివేటు యజమానుల గుప్పిట్లో ఉంటుంది. ఒకటి, రెండు వాహనాల యజమానులు కమ్ డ్రైవర్లను రవాణా రంగం నుండి బయటకు నెట్టివేసి మొత్తం ప్రజా రవాణా, సరుకు రవాణాను కూడా దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు ఈ విధానాలు ముందుకు తీసుకువస్తున్నారు.

దేశ ఆర్టీసీల్లో అవసరమైన సిబ్బందిని రిక్రూట్ చేయడంలేదు. ఖాళీ అయిన పోస్టులను సరెండర్ చేయడమో లేకపోతే కేంద్రం తీసుకొచ్చిన అప్రెంటీస్ యాక్ట్‌ను అడ్డంపెట్టుకొని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లు, గ్రాడ్యుయేట్ అప్రంటీస్‌ల పేర్లతో నియామకాలు చేస్తున్నారు. మరోవైపున ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేస్తున్నారు. అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నది. ఇవి అమల్లోకి రాకముందే కార్మికోద్యమంపై ఆంక్షలు, కార్మికోద్యమంపై దాడి, వేతన ఒప్పందాలు చేయకపోవడం, అరియర్స్ చెల్లించకపోవడం, 10నుంచి12 గంటల పని చేయించడం, ఎంటి.డబ్ల్యు యాక్ట్ ను తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, మహిళలతో రాత్రి పూట పని చేయించడం వంటివి ఆర్టీసీల్లో అమలు చేస్తున్నారు. నిజంగా కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక సంఘాలు నిలబడటం, కార్మిక సమస్యలపై పోరాటాలు అసాధ్యంగా మారే పరిస్థితులు ఏర్పడ తాయి. అగ్నికి ఆజ్యం పోసినట్లు డీజిల్, పెట్రోల్ ధరలు, వాటిపై వసూలు చేస్తున్న పన్నులు, సెస్‌లు తగ్గించకపోవడం, ప్రజా రవాణా సంస్థలకైనా పన్ను మినహాయింపులు ఇవ్వకపోవడం మరో సమస్యగా ఉంది. సంఘటిత రంగంలో ఉన్న ఆర్టీసీలు, కార్మికుల పరిస్థితే ఇలా ఉంటే మొత్తం రవాణా రంగ కార్మికుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

దేశ జీడీపీలో 4.5శాతం వాటా కలిగిన రవాణ రంగాన్ని కాపాడుకోవడం కోసం, ఈ రంగంలో పని చేస్తున్న పది కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలు కాపాడటం కోసం ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నిరంత రాయంగా కృషి చేస్తున్నది. అయినా పాలకుల్లో ఎటువంటి చలనం లేకపోగా కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను ముందుకు తీసుకునిపోతామని 2025-26 బడ్జెట్ ద్వారా కూడా తెలియజేశారు.ఈ దుస్థితి ఇంకెంతకాలం కొనసాగాలి? బతికినంతకాలం వెట్టిచాకిరీ చేస్తూ బానిస బతుకులే బతకాలా? ఇక సహించేదిలేదని, ఎలుగెత్తాలి. ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానా లను తిప్పికొట్టాలి. అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ఆ లక్ష్యం కోసమే 2025 మార్చి 24న 'చలో పార్లమెంట్'కు ఫెడరేషన్ పిలుపునిచ్చింది. మొత్తం రవాణా రంగ కార్మికులతో పాటు ఆర్టీసి కార్మికులు కూడా 'చలో పార్లమెంటు'కు పెద్దఎత్తున కదలాలి.

టన్నెల్‌లో జియోలాజికల్ సర్వే అధికారుల పరిశీలన

- మట్టి, నీరు, భూస్థాయిల మార్పులపై విశ్లేషణ
- మరోసారి లోపలికెళ్లిన కడావర్ డాగ్స్



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలాన్ని మంగళవారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు పరిశీలించారు. భూగర్భ నిర్మాణం, భూస్థాయిల మార్పులు, టన్నెల్‌లో మట్టి పెళుసు స్థితి, నీటి ప్రవాహం ప్రభావం వంటివి పరిశీలించారు. అధ్యయనం అనంతరం, వారు సహాయక చర్యలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ అధికారులు, రక్షణ సిబ్బంది, ఇంజినీర్లు, జియోలాజిస్టులు, అనుభవజ్ఞులైన రెస్క్యూ టీమ్‌లు సమన్వయంతో పని చేస్తున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డ్రిల్లింగ్ మెషిన్లు, సెన్సార్లు, రోబోటిక్ పరికరాలు వంటి సాధనాలను వినియోగించి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. అలాగే, టన్నెల్ ఆఫీస్ వద్ద డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఉదయం కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ టన్నెల్‌లోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫాం భాగాలని కత్తిరించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సమాంతరంగా టీబీఎంపైనున్న మట్టిని తొలగించడంతోపాటు టీబీఎంను కత్తిరించిన భాగాలను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నట్టు తెలిపారు. మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు చెప్పారు.

బాత్‌రూమ్ పైకప్పు పెచ్చులూడిపడి విద్యార్థికి గాయాలు

- ఓయూ టెక్నాలజీ హాస్టల్‌లో ఘటన
- విద్యార్థుల రాస్తారోకో





నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ ఓయూలోని టెక్నాలజీ హాస్టల్ బాత్ రూమ్ పైకప్పు పెచ్చులూడి పడి ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ వసతి గృహంలో అన్ని రూమ్‌లలో ఇలాగే స్లాబ్ పెచ్చులు ఊడి ప్రమాదంగా ఉన్నాయని ఇప్పటికే విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోవడంతో తమ ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మంగళవారం యూనివర్సిటీలో రాస్తారోకో నిర్వహించారు. హాస్టల్ బాత్రూం పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని గతంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నూతన హాస్టల్ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకో నేపథ్యంలో ఓయూలో పోలీసులు భారీగా మోహరించారు. ఓయూకు వెళ్లే రహదారులను బంద్ చేశారు.విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ప్రొ.రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీనునాయక్, వార్డెన్, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం ఈ విషయాన్ని వారు ఓయూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి

- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : సీఐటీయూ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలనీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీల కోసం పొందుపర్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేలు ఇవ్వాలనీ, వేసవి సెలవులు ప్రకటించాలని కోరారు. మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు, గుజరాత్ హైకోర్టులు ఇచ్చిన తీర్పు మేరకు అంగన్‌వాడీలకు పేమెంట్ ఆఫ్ గ్రాట్యూటీ యాక్ట్ ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని విన్నవించారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయొద్దని కోరారు. మోడీ సర్కారు నూతనంగా తెచ్చిన పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ సేవలను పాతపద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మినీ నుంచి మెయిన్ అయిన నాలుగు వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న పది నెలల వేతనం ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విన్నవించారు. బీఎల్‌ఓ డ్యూటీలను రద్దు చేయాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి ప్రాధాన్యత దక్కేనా?

- కనీసం 20 శాతం నిధులు కేటాయించాలంటున్న విద్యావేత్తలు
- బీఆర్ఎస్ హయాంలో గురుకులాలకే పెద్దపీట
- ఇప్పుడు సమీకృత గురుకులాల నిర్మాణం
- ప్రభుత్వ విద్యాసంస్థలను పట్టించుకోని వైనం

15 శాతం నిధులు కేటాయిస్తామన్న కాంగ్రెస్ | ప్రస్తుత బడ్జెట్‌లో 7.31 శాతం నిధులతో సరిపెట్టిన ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచుతాం. ప్రస్తుతం ఉన్న ఆరు శాతం నుంచి 15 శాతం నిధులను కేటాయిస్తాం. ప్రతి విద్యార్థికి రూ.ఐదు లక్షలతో కూడిన విద్యా భరోసా కార్డును ఇస్తాం. విద్యార్థులందరికీ వైఫై ద్వారా ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తాం. వచ్చే ఐదేండ్లలో ఇన్నోవేషన్ ఎడ్యుకేషన్ హబ్‌గా తెలంగాణ రూపాంతరం చెందుతుంది. ప్రతి మండలంలో అంతర్జాతీయ పాఠశాలను ఆధునిక వసతులతో నెలకొల్పుతాం. వాటికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం'అని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించింది.కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలి. కానీ అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఆ సిఫారసులను బుట్టదాఖలు చేస్తున్నాయి. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధుల కేటాయింపే లేదు. 2024-25 బడ్జెట్‌లో విద్యకు కేంద్రం 2.61 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 7.31 శాతం కేటాయించాయి. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1,28,650 కోట్లు కేటాయించింది. మొత్తం బడ్జెట్ రూ.50,65,345 కోట్లలో విద్యారంగానికి 2.54 శాతం నిధులను మాత్రమే ప్రతిపాదించింది. విద్యకు కేటాయించిన నిధుల్లో అధిక భాగం ఉపాధ్యా యులు, అధ్యాపకుల జీతభత్యాలకే సరిపో తున్నాయి. నిధుల్లేక పోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంటున్నది. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు ఉండడం లేదు. విద్యుత్ సౌకర్యం, ప్రహరీగోడ లేని పాఠశాలలు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. నిధుల కొరత, మౌలిక వసతుల లేమితో ప్రభుత్వ పాఠశాలలు బలహీన మవు తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యా రంగం ప్రయివేటుపరం అవుతున్నది. విద్యావ్యాపారం ఏటా పెరుగుతున్నది. పిల్లలు బాగా చదవాలనే ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండడంతో వాటిని 'క్యాష్' చేసుకుంటున్నాయి. అధిక ఫీజులను వసూలు చేసి దోపిడీ చేస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగం నియంత్రణ, ఫీజుల కట్టడికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అప్పుడు గురుకులాలు ఇప్పుడు సమీకృత గురుకులాలు

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు గురుకులాలకు ప్రాధాన్యత ఇచ్చింది. కేజీ టు పీజీ ఉచిత విద్యను అమలు చేస్తామని హామీ ఇచ్చి కొత్తగా గురుకులాలను ప్రారంభించింది. అవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ యంగ్ ఇండియా సమీకృత గురుకులాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్) పాఠశాలల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నది. ఇటీవలే 58 సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.11 వేల కోట్లు కేటాయించింది. కానీ ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, విశ్వ విద్యాలయాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవడం లేదు. నిధు లను కేటాయించడం లేదు.

ఈసారైనా న్యాయం జరిగేనా...

రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫారసులు చెప్తున్నాయి. కనీసం 20 శాతం నిధులను కేటాయించి ఖర్చు చేయాలని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యా కమిషన్ కూడా 20 శాతం నిధులను కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేసింది. కొందరు ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలైతే కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారమైనా విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలని కోరుతున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014-15 బడ్జెట్‌లో విద్యకు 10.88 శాతం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. 2023-24 బడ్జెట్‌లో 6.56 శాతం నిధులను ప్రతిపాదించింది. 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత దక్కుతుందేమో చూడాలి. ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 19న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో విద్యకు ఎంత శాతం నిధులను కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే. 2025-26 బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన విద్యారంగానికి 15 శాతం చొప్పున రూ.47,250 కోట్లు కేటాయించాలి. ఒకవేళ బడ్జెట్ రూ.మూడు లక్షల కోట్లు అయితే రూ.45 వేల కోట్లు ప్రతిపాదించాలి.

కులవివక్ష ప్రతిఘటన పోరాటాల్లో భాగస్వాములు కావాలి

- ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు హర్షణీయం : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-నయీంనగర్

నేటి ఆధునిక యుగంలోనూ కులవివక్ష, అంటరానితనం గ్రామసీమల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కొనసాగుతున్నదని, దీనిపై ఏప్రిల్‌లో జరిగే ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాల్లో పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా రాంనగర్‌లోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటికీ దళితులకు గుడిలోపలికి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షవరం చేయకపోవడం, దసరా పండుగ సందర్భంగా జమ్మి ఆకు తెంపారని దాడి, హెూటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతి, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే విద్యార్థులు తినకపోవడం, రచ్చబండ మీద కూర్చోనీయకపోవడం వంటి కులవివక్ష రూపాలు కొనసాగుతున్నాయని అన్నారు. పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదని తెలిపారు. వీటన్నింటినీ పారదోలేందుకు ఉన్న చట్టాలు, జీవోలు, రాజ్యాంగ హక్కులను పాలకవర్గాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా కేవీపీఎస్ ప్రకటించి, పూలే, అంబేద్కర్ జన జాతరలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. కుల వివక్ష అంటరానితనం ఎక్కడ కొనసాగితే అక్కడ ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటం నిర్మించాలని తెలిపారు. కులవివక్ష, అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కేవీపీఎస్ సన్నద్ధం అవుతుందన్నారు. కులవివక్ష, అంటరానితనం, కుల దురహంకారహత్యలు సాంఘిక బహిష్కరణలు, జోగిని వ్యవస్థ ఇలాంటి వాటిని పారద్రోలేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, రాజ్యాంగ హక్కులు, చట్టాలు అమలుకోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. నల్లగొండ జిల్లా కోర్టు ప్రణయ్ హత్య కేసులో ఇచ్చిన తీర్పుపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన 128 కుల దురహంకార హత్యల్లో బలైన వారందరికీ నివాళు లర్పించారు. కుల దురహంకార హత్యలకు పాల్పడిన ప్రతి ఒక్కరికీ నల్లగొండ జిల్లా కోర్టు మాదిరిగే తీర్పులు రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మరో కుల దురహంకార హత్య జరగకుండా కులాంతర వివాహితుల కోసం రక్షణ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, జిల్లా ఉపాధ్యక్షులు ధూడేపాక రాజేందర్, ముడుసు నారాయణ, గబ్బెట రాంకుమార్, దానబోయిన రాంబాబు, జిల్లా నాయకులు అంబాల రవీందర్, వేలు సుమన్, సదానందం, భాస్కర్, దామర రాజు, నరేష్ చందర్, వేల్పుల రవి, గజవెల్లి మొగిలి, కుమార్, సుభద్ర, సుకర్ష, సౌజన్య, లావణ్య, శారద, భారతి, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట బోర్డుకు అసెంబ్లీ ఆమోదం

- స్వాగతించిన ప్రతిపక్షాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యాదగిరిగుట్ట ఆలయ ధర్మకర్తల మండలి (బోర్డు) ఏర్పాటు ప్రతిపాదనను శాసనసభ ఆమోదించింది. ఈ బిల్లులు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎమ్ఐఎమ్, సీపీఐ పార్టీల సభ్యులు మాట్లాడి, పలు సూచనలు చేశారు. బోర్డులో ఎస్టీ ప్రతినిధిని కూడా సభ్యుడిగా చేర్చాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు సూచించారు. యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ మాట్లాడుతూ గుట్ట నిర్మాణ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందనీ, దీనిలో ఎలాంటి రాజకీయాలకు తావులేదని అన్నారు. మరో కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వైటీడీ పరిధిలో వైదిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. యాదగిరిగుట్ట ఆలయానికి 18 మంది సభ్యులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బోర్డు పదవీకాలం రెండేండ్లు ఉంటుందనీ, బోర్డు చైర్మెన్, సభ్యులకు ఎలాంటి జీత భత్యాలు ఉండవని చెప్పారు.

వైటీడీ బోర్డు ఆధ్యాత్మిక, వేద విద్యా సంస్థలను స్థాపించి, నిర్వహించేలా బిల్లులో పొందుపరిచామని వివరించారు. వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారానే జరుగుతుందనీ, ఐఏఎస్ అధికారి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉంటారని చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏడాదికి రూ.100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలకు బోర్డుల్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నదని తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి కూడా బోర్డు ఏర్పాటును పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం శాసనసభ ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 11గంటలకు వాయిదా వేశారు.

క్రమపద్ధతిలో 'ఉపాధి' నిర్వీర్యం

- రాజ్యసభలో సోనియా గాంధీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీని క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ విమర్శించారు. మంగళవారం ఆమె రాజ్యసభలో మాట్లాడుతూ ఉపాధి హామీ కోసం బడ్జెట్ కేటాయింపులను కాలక్రమేణా తగ్గిస్తుందని విమర్శించారు. "ఈ చట్టం లక్షలాది మంది గ్రామీణ పేదలకు కీలకమైన భద్రతా వలయంగా ఉంది. అయితే, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని క్రమపద్ధతిలో నిర్వీర్యం చేయడం చాలా ఆందోళనకరం" అని ఆమె అన్నారు. ఉపాధి కోసం బడ్జెట్ కేటాయింపులు రూ.86,000 కోట్ల వద్ద నిలిచిపోయాయని, ఇది జీడీపీలో పదేండ్ల కనిష్ట స్థాయికి చేరిందని విమర్శించారు. ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసినప్పుడు బడ్జెట్ రూ.4,000 కోట్లు తగ్గుతుందని, కేటాయించిన నిధులలో దాదాపు 20 శాతం గత సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలను క్లియర్ చేయడానికి సరిపోతుందని అన్నారు. "అదనంగా ఈ చట్టం బహుళ సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో ఆధార్ ఆధారిత చెల్లింపు, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్, వేతన చెల్లింపులో నిరంతర జాప్యాలు, ద్రవ్యోల్బణాన్ని భర్తీ చేయడానికి సరిపడా వేతన రేట్లు లేకపోవడం" అని సోనియా గా ంధీ అన్నారు. ఉపాధి హామీ చట్టం కింద కనీస వేతనాలు, హామీ ఇవ్వబడిన పని దినాల సంఖ్యను పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు, కనీస వేతనాన్ని రోజుకు రూ. 400 పెంచాలని, ఏడాదికి హామీ ఇవ్వబడిన పనిదినాల సంఖ్యను 100 నుంచి 150కి పెంచాలని డిమాండ్ చేశారు. " గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రతను అందించేలా ఈ చర్యలు చాలా అవసరం" అని ఆమె పేర్కొన్నారు.

భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భవిష్యత్తులో రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అవుతారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం శాసనమండలిలో బీసీ బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ ముఖ్యమంత్రి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచే అవుతారని అన్నారు. ఏ ఇతర పార్టీల నుంచి బీసీ ముఖ్యమంత్రి కావడం ఆచరణ సాధ్యం కానిదని చెప్పారు. దేశాన్ని సమూలంగా చదివిన రాహుల్ గాంధీ ఎవరు ఎంత మందో వారికి అంత వాటా దక్కాలని కోరుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, బీసీలు ఎంత మందో అధికారికంగా చెప్పుకునే డాక్యుమెంట్ కోసం ఒత్తిళ్లకు లొంగకుండా శాస్త్రీయంగా కులగణన చేయించారని ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ బీసీలకు చేసిందేమి లేదని విమర్శించారు. సహేతుక కారణాలు చూపిస్తే రిజర్వేషన్లను పెంచుకోవచ్చని ఈడబ్ల్యూఎస్‌కు వెసులుబాటు కల్పించే సమయంలో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు.బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పీఎం నరేంద్రమోడీని కలవబో తున్నామనీ, రాష్ట్ర బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సహకరించాలని కోరారు.

అసెంబ్లీ గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

పెంచడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. రిజర్వేషన్లను పెంచడంతో పాటు దామాషా ప్రకారం గ్రూపు 1, 2, 3 కేటగిరీల వర్గీకరణ బాధ్యతను కూడా తాము తీసుకుంటామని స్పష్టం చేశారు. "ప్రస్తుత రిజర్వేషన్లను పెంచాలంటే సహేతుకమైన విధానం పాటించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కలు మాత్రమే అధికారికంగా అందుబాటులో ఉన్నాయి. చట్టపరంగా ఎలాంటి చిక్కులు ఎదురుకాకుండా రిజర్వేషన్లు పెంచాలంటే, కేంద్ర ప్రభుత్వం 2026 జనాభా లెక్కలు చేపడితే ఆ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి వీలవుతుంది" అని వివరించారు. షెడ్యూల్డు కులాలకు మరింత ప్రయోజనం చేకూర్చే విషయంలో ప్రభుత్వం పారదర్శకమైన కార్యాచరణ చేపడుతుందనీ, ఇలాంటి విషయాల్లో భేషజాలు లేకుండా అందరినీ సంప్రదించి వారి అభిప్రాయాల మేరకు ముందుకు వెళుతామని వివరించారు. వర్గీకరణ సమస్యకు శాసనసభ శాశ్వతమైన పరిష్కారం చూపించడం ఒక చారిత్రాత్మకమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు. వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. కఅష్ణమాదిగతో పాటు చాలా మంది మూడు దశాబ్దాలకు పైగా ఈ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆ కుటుంబాల్లో విద్యావంతులుంటే రాజీవ్ యువ వికాసం పథకం కింద చేయూతనందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి దామోదర రాజనర్సింహ నేతఅత్వంలో ఎస్సీ శాసనసభ్యులందరూ ఒక కమిటీగా ఢిల్లీ వెళ్లి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తమ వాదనను బలంగా వినిపించడం, సుప్రీంకోర్టు తీర్పు వెలువడటం, ఆ వెంటనే వంద శాతం అమలు చేస్తామంటూ శాసనసభలో ప్రకటన చేసిన పరిణామాలను ఆయన వివరించారు. సామాజిక, విద్య, ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనుకబడిన వర్గాలను గ్రూప్ 1 కింద 15 ఉపకులాలను పరిగణనలోకి తీసుకుని వారికి ఒక శాతం రిజర్వేషన్, మధ్యస్తంగా లబ్ధిపొందిన 18 ఉప కులాలను గ్రూపు 2 కింద తీసుకుని వారికి తొమ్మిది శాతం రిజర్వేషన్లు, గణనీయంగా ప్రయోజనం పొందిన కులాలను గ్రూపు 3 కింద పరిగణిస్తూ వారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేశామని తెలిపారు.

చరిత్రలో నిలిచి పోతుంది: దామోదర రాజనర్సింహ

దశాబ్దాలుగా మగ్గుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపిందనీ, ఇది చరిత్రలో నిలిచి పోతుందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ యువతకు ఆదర్శమన్నారు. తమ ప్రభుత్వం ఫిబ్రవరి 4న సామాజిక న్యాయం దినంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఎస్సీవర్గీకరణకు అనేక చారిత్రాత్మక కారణాలు దారి తీశాయన్నారు. ఆగస్టు 1, 2024 సుప్రీం కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ 'ల్యాండ్ మార్క్'గా నిలిచిపోతుందన్నారు. ఈ చట్టం ద్వారా ఎస్సీ వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు దక్కుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 1950-65 మధ్యలోనే ఎస్సీల సమస్యలపై లోకూర్ కమిటీ వేసిందని గుర్తు చేశారు. ఆ వర్గాలకు ప్రభుత్వ ఫలాలు ఏ విధంగా అందాలో ఆ కమిషన్ తెలిపిందని వివరించారు. అయినా సమాన పంపిణీ, సమాన ప్రయోజనాలు దక్కలేదని చెప్పారు. ఈ దిశలోనే ఎస్సీవర్గీకరణ ప్రక్రియను మొట్టమొదట పంజాబ్ రాష్ట్రం అమలు చేసిందన్నారు. ఆ తర్వాత హర్యానా, తమిళనాడు వర్గీకరణను చేపట్టాయని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున కొనసాగుతున్న వర్గీకరణ ఉద్యమ నేపథ్యంలో ఆనాటి ప్రభుత్వం రామచంద్రరాజు కమిషన్‌ను నియమించిందని చెప్పారు. ఆ కమిషన్ సిఫారసులమేరకు ఏ,బీ,సీ,డీ వర్గీకరణ జరిగిందని తెలిపారు. కులాల మధ్య వెనుకబాటు, జనాభా, చారిత్రాత్మక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారని చెప్పారు. ఈ వర్గీకరణ చెల్లదంటూ 2004లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. తదనంతరం కూడా అనేక ఉద్యమాలు కొనసాగాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించిందని తెలిపారు. ఫలితంగా సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిందని గుర్తు చేశారు. ఆ వెంటనే సర్కార్ వర్గీకరణకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి శాసనసభలో అమోదింపజేసిందని పేర్కొన్నారు. వర్గీకరణ విషయంలో తమ సర్కార్ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచి పోతుందని అన్నారు.

2026 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు పెంచుతాం: ఉత్తమ్

ఎస్సీ రిజర్వేషన్లపై అపోహలు వద్దనీ, 2026 జనాభా లెక్కల ప్రకారం పెంచుతామని మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుత ఎస్సీ వర్గీకరణను 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు 15శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. ఎస్సీల్లో క్రిమిలేయర్‌ను అమలు చేయాలనే ఏకసభ్య కమిషన్ చైర్మెన్ సూచనను తమ ప్రభుత్వం అంగీకరించలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చిత్తశుద్ధితో వర్గీకరణ పూర్తి చేశామని తెలిపారు. ఇంత చారిత్రాత్మకమైన నిర్ణయంలో తాను భాగస్వామిని కావడం ఎంతో సంతోషకరమని వివరించారు. తమ ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికతో ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చిందని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు బేషరతుగా మద్దతు :ఎంఐఎం సభ్యులు మాజీద్ హుస్సేన్

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు బేషరతుగా మద్దతిస్తున్నట్టు ఎంఐఎం సభ్యులు మాజీద్‌హుస్సేన్ ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో సోమవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లుపై మాజీద్ మాట్లాడారు. మూడు కేటగిరీలను నాలుగు కేటగిరీలుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లులో పొందు పర్చారనీ,, దాన్ని 18 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకతీతంగా తమ పార్టీ బిల్లును స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం : కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం, కోట లక్ష్మీకాంతారావు, వివేక్

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకమని కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం, కోట లక్ష్మీకాంతారావు, వివేక్ వెంకటస్వామి అన్నారు. 30 ఏండ్ల కలను రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ సాకారం చేసిందని కొనియాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడే ఎస్సీల అభివృద్ధికి పాటు పడ్డాయని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ హయాంలో గరీబీ హఠావో నినాదంతో ఎస్సీలకు పక్కా ఇండ్లు, అసైన్డ్ భూములు ఇచ్చామని పేర్కొన్నారు. తాము ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేసి చూపించామని అన్నారు.

దేశవ్యాప్తంగా అమలు చేయాలి : సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

(మొదటిపేజీ తరువాయి)

ఆయా రాష్ట్రాలు ప్రతేక చట్టాలు చేసి అమలు చేయడం వల్ల సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అలా కాకుండా దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు వీలుగా పార్లమెంట్‌లో కేంద్రం చట్టం చేయాలని కోరారు. రెల్లి కులస్తులను మూడవ కేటగిరి నుంచి ఒకటవ కేటగిరికి మార్చాలని సూచించారు. అసంతృప్తిగా ఉన్న ఎస్సీ ఉప కులాల వారిని పిలిచి వారితో మాట్లాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్గీకరణతోనే ఎస్సీ కులాల జీవితాలు మారవనీ, వారికి కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చు చేయడంతో పాటు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయాలని సూచించారు.

ఎస్సీలను రాజకీయాలకు వాడుకున్నారు
బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా వర్గీకరణకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి బీఆర్ఎస్ అనేక మార్లు ఇదే శాసన సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు.రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశ పెట్టారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు మాణిక్‌రావు, కడియంశ్రీహరి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ సంపూర్ణ మద్దతిస్తున్నట్టు ప్రకటించారు.

కేంద్రం చొరవ వల్లే వర్గీకరణ : బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

(మొదటిపేజీ తరువాయి)

తీర్పు అనుకూలంగా వచ్చిందని గుర్తు చేశారు. గతంలో ఇదే శాసన సభలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి నాలుగు సార్లు ఏకగ్రీవ తీర్మానాలు చేసినప్పటికీ న్యాయం స్థానంలో ఎందుకు నిలువలేదని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

చండీగఢ్‌లా హైదరాబాద్ అభివృద్ధి

- మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చండీగఢ్ మాదిరిగా హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ఫోర్త్ సిటీ ఏర్పాటు ప్రతిపాదనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్)ను కేంద్రంగా చేసుకుని పట్టణీకరణ వేగంగా జరుగుతోందనీ ఈ నేపథ్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రత్యేక నగరాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ ఫ్యూచర్ సిటీ పరిధి రంగారెడ్డి జిల్లాకు చెందిన 7 మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 770 చ.కి.మీల విస్తీర్ణంలో ఉంటుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీని అన్ని సదుపాయాలతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచి, రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతుందన్నారు. డెవలప్ మెంట్ అథారిటీ కావడంతో ఇందులో విలీనమయ్యే గ్రామాల ప్రజలు గ్రామీణ ఉపాధి హామీ నుంచి దూరం కారని వివరించారు. శంభీపూర్ రాజు మాట్లాడుతూ ఫోర్త్ సిటీ కాదు ఫోర్ బ్రదర్స్ సిటీ అనుకుంటున్నారని చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు తగవంటూ హితవు పలికారు. దీనిపై రాజు మాట్లాడుతూ శాసనసభలో బట్టలూడదీస్తామంటూ ఇంతకంటే దారుణంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలున్నాయన్నారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి ఇంకో చట్టం ఉన్నాయా? అని ప్రశ్నించారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని బయట మాట్లాడిన వ్యాఖ్యలను సభలో మాట్లాడొద్దని సూచించారు. పెద్దల సభ ఆదర్శంగా ఉంచాలని కోరారు.

మరికొద్ది గంటల్లో భూమిపైకి !

- సునీతా, విల్మోర్‌లను తీసుకుని ఫ్లోరిడా తీరంలో దిగనున్న డ్రాగన్ కేప్స్యూల్
- భారత్‌కు రావాలంటూ సునీతకు మోడీ ఆహ్వానం

న్యూఢిల్లీ : దాదాపు 9 మాసాలుగా అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బారీ విల్మోర్‌లు మంగళవారం ఉదయం అంతరిక్షం నుండి భూమికి స్పేస్ ఎక్స్ కి చెందిన డ్రాగన్ కేప్స్యూల్‌లో బయలుదేరారు. వాతావరణం అంతా అనుకూలిస్తే భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 3.27గంటల సమయంలో వారు నేలపై అడుగిడతారని భావిస్తున్నారు. ఫ్లోరిడా తీర ప్రాంతంలో ఈ నౌక దిగవచ్చని భావిస్తున్నట్లు నాసా పేర్కొంది. ఐఎస్ఎస్‌నుండి డ్రాగన్ విడివడే ప్రక్రియను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ మొత్తం ప్రయాణ గమనాన్ని నాసా శాస్త్రవేత్తలు అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. కేవలం వారం రోజుల పర్యటన కోసం వెళ్ళిన వారిని వెనక్కి తీసుకురావాల్సిన స్టార్‌లైనర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో వారు నిరవధికంగా అక్కడే వుండిపోవాల్సి వచ్చింది. సుదీర్ఘకాలం అంతరిక్షంలో వున్నందున వారికి భూమికి వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు, ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌లు వంటివి చేపడతారు. మళ్ళీ గురుత్వాకర్షణ బలానికి వారి శరీరం సర్దుకుపోయేలా, ఆరోగ్యవంతంగా వుండేలా చర్యలు తీసుకుంటారు. తిరిగి వస్తున్న అంతరిక్ష నౌకలో సునీత, విల్మోర్‌లతో పాటు మరో ఇద్దరు వ్యోమగాములు గొర్బునోవ్, హేగ్ కూడా వున్నారు. వీరు ఐఎస్ఎస్‌లో ఆరు మాసాల పాటు గడిపి తిరిగి వస్తున్నారు.

భారత్‌కు రండి

సునీతా విలియమ్స్ భువికి తిరిగివస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆమెను ఒకసారి భారత్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ మేరకు ఈ నెల ఒకటవ తేదీన సునీతకు రాసిన లేఖను నాసా మాజీ వ్యోమగామి మైక్ మాసిమినో ద్వారా పంపారు. ఆమె వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తమ మనసులకు దగ్గరగానే ఉన్నారని మోడీ వ్యాఖ్యానించారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, భూమికి విజయవంతంగా చేరుకోవాలని భారతీయులందరూ ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. మోడీ లేఖ రాసిన విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు.

ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో సర్దుబాట్లు

- ఐలు, ఎల్ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్ష షెడ్యూల్ లో అవసరమైన సర్దుబాట్లు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ప్రధాన కార్యదర్శి పార్థసారథి, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఎస్ఎఫ్ఐ) కోరాయి. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా యూనివర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శశికాంత్, ఓఎస్డీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జితేందర్ కుమార్‌లకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఉగాది, రంజాన్ పండుగలు షెడ్యూల్ మధ్యలో ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్ఎస్ఎఫ్ఐ స్టేట్ కమిటీ సభ్యులు అలీ హైదర్, చంద్రకాంత్ (సీకే), అలీ జాన్, ఎం.డి.తక్కి తదితరులున్నారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు



నవతెలంగాణ -హయత్ నగర్

బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని హైదరాబాద్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలని ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు కూడా కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

ఇటీవల మన్సూరాబాద్ పరిధిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తనను పిలవలేదని స్థానిక బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన అనుచరులతో వెళ్లి అవే పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేశారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల పోటాపోటీ ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అనుచరులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పలువురు కార్పొరేటర్లపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాంతో ఎమ్మెల్యేపై హస్తినాపురం కార్పొరేటర్ ఎల్బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొండా లక్ష్మణ్ బాపూజీ 2025 అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రధానం చేయనున్నట్టు చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. (అర్హతలు..1. డిసెంబర్ 2024 నాటికి 30 ఏండ్ల వయసు. చేనేత రంగంలో పదేండ్ల అనుభవం. 2). చేనేత డిజైనర్లకు డిసెంబర్ 2024 నాటికి 25 ఏండ్ల వయసు, ఐదేండ్ల అనుభవం.) ఈ అర్హతలు కలిగిన వారు ఏప్రిల్ 15లోగా రాష్ట్రంలోని ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులకు దరఖాస్తులు సమర్పించాలని ఆమె సూచించారు.

దద్దరిల్లిన కలెక్టరేట్లు

అంగన్‌వాడీల మహాధర్నాలో భాగంగా రెండో రోజు ముట్టడులు

- పీఎం శ్రీ, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను రద్దు చేయాలని డిమాండ్
- బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని నినాదాలు
- నిజామాబాద్‌లో పోలీసుల దౌర్జన్యం
- కేసులు నమోదు చేస్తామని బెదిరింపులు
- నాయకులను ఈడ్చుకుపోయి అరెస్ట్





అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్వాడీ సెంటర్స్‌ని వెంటనే రద్దు చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల మహాధర్నాలో భాగంగా మంగళవారం పెద్దఎత్తున కలెక్టరేట్లను ముట్టడించారు. వారికి సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నేతలు మద్దతుగా పాల్గొన్నారు. పలుచోట్ల పోలీసులు బెదిరింపులకు పాల్పడినా వెనక్కి తగ్గకుండా ఆందోళన చేపట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వేధింపులు ఆపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో ఆయా జిల్లాల్లో అరెస్టులు జరిగాయి. నిజామాబాద్‌లో నాయకులు, అంగన్‌వాడీలను ఈడ్చుకెళ్లి పోలీసు వ్యాన్లలో వేశారు.

నవతెలంగాణ- విలేకరులు

నిజామాబాద్‌లోని కలెక్టరేట్ గేట్ ఎదుట అంగన్‌వాడీలతో కలిసి సీఐటీయూ, సీపీఐ(ఎం) నాయకులు మద్దతుగా బైటాయించారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. అంగన్‌వాడీ కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడ్డారు. వీడియో రికార్డింగ్ చేస్తున్నామని, అందరిపై కేసులు పెట్టి ఉద్యోగాలు లేకుండా చేస్తామని బెదిరించారు. నాయకుల పట్ల దౌర్జన్యంగా ప్రవర్తించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అధ్యక్షులు శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నన్నేసాబ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.స్వర్ణ, జిల్లా కోశాధికారి చంద్రకళ, నాయకులు వాణి తదితరులను అరెస్టు చేశారు. దాంతో వారిని విడుదల చేసే వరకు కలెక్టరేట్ నుంచి కదలబోమని అంగన్‌వాడీలు భీష్మించుకొని కూర్చున్నారు. సుమారు 11.30 గంటల సమయంలో కలెక్టర్ తన వాహనంలో బయటకు వస్తుండగా.. అంగన్‌వాడీలు అడ్డుకున్నారు.కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కారు దిగి అంగన్‌వాడీలతో మాట్లాడారు. తమ సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతోపాటు అరెస్టు చేసిన నాయకులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులను విడుదల చేసిన అనంతరం వారు ఆందోళన విరమించారు.

ఎండలో మేముంటే.. ఏసీల్లో మీరా..?

కామారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. 'ఎండలో మేముంటే ఏసీలో మీరా' అంటూ అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. అదనపు (రెవెన్యూ) కలెక్టర్ విక్టర్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, ఏఎస్పీ చైతన్యరెడ్డి అంగన్‌వాడీల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల మాట్లాడుతూ.. 23 డిమాండ్లలో తమ పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తామని, మిగతావి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఖమ్మం ధర్నా చౌక్‌ను నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. మెదక్ పట్టణంలో అంగన్‌వాడీలు ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిద్దిపేటలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సంగారెడ్డిలో ధర్నా జరిగింది.రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముందు రెండో రోజు ధర్నాలో ఆమె పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ లోపలికి చొచ్చుకెళ్లగా.. పోలీసులు అడ్డుకో వడంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. వేసవి సెలవులు ఇవ్వాలని, అంగన్వాడీ వ్యవస్థను ఎత్తేయొద్దని, మొబైల్ అంగన్వాడీ సెంటర్స్‌ను రద్దు చేయాలని కోరారు.కలెక్టర్ ఛాంబర్ ముందు ధర్నా నిర్వహించడంతో కలెక్టర్ హనుమంతరావు స్పందించి లోపలికి పిలిపించి మాట్లాడారు.




సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అంగన్‌వాడీల జీతాలు పెంచాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం గేట్ ముందు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లాలోని తహసీల్ కార్యాలయం ముందు మహాధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారి హల్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించాక, కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల ధర్నా వద్దకు డీడబ్ల్యూవో సంధ్యారాణి వచ్చారు. సీఐటీయూ నాయకులతో మాట్లాడారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మహాధర్నా చేశారు.ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో అంగన్‌వాడీలు కలెక్టరేట్లను ముట్టడించారు. ఆదిలాబాద్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వంటావార్పు నిర్వహించి ఆటపాటల అనంతరం అక్కడే బస చేసి నిరసన తెలిపారు. మంగళవారం ధర్నా శిబిరం నుంచి కలెక్టరేట్ గేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. నిర్మల్‌లోనూ అంగన్వాడీలు రెండోరోజూ నిరసన కొనసాగింది. ఆసిఫాబాద్, మంచిర్యాలలోనూ రెండో రోజు ధర్నా చేశారు.

21 నుంచి 'పది' పరీక్షలు

హాజరుకానున్న 5,09,403 మంది విద్యార్థులు

- 2,650 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియెడ్
- 9.35 గంటల వరకు విద్యార్థులకు అనుమతి
- 28,100 మంది ఇన్విజిలేటర్ల నియామకం : ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు, సైన్స్ సబ్జెక్టులకు మినహా మిగతా సబ్జెక్టుల పరీక్షలన్నీ అదే సమయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు సబ్జెక్టు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా నిర్వహిస్తామనీ, పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్‌గా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాటిని వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), 2,650 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లతోపాటు 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే సంబంధిత పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ద్వారా పంపించామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను విద్యార్థులు సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ ద్వారా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కృష్ణారావు పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో ఆ చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు ఉదయం 9.35 గంటల వరకు అనుమతి ఉంటుందనీ, ఐదు నిమిషాలు గ్రేస్ పీరియెడ్ ఉంటుం దని వివరించారు. ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకో వాలని సూచించారు. ఒకరోజు లేదా రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని విద్యార్థు లను కోరారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీనియర్ అధికారులను జిల్లా స్థాయిలో పరిశీలకులుగా నియమిం చారని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యా ప్తంగా 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమిం చామని పేర్కొన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని వివరించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యా ర్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. పరీక్ష విధుల్లో ఉండే వారికి ఫొటో గుర్తింపు కార్డులను ఇచ్చా మనీ, ఇతరులు రాకుండా ఉండేందుకు దోహదప డుతుందని వివరించారు. విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్, జియో మెట్రిక్ పరికరాలను అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు ఓఎంఆర్ పత్రాలను సరిచూసుకోవాలని సూచించారు.

మల్లాపూర్, అన్నపూర్ణకాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రారంభించిన కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్



నవతెలంగాణ-హైదరాబాద్

మల్లాపూర్, అన్నపూర్ణ కాలనీలో నూతనంగా మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసినందుకు విద్యుత్ అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ నాగరాజు, కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, జనరల్ సెక్రెటరీ సంజయ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డీపే ప్రసాద్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఇల్లు అని తెలియదు..

ఎంపీ డీకె అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు : వివరాలు వెల్లడించిన డీసీపీ విజయ్ కుమార్



నవతెలంగాణ - బంజారా హిల్స్

జూబ్లీహిల్స్‌లోని బీజేపీ ఎంపీ డీకే అరుణ నివాసంలోకి ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి చొరబడిన సంగతి తెలిసిందే. అయితే ఆ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ వివరాలు వెల్లడించారు. నిందితుడికి అది ఎంపీ ఇల్లు అని తెలియదని, అతనిపై ఢిల్లీలో 30కి పైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసులతో కలిసి వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఈ కేసును ఛేదించినట్టు వెల్లడించారు.

గత ఆదివారం ఉదయం ఎంపీ డికె.అరుణ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి వెళ్లి గంటన్నర ఉన్నాడని తెలిపారు. సీసీ కెమెరా వైర్లు కట్ చేసి లోనికి వెళ్లాడన్నారు. ఇది మహానగరంలోని ఒక ముఖ్యమైన హిల్స్ ఏరియా, ఎంపీ ఇంట్లో జరిగిన విషయం కాబట్టి కేసును సీరియస్‌గా తీసుకున్నట్టు చెప్పారు. కేసు కోసం ప్రత్యేకంగా 8 టీములను ఏర్పాటు చేసి సాంకేతికతను వినియోగించి సీసీ కెమెరాలను పరిశీలించినట్టు చెప్పారు. ఇంట్లో పని చేసే వారిని కూడా విచారించమన్నారు. సీసీ కెమెరాలు చెక్ చేసినప్పుడు ఒక వ్యక్తి పాతబస్తీ తలాబ్ కట్ట నుంచి డికె. అరుణ ఇంటికి వచ్చి మళ్లీ అదే ఏరియాకి వెళ్లిపోయినట్టు గుర్తించామని తెలిపారు. అతన్ని ఢిల్లీకి చెందిన మహమ్మద్ అక్రమ్‌గా గుర్తించినట్టు చెప్పారు. అతను టైల్స్ షాప్‌లో పని చేస్తాడన్నారు. గత ఫిబ్రవరి నెలలో హైదారాబాద్‌కు వచ్చిన అక్రమ్ ఒక పెద్ద ఇంట్లో దొంగతనం చేసి ఢిల్లీ వెళ్లాలని ప్లాన్ చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ టెంపుల్ వద్దకు ఆటోలో వచ్చి అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తూ ఏరియాను సర్వే చేశాడన్నారు. రాత్రి సమయంలో ఆ ఏరియాలో తిరుగుతూ ఒక ఇంటి నుంచి ఒక ఇంటి పైకి వెళ్లిన నిందితుడు ఎంపీ డికె.అరుణ ఇంట్లోకి కిటికీ ద్వారా ప్రవేశించాడని తెలిపారు. సీసీ కెమెరాలు ఉండటంతో వైర్లను కట్ చేసి లోపలికి ప్రవేశించాడన్నారు. అయితే అక్కడ డబ్బుల కోసం వెతికినా అతనికి దొరకలేదన్నారు. కొంత సేపటికి బయట పడుకున్న వారు కదులుతున్నట్టు అనిపించడంతో కిటికీ నుంచి బయటికి వచ్చి ఆటోలో పారిపోయాడన్నారు. నిందితుడు ఢిల్లీలో చేసిన చోరీ కేసులో తీహార్ జైలుకు వెళ్లాడని, మళ్లీ ఢిల్లీలో చోరీ చేస్తే దొరికిపోతానని హైదరాబాద్‌ను ఎంచుకున్నట్టు తెలిసిందని చెప్పారు. అది ఎంపీ ఇల్లు అని అక్రమ్‌కు తెలియదన్నారు.

నగరంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాల్సి ఉందని, సీసీ కెమెరాలను కూడా ఇంకా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తం 8 పోలీస్ బృందాలు గాలించి నిందితున్ని పట్టుకున్నాయన్నారు. డబ్బులు మాత్రమే చోరీ చేసే అలవాటున్న అక్రమ్ అవి దొరక్కపోవడంతో పారిపోయాడని.. అక్కడే అతను తమకు క్లూ ఇచ్చాడని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ టీమ్‌లను అభినందిస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

బతుకు మార్చే విధానాలు కావాలి

- పని ప్రదేశంలో మహిళలకు భద్రత కరువు
- చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి : వ్యవసాయ మహిళా కూలీల సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-నయీంనగర్(హనుమకొండ)

"తాత్కాలిక ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలు కాదు కావాల్సింది.. బతుకు మార్చే విధానాలను పాలకవర్గాలు తేవాలి. చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు మహిళలకు అమలు చేయాలి" అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో అంబాల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ మహిళా కూలీల సదస్సులో ఆమె మాట్లాడారు. భూమిపైన మహిళలకు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తి రంగంలో మహిళల శ్రమ 78శాతంగా ఉన్నా.. వారసత్వ ఆస్తిపై మహిళలకు హక్కు లేదన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు నిలువ నీడ కోసం 120 గజాల ఇండ్ల స్థలం కావాలని అడిగితే భూమి లేదని చెప్పే పాలకులు.. బడా కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వందలాది ఎకరాలను ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్స్ వేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధపడరని, కానీ నివాసానికి గుడిసెలు వేసుకున్న వారిపై బుల్డోజర్లు పెట్టి నిర్బంధంగా కూల్చి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్షాల ఒత్తిడి మేరకు తెచ్చిన ఆహార భద్రత చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వం పౌరసరఫరా దుకాణాల నుంచి 14 రకాల సరుకులు ఇస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మనిషికి ఐదు కేజీల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. పౌష్టికాహారం అందక మహిళల్లో రక్తహీనత పెరుగుతున్నదని చెప్పారు. మహిళలపై పని ప్రదేశంలో లైంగికదాడులు పెరుగుతున్నా నిందితులపై చర్యలు లేవన్నారు.

మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ మాట్లాడుతూ.. మహిళా సాధికారత పేరుతో మాటలే చెప్తున్నారు తప్ప ఆచరణ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2500, భూమిలేని వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనిని విస్తరింప చేస్తామన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడిరాజుల రాములు, సారంపల్లి వాసుదేవరెడ్డి, నాయకులు లోకిని స్వరూప, వేలు రజిత, రమ తదితరులు పాల్గొన్నారు.

రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజిరెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్
రిగ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ముస్కు అంజిరెడ్డి నియామకమయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. తర్వాత అమ్మిడి సభ్యు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముస్కు అంజిరెడ్డి, జనరల్ సెక్రెటరీగా గూడూరు నర్సిరెడ్డి, ట్రెజరర్‌గా సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కాటపల్లి జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, జంగయ్య యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నక్కల శ్రీనివాస్ యాదవ్, విజయ శేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా సుధాకర్ రెడ్డిలు నియామకం అయ్యారు.

కవిత పోరాటం..బీసీ బిల్లు ఆమోదం



జాగృతి నాయకులు
ఎం.నవీన్ గౌడ్

నవతెలంగాణ - దిల్ సుఖ్‌నగర్
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగా బీసీ బిల్లును పెట్టారని జాగృతి నాయకులు ఎం. నవీన్ గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ చౌరస్తాలో మంగళవారం తెలంగాణ జాగృతి నేతలు బాణాసంచి కాల్చి, కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి నేతలు డాక్టర్ కిరణ్ కుమార్, సందీప్, సునీల్ జోష్, రమేష్ కురుమ, స్వప్న, శ్రీకాంత్ యాదవ్, విక్కీ, ఈశ్వర్, రాజు, సాయి, నందు, అంజి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వదిలి ఇఫ్తార్ విందులా..?



- ఇఫ్తార్ విందుకు రూ.70కోట్లు కేటాయించడం హాస్యాస్పదం
- పండుగల పేరుతో ప్రజలను బుజ్జగించడం తప్ప.. ఒరిగేదేమీ లేదు
- ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ-చంపాపేట్
హైదరాబాద్ పాత నగరంలోని పేద ముస్లింల అభివృద్ధికి ఈ అసెంబ్లీ బడ్జెట్లో రూ.పదివేల కోట్లు కేటాయించాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో అయస్సార్ చౌరస్తా సంతోష్ నగర్‌లోని ఆలంకం మేరీ భవన్లో పాత నగర అభివృద్ధికి పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అదే కార్యక్రమంలో ఇఫ్తార్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ... పండుగలు సంవత్సరం అంతా వస్తూనే ఉంటాయని, బతుకమ్మ పేరుతో నిధులు, ఇఫ్తార్ పేరుతో నిధులు, క్రిస్మస్ పేరుతో నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వాల పని కాదని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి కావడానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. వాటిని పూర్తిగా వినియోగించి పనులు చేస్తే ప్రజాభివృద్ధి జరుగుతుందని, అప్పుడే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇస్తారని అన్నారు. ప్రభుత్వం మతపరమైన, కులపరమైన కార్యక్రమాలు చేయడం కాదు.. పేద, బడుగు, బలహీన వర్గాలన్నింటినీ కలుపుకొని అభివృద్ధి చేసే పనులు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు విద్యకు, వైద్యానికి, ఉద్యోగానికి ఆమడ దూరంలో ఉన్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూడు, గూడు, గుడ్డ వంటి కనీస సౌకర్యాలకు నోచుకోలేని వారు ఉన్నారని.. అలాంటి వారికి సరిపోయేటువంటి నిధులు కేటాయించకుండా ఇఫ్తార్ విందుకు రూ.70 కోట్లు కేటాయించడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికైనా ముస్లిం మైనార్టీల గురుకుల పాఠశాలలో సరిపోయేటువంటి నిధులు కేటాయించి బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ఉండేటువంటి మెనూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండుగల పేరుతో ప్రజలను బుజ్జగించడం తప్ప ఒరిగేదేమీ లేదన్నారు. ఇలా బుజ్జగింపు చర్యలకు పాల్పడితే పేద ప్రజలు భవిష్యత్తులో స్థానం లేకుండా చేస్తారని గుర్తించాలని అన్నారు. తర్వాత ప్రజా సంఘాల నాయకులు ఎం శ్రావణ్ కుమార్, ఎం. మీనా, ఎం.బాలు, శ్రీను నాయక్ తదితరులు మాట్లాడుతూ.. చిన్న చిన్న గల్లీలు, ఓపెన్ నాళాలు దుర్గంధం, దోమలు వెదజల్లుతూ అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఆటోలు నడిపి తోపుడుబండ్ల మీద, రోడ్లమీద చిన్నచిన్న వ్యాపారాలు చేసి చాలీచాలని ఆదాయంతో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, ఫలక్నామా మ్యూజియం, జూ పార్క్ వంటి గొప్ప గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్నా.. వచ్చి పోయే పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేని పరిస్థితి ఉన్నదని ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఖైరుద్దీన్ (ఆలిండియా సోఫిల్మ కౌన్సిల్ అధ్యక్షులు), హౌ వాస్ నాయకులు విస్తరుద్దీన్, షకిల్బసి, మొహమ్మద్, అన్వర్, ది మహమ్మద్, ముంతాజ్ షేక్, సమద్, మహ్మద్, కరీం, మహ్మద్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి

కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్

నవతెలంగాణ -హయత్‌నగర్
ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. ఈ మేరకు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ మంగళవారం ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి..వెంటనే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓ గిరిజన మహిళ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ తీవ్ర పదజాలంతో దూషించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయడంలో జాప్యం చేయడంపై డీసీపీని ప్రశ్నించారు. వెంటనే అరెస్టు చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మాలాంటి ఎస్సీ, ఎస్టీ మహిళలు సమాజంలో తిరుగవద్దా, రాజకీయాల్లోకి వస్తే ఇలా అవమానంతో హేళన చేస్తారా పని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తనను, నా కుటుంబాన్ని మానసిక వేదనకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళనైన తనను ఇంత అవమానంగా మాట్లాడడంపై వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయకపోతే ఎల్బీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్షకు దిగుతానని సుజాత నాయక్ హెచ్చరించారు. నా జోలికి వస్తే చెప్పుతో కొడతా అంటూ వ్యాఖ్యానించారు. ఆమె వెంట కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, కుట్ల నర్సింహ యాదవ్, శశిధర్ రెడ్డి, డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, మెరుగు రమేష్ రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా నాయకురాళ్లు భాను, అనసూయ, మణి శ్రీ, మమత, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి



- మాజీ మంత్రి టీజీ వెంకటేష్ గుప్త
- ఘనంగా ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య దశాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ-నాగోల్
మహిళలు రాజకీయంగా ఎదగాలని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య (ఐవీఎమ్ఎస్) వ్యవస్థాపకులు అధ్యక్షులు ఉప్పల రాజ్యలక్ష్మి శ్రీధర్ గుప్త ఆధ్వర్యంలో ఐవీఎంఎస్ దశాబ్ది ఉత్సవాలు మంగళవారం నాగోలు శుభం కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి టీజీ వెంకటేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. గౌరవ అతిథులుగా ప్రముఖ గురు శంకర్ జి, ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద గుప్తా, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఉన్నత స్థానానికి ఎదగాలని పిలుపునిచ్చారు.

అనంతరం రాజ్యలక్ష్మి శ్రీధర్ గుప్త మాట్లాడుతూ మహిళలు చట్టసభలలో కూడా రాణించాలని, వారికి అవకాశాన్ని ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు.

మహిళలు ఆర్థిక రంగాలలో ఎంతో నేర్పుతో ముందుంటారని దానికి ఉదాహరణ పోపుల డబ్బా అని, దాంట్లో దాచిపెట్టిన డబ్బులను తమ భర్తకు ఆర్థికంగా సహాయపడతానికి అందిస్తారని పేర్కొన్నారు. అలాంటి మహిళలు ఇంకా రాజకీయాల్లోకి వస్తే సమాజం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో మీరే ఆలోచించాలని అన్నారు. ఐవిఎంఎస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు 20 మంది పిల్లలకు సైకిలు పంపిణీ చేశామని, కొందరి పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. బాల కార్మికల నిర్మూలన, మహిళా సాధికారత, మహిళలను గౌరవించడం, ఆడపిల్లలను చదివించడం ఐవిఎమ్ఎస్ యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటి కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా, చికోటి ప్రవీణ్ కుమార్, ప్రముఖ సినీ నటుడు పృధ్వీ, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ, సంఘం ప్రధాన కార్యదర్శి కల్పన, సరిత, కల్పన, పద్మ, సరిత, వీణ, సంతోషి, అమర జ్యోతి, అనిత, సంధ్యరాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీసీల కల నెరవేరడానికి సుగమమైన మార్గం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు



నవతెలంగాణ-నాగోల్
బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బీసీల కల నెరవేరపవడానికి మార్గం సుగమమైందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయనాడు అన్నాడు. మంగళవారం సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం, ఎస్ ఏ. దాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికిగాను సభ్యత చేర్పింపు కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా, ఉప్పల్ మండలం, ఎల్బీనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలను మన యొక్క సంఘంలో చేర్పించాలని కోరారు. తర్వాత వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన గణనలో కుల గణన చేసి కామారెడ్డిలో డిక్లేర్ చేసినటువంటి బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. శాసనసభ తీర్మానం ఆమోదింపజేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నటువంటి బీసీల కళ నెరవేరడానికి మార్గం సుగమయిందని, ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం లో ఉన్నటువంటి మోడీని ఒప్పించి పార్లమెంట్లో కూడా అమలు అయ్యేటట్టు చూడాలని కోరారు. వివిధ బీసీ సంఘాల ఉద్యమాలు, మేధావి వర్గం, సామాజికవేత్తలు, ప్రభుత్వ రంగాల నిపుణులు, బీసీ కమిషన్ కృషి వల్లనే ఈనాడు శాసనసభలో బిల్లు రూపం చెందిందని తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ఆఫీస్ బేరారు బొడ్డు పల్లి కృష్ణ మాట్లాడుతూ.. బీసీ హక్కుల సాధన సమితి సభ్యులుగా లక్ష మందిని చేర్పిస్తామని తెలిపారు. తర్వాత స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ డి. నిరంజన్, జగన్ యాదవ్, ప్రభాకర్, ఆంజనేయులుకు సభ్యత్వం అందజేశారు.

అసెంబ్లీలో 118 జీఓపై మాట్లాడిన ఎమ్మెల్యే దేవి రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్
అసెంబ్లీలో 118 జీఓ విషయంపై ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడారు. అంతేకాదు పలు విషయాలను స్పీకర్ ముందు ప్రస్తావించారు. దానిలో భాగంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 44 కాలనీలలో పేద, మధ్య తరగతి వారు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇండ్లు కట్టుకొని నివాసముంటున్నారని తెలిపారు. వారికి 2007 నుండి ఇండ్ల మరియు ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ఆపివేసారని గుర్తు చేశారు. వారి ఇబ్బందులు గ్రహించి అప్పటి ప్రభుత్వం 118 జీఓను విడుదల చేసిందన్నారు. ఈ జీఓ వలన సుమారుగా 75% వరకు కాలనీవాసులు లబ్ది పొందారని తెలిపారు. ఇంకా 25% లబ్ది పొందవలసిన వారు ఉండగా.. ప్రభుత్వం 15.12.2023 నుండి ఈ జీఓ అమలును ఆపివేసిందని అన్నారు. ఈ కారణం వలన చాలా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని వెల్లడించారు. అందుకే ప్రజా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 118 జీఓ అమలును తిరిగి పునరుద్ధరించాలని కోరారు. 118 జీఓ ద్వారా కన్వేయన్స్ డిడ్స్ పొందిన వారందరిని (ఆ కాలనీల సర్వే నెంబరులను) సబ్ రిజిష్టర్ ఆఫీసులోని వెబ్ సైట్ లో 22ఎ భూమి నిషేధిత చట్టం నుండి మినహాయించాలి అన్నారు. 118 జీఓ ద్వారా కన్వేయన్స్ డిడ్స్ పొందిన ఇంటి యజమానులకు ప్రాపర్టీ టాక్స్‌తో పాటు వేకెంట్ టాక్స్ వేయకుండా జీహెచ్ఎంసీకి ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. 2007కు ముందు పర్మిషన్‌లు ఉండి 118జీఓ ద్వారా కన్వేయన్స్ డీడ్స్ పొందిన ఇండ్ల, ప్లాట్ల యజమానులకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.118 జీఓ ద్వారా కన్వేయన్స్ డిడ్స్ పొంది పర్మిషన్ లేని ఇంటియజమానులకు కూడా రిజిస్ట్రేషన్స్ జరిగేటట్లు ఉత్తర్వులు జారీ చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు. 118 జీఓ ద్వారా కన్వేయన్స్ డీడ్స్ పొందిన ఇండ్ల యజమానులకు డాక్యుమెంట్లలో ఎమ్మార్వో ఆఫీస్‌లో సిబ్బందితో ప్లాట్ నెంబర్లను మరియు షెడ్యూల్ ప్రాపర్టీలో దిక్కులను మాన్యువల్‌గా రాయించడం వలన చాలా తప్పులు జరిగాయి అన్నారు. ఆ డాక్యుమెంట్లను రెక్టిఫికేషన్ చార్జ్ లేకుండా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రెక్టిఫికేషన్ చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయంచవలసినదిగా కోరారు. ఫొటో మిస్ మ్యాచ్ అయిన డాక్యుమెంట్లు కలెక్టర్ ఆఫీసులో ఇంకా పెండిగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటి విషయంలో కలెక్టరేట్ సిబ్బందికి సడలింపు ఇవ్వమని ఉత్తర్వులు యివ్వవలసినదిగా పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వేలాది కుటుంబాలకు న్యాయం చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సుధీర్ రెడ్డి ప్రతిపాదనలు చేసిన అంశాలు పరిగణనలోకి తీసుకొని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

నీ కబ్జాల పర్వం బయట పెడతాం



- బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ యువజన నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి

నవతెలంగాణ- హయత్ నగర్
బీఆర్ఎస్ కార్యకర్తలను గంజాయి బ్యాచ్ అని, ఎలాంటి ఆధారం లేకుండా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి దూషించారని, రెండు దఫాలు కార్పొరేటర్ అయినప్పటి నుండి ప్రజల, కాలనీ వాసుల, నిర్మాణాల దారుల నుండి ఎంత వసూలు చేశావో వాటిని బయట పెట్టేదాకా నిన్ను విడిచి పెట్టేది లేదని మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ యువజన నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి..కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి డివిజన్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం విధితమే. మరలా అదే ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి వెళ్లి శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించినందుకు పోలీసులను అడ్డుపెట్టుకొని మమ్మల్ని, మా కార్యకర్తలని భూతు పదజాలంతో దూషించారని మండిపడ్డారు. కార్పొరేటర్ వద్ద గంజాయి బ్యాచ్, గ్యాంబ్లింగ్ బ్యాచ్ ఉన్నారని, వారికి బతుకుదెరువు చూపించకుండా గొడవలకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఈ పదేళ్ల కాలంలో అక్రమంగా కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి సంపాదించిన ఆస్తులపై విచారణ జరిపిస్తామని, ఇక తగ్గేది లేదన్నారు. ఇక మూడు నెలలు గడిస్తే చెల్లని రూపాయిగా మారుతావని అన్నారు. బీజేపీ కార్పొరేటర్‌గా ఉంటూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి పనిచేసినట్లు ఆరోపించారు. మన్సూరాబాద్ చిన్న చెరువు కింద ఒక ఎకరం భూమి ఉంటే ఆరు ఎకరాల కబ్జా పెట్టారని, అదేవిధంగా పెద్ద చెరువు కింద నాలుగు వేల గజాలు కబ్జా చేశారని ఆరోపించారు. మధుయాష్కీ కి మాత్రం టూరిస్ట్ పొలిటిషన్‌గా మారారని, కాంగ్రెస్, బీజేపీకి ఉన్న లోపాయి కార ఒప్పందం ఎల్బీనగర్ ఎమ్మెల్యే పై పెట్టిన కేసుతో బయటపడిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్ కుమార్, రామాచారి, అఖిల్ యాదవ్, లింగం, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బీసీల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

- సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్
బీసీల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి అని, రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బహీన వర్గాల ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 26వ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ ఇచ్చిన మాటను నెరవేరుస్తూ.. నేడు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి, స్పీకర్ ఆమోదం పొందిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గ సభ్యులకు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీసీ ప్రతినిధుల తరఫున బీసీ మాజీ ప్రజాప్రతినిధిగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుకు సభ ఆమోదం తెలిపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సబ్బండ వర్గాలకు న్యాయం చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్లో ఆమోదం తెలిపి, బీసీ వర్గాలకు కొత్త భరోసా నిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేకు లేదు



బీఆర్ఎస్ జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ శర్ఫుద్దీన్ హమేద్

నవతెలంగాణ-బడంగ్‌పేట్
బీఆర్ఎస్ పార్టీని విమర్శించే స్థాయి మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీకి లేదని, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకే వత్తాసు పలుకుతూ.. తమ ఆస్తులను కాపాడుకోవడం జరుగుతుందని జల్‌పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శర్ఫుద్దీన్ హమేద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న 10సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను దేశ్‌కి నేత అని ప్రతి నిత్యం పొగడ్తలతో ముంచెత్తిన మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ.. నేడు అసెంబ్లీలో సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ పై విమర్శలు చేయడం ఆయన ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసం అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ చేస్తున్న విన్యాసాలు చూసి పాత బస్తీ ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. గత 6 దశాబ్దాలుగా మజ్లిస్ పార్టీ కుటుంబ పాలనలో పాత బస్తీలోని ముస్లింలు ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకబాటుకు గురైతే మరోపక్క ఒవైసీ కుటుంబ ఆస్తులు వేల కోట్లకు ఎలా పెరిగాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం నలుమూలాల అభివృద్ధి సాధిస్తుంటే.. మజ్లిస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న 7నియోజక వర్గాలలో కనీస సౌకర్యాలు లేకపోవడం వలన పాత బస్తీ ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో జత కట్టడం మజ్లిస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. దేశంలో తమ కంటూ ఒక మ్యానిఫెస్టోలో లేని ఏ కైక పార్టీ మజ్లిస్ పార్టీయేనన్నారు.

'స్వాతంత్ర్య పోరాట యువ కిషోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్'



నవతెలంగాణ - మీర్‌పేట్
స్వాతంత్ర్య పోరాట యువ కిషోరాలు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లని పీవైఎల్ బాలాపూర్ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూర్ భీమేష్, కారమోల రాకేష్ అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా సభ పోస్టర్‌ను బాలాపూర్ చౌరస్తాలో మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం పోరాటం చేద్దామని అన్నారు. బ్రిటీష్ పాలన పోయి, స్వదేశీ భూస్వామ్య వ్యాపార వర్గాలు అధికారంలోకి రావాలని పోరాడ లేదు... కార్మిక, కర్షకులకు అధికారం రావాలని పోరాడి మార్చి 23, 1931న వారు అమరులయ్యారని అన్నారు.

భగత్ సింగ్ ఆశయాలకు విరుద్ధంగా 1947లో నల్లదొరలకు అధికారం వచ్చిందని, దీంతో 78 ఏళ్లలో నల్లదొరలు దేశ ప్రజలను దోచుకోవడం వలన వీరి సంపద గుట్టలు గుట్టలుగా పెరిగిపోయిందని, ప్రజల పరిస్థితి దిగజారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాలకతీతంగా నాటి యువత దేశం కోసం ప్రాణాలొడ్డి పోరాడితే, నేడు బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టి, రాజకీయ పబ్బం గడుపుతుందని ఆరోపించారు. భగత్‌సింగ్ ఆశయాలను, దేశభక్తిని ప్రజల్లో ప్రచారం చేయాలనే ఉద్దేశంతో బాలాపూర్‌లో ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్ధంతి సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ సహాయ కార్యదర్శి, సలహాదారుడు కండ్లపల్లి నరేందర్, పీవైఎల్ నాయకులు శంకర్, రాంచందర్, సందీప్‌లు పాల్గొన్నారు.

మానవతా హృదయంతో అనాథలకు అన్నదానం



- మానవ సేవే మాధవ సేవ
- అక్షిత ఫౌండేషన్ చైర్మెన్ రాపాక సన్నీ కుమార్





నవతెలంగాణ-బడంగ్‌పేట్
అక్షిత ఫౌండేషన్ చైర్మెన్ రాపాక సన్నీ కుమార్ మానవతా హృద యంతో మానవ సేవే మాధవ సేవగా భావించి ఎంతో మంది అనాథలకు అన్నదానం చేస్తున్నారు. ఈ మేరకు మంగళ వారం అక్షిత ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలాపూర్ మండల పరిధిలోని బాలాపూర్ చౌరస్తా, మిధాని, మలక్ పేట్, దిల్ సుఖ్ నగర్ ప్రధాన రోడ్ల పక్కన నివసించే 50 మంది అనాథలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సన్నీ కుమార్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా తన స్వంత ఖర్చులతో పేద ప్రజలకు అందు బాటులో ఉండి, అనేక సామా జిక సేవా కార్య క్రమా లను చేస్తు న్నట్టు తెలి పారు. ధన వంతులు తమకుతో చిన విధంగా పేదలకు సహాయం చేయా లని కోరారు.

నవతెలంగాణ
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | మార్చి 19, 2025 | www.navatelangana.com

వీధి దీపాలు, మంచి నీటి సమస్యను పరిష్కరించండి

- దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ కీసర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

కీసర మండల కేంద్రంలో అనుబంధ గ్రామాల్లో వీధి దీపాలు, మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. కీసర మండల కేంద్రంలో వీది, దీపాలు లేక పోవడం వలన ప్రజలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. ఆయా కాలనీ లల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

హిమతేజకు నాట్య మయూరి అవార్డు ప్రదానం



నవతెలంగాణ-ఉప్పల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రామంతపూర్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సాయి స్వరని మ్యూజిక్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు కోనూరు హిమతేజ కొన్నేండ్లుగా కూచిపూడి నృత్యంలో బాలబాలికల శిక్షణ ఇస్తూ వారిని కళాకారులుగా దిద్దుతున్నందుకు రోజా క్రియేషన్స్ సంస్థ నాట్య మయూరి అవార్డుతో పాటు 2025 ఉమెన్ ఎక్సెలెన్సీ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం సుందరయ్య కళాభవన్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, సంస్థ అధ్యక్షుడు ఆలేటి శ్యాంసుందర్, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, తెలుగు యూనివర్సిటీ టూరిజం విభాగాధిపతి డాక్టర్ వనజ పోతాయి హిమతేజకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుర సునీత, భవానీ రెడ్డి, మంజుల, కాంచన, జోషి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకాల వల్ల ఐసీడీఎస్‌కు నష్టం





- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్రం తీసుకొచ్చే పీఎంశ్రీ పథకాల వల్ల ఐసీడీఎస్‌కు నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా, వాంటావార్పు రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జయలక్ష్మి మాట్లాడుతూ మొబైల్ అంగన్‌వాడీల వల్ల ఐసీడీఎస్, ప్రజలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.18వేల వేతనం ఇవ్వాలనీ, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. 18 నెలల కిరాయి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఐసీడీఎస్‌ను ప్రయివేటీకరణ చేయొద్దన్నారు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదనీ, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పి.గణేష్, కిష్టప్ప, లింగస్వామి, సత్యానారాయణ, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శోభ, సునిత, జిల్లా నాయకులు శివరాణి, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ, మొబైల్ సెంటర్స్, ఎన్ఈపీని ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ, మొబైల్ సెంటర్స్, ఎన్ఈపీని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా మంగళవారంతో రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరుపున సత్యం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేంద్రం ప్రయివేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. ఐసీడీఎస్‌తోపాటు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జూన్ నుంచి ఎన్ఈపీ ని అమలు చేసి 3-6 ఏండ్ల పిల్లలను విద్యాశాఖలో విలీనం చేసి ఐసీడీఎస్‌ను ధ్వంసం చేయాలని చూస్తున్నారనీ, పేదలు, అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం కలిగించే ఈ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అశోక్, శ్రీనివాస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటా..



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర మీడియా విభాగం ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మంగళవారం వారి నివాసంలో కలిసి ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలలో ఉద్యమకారుల ఇచ్చిన హామీల అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తాలని ఎమ్మెల్యేను కోరారు. సీఎంతో అనుకూలమైన ప్రకటన వచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందిస్తూ ఉద్యమకారులకు అండగా నిలుస్తానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, మీడియా కోఆర్డినేటర్లు దొమ్మాటి కిరణ్ కుమార్, దాసారం శ్రీనివాస్ మీడియా విభాగం ప్రతినిధి కీర్తి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ కోఆర్డినేటర్ బొర్రా రామచందర్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి



- కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్
- తిరుమలానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వీడ్కోలు

నవతెలంగాణ-కాప్రా

పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగారాసి 100శాతం ఉత్తీర్ణత సాధించాలని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అన్నారు. మంగళవారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడుతూ..ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. మీ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. పరీక్షలు బాగా రాయాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానకి కుమారి, శాంత భాయ్, అరుణ దేవి, మాధవి, దేవి, సరిత, కృష్ణమూర్తి, పద్మ, కవిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మూగజీవాలను కాపాడాలి



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

ప్రతి ఒక్కరూ మూగజీవాలను కాపాడాలని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ జోన్ వెటర్నరీ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును కార్పొరేటర్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరావు, వారి సిబ్బందితో కలిసి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మూగ జంతువులకు ఎండాకాలంలో నీళ్ల లేక ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేసిన నీళ్ల తొట్టిలను వివిధ కాలనీలు, బస్తీల్లో, కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు కాలనీల అసోసియేషన్ అధ్యక్షులకు అందజేశారు. చిల్కానగర్ డివిజన్‌లోని బాలాజీ ఎంక్లేవ్, కల్యాణ్ పూరి కాలనీ, నార్త్ కల్యాణపురి, బీరప్ప గడ్డ ప్రాంతంలోని బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్, సౌత్ ప్రశాంత్ నగర్, ధర్మపురి కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో నీళ్లతొట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, శ్యామ్ కాలనీల అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, మోతీలాల్, మధుకర్ రెడ్డి, సబర్ భాషా, శేఖర్ రెడ్డి, వికాస్, అమరేందర్ రెడ్డి, శివారెడ్డి, కొండయ్య, శేఖర్ రెడ్డి, తదితరులున్నారు.

రామచందర్‌కు టీజీఓ డైరీ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన సంవత్సర డైరీని మంగళవారం భారత ప్రభుత్వ జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషనర్ సభ్యులు వడ్డెపల్లి రామచందర్‌కు టీజీఓ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఓ సంఘం జిల్లా అధ్యక్షులు జి.వినోద కుమార్, సెక్రెటరీ డాక్టర్ ఎ.కురుమూర్తి, ఉపాధ్యక్షులు రవీందర్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవేందర్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బడుగు బలహీనవర్గాలకు అభివృద్ధి ఫలాలు అందరికీ అందించిన తూళ్ళ దేవేందర్ గౌడ్ 73వ జన్మదినం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాగా ఉప్పల్ నియోజకవర్గం అడ్‌హాక్ కమిటీ మెంబర్ నీరుకొండ సతీష్ బాబు, మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పల్ నియోజక వర్గ అడ్‌హాక్ కమిటీ మెంబర్ గడ్డమిడి రాములు యాదవ్, తెలుగు దేశం పార్టీ నాయకుడు భింగి భిక్షపతి గౌడ్, టీఎస్ ఎస్ఫ్ రాష్ట్ర నాయకుడు శివానంద్, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్.ఎ రహీమ్ తదితరులు తుక్కుగూడలోని దేవేందర్‌గౌడ్ నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

వాసవీ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

- డ్రయినేజీ సమస్యలపై అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-అల్వాల్





అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి వాసవి కాలనీలోని సమస్యలపై జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. కాలనీలోని డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మౌలిక వసతులను కల్పించాలని కాలనీ వాసులు ఆమెకు విన్నవించారు. కాగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి కాలనీ వాసుల సమస్యలను సావధానంగా విని, వాటిని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జలమండలి అధికారులతో మాట్లాడి డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి, మౌలిక వసతులను కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్, స్థానిక నాయకులు ప్రేమ్ కుమార్, అరుణ్, సాజిద్, భాస్కర్ పాల్గొన్నారు.

నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా డివిజన్‌లోని అన్ని కాలనీల్లోని వివిధ సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. కాలనీవాసుల సౌకర్యార్థం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. తమకు సహకరిస్తున్న విద్యుత్ అధికారులకు, అన్నపూర్ణ కాలనీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఈ నాగరాజు మాట్లాడుతూ కాలనీలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, జీఎస్ సంజయ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.ఎ.ప్రసాద్, యూసుఫ్ బాయ్, రాజమల్లు రాజలింగం, శంకర్ గౌడ్, ప్రేమసాగర్, సదానంద్, రిజ్వాన్, కుమార్, కమిటీ సభ్యులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిపాదిత అభివృద్ధి పనులు పరిశీలన



నవతెలంగాణ-చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్ పరిధిలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ ఎల్బీనగర్, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.48 లక్షలతో ఎఫ్‌సీఐ రోడ్డు, గుల్ మోహర్ గార్డెన్ జీ బ్లాక్ రోడ్డులో స్టార్మ్ వాటర్ డ్రైన్ రిస్టోరేషన్ పనులు, రూ. 50 లక్షలతో ఓల్డ్ మల్లాపూర్ లో ప్రతిపాదిత సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఇంజనీరింగ్ అధికారులు ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, భిక్షపతి, స్థానికులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, ఉస్మాన్, కుమార్ యాదవ్, ఫాతిమా రెడ్డి, దుర్గాప్రసాద్, రాపోలు శ్రీనివాస్, మెండ రఘు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

- వేముల శ్రీనివాస్ రెడ్డి, పాతూరి సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని మంగళవారం కలిసి విజ్ఞప్తి చేసినట్లుగా నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పాతూరి సుధాకర్ రెడ్డి తెలిపారు. గత 11రోజులుగా మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలలో మిషన్ భగీరథ మంచి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మేడ్చల్‌కు రావాల్సిన నీటిని యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల కారణంగా అటువైపు మళ్లించడంతో సమస్య ఏర్పడిందని కమిషనర్ తెలిపినట్లుగా వెల్లడించారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. కలిసిన వారిలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జిల్లి శైలజా హరినాథ్, కానుకంటి వంశీ,కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అన్న ప్రసాద వితరణ

నవతెలంగాణ- శామీర్ పేట

శామీర్ పేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట గ్రామానికి చెందిన పూర్ణచందర్-అర్చన దంపతులు,(భారత్ గ్యాస్) వారి కుటుంబ సభ్యులు, ఘట్కేసర్‌కు చెందిన మల్లికార్జున్ గౌడ్-లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు హరి చందన, సిరి చందన, స్వామి గౌడ్-లత దంపతులు, వారి కుటుంబ సభ్యులు వర్ష, కీర్తి వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



ఏఈ, లైన్‌మన్‌పై కేసు నమోదు



నవతెలంగాణ-మేడ్చల్

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ, లైన్‌మన్ పై కేసు నమోదు చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చ ల్ మున్సి పల్ పరిధిలోని కిష్టాపూర్‌లో సోమ వారం ఉదయం నుండి విద్యుత్ ఉప కేంద్రంలో ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యం పెంచే పనులు చేపట్టారు. ముందుగానే ఉదయం 8 గంటల నుండి రాత్రి 7గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కాగా మరమ్మతుల పనులు విద్యుత్ కాంట్రాక్టర్ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. విద్యుత్ తీగలు వేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కరెంటు సరఫరా కావడంతో ఎర్త్ రాడు వేసుకుని స్తంభంపై పనులు చేస్తున్న రమేష్(30) అనే కార్మికుడు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తమకు సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరాను ఎలా పున:రుద్ధరిస్తారని,మా ప్రాణాలతో చెలగాటం మాడుతున్నారని ఘటన స్థలానికి వచ్చిన లైన్ మన్ మాధవరెడ్డిపై కాంట్రాక్ట్ కార్మికులు దాడి చేశారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మన్ మాధవరెడ్డి, ఏఈ రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ అధికారులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విధి నిర్వహణలో ఉన్న లైన్‌మన్ మాధవరెడ్డిపై దాడి చేసిన కాంట్రాక్టర్ రవిశంకర్ రెడ్డికి చెందిన కార్మికులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏఈ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ అద్దాని సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు.

వాటర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిశీలన



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను తెలుసుకునేందుకు మంగళవారం మండల పరిధిలోని ఘనపూర్ గుట్ట వద్ద ఉన్న వాటర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మిలతో కలిసి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ చీర్ల రమేష్, తొంట యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు హెచ్ఎమ్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ సిబ్బందితో మాట్లాడి మేడ్చల్ పట్టణ ప్రజలకు కావాల్సిన నీటిని సరఫరా చేయాలని కోరినట్లుగా తెలిపారు. వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పది రోజుల్లోగా నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

మహిళల విద్య, ఉపాధి రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ మహిళ నాయకులు కడ్తాల్ మైస్ గండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్ హాజరై పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, లడ్డన్న, రంగు సతీష్ గౌడ్, మహేష్ ముదిరాజ్, మోహన్, బాలరాజు గౌడ్, రంగు ఉదయ్ కిరణ్ గౌడ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

'దళిత బహుజన పార్టీ ఎన్నికల గుర్తు అగ్గిపెట్ట'

● దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఎన్నికల గుర్తుగా అగ్గిపెట్టను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కేటాయించడం జరిగిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు.మంగళవారం రెడ్ హిల్స్ లోని తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో జరిగిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం కమిషన్ కార్యదర్శి అధ్యక్షతన జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పంచాయతీరాజ్, స్థానిక మున్సిపల్, నగర మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగే లోకల్ బాడీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున అగ్గిపెట్ట గుర్తుపై అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. తమ పార్టీకి అగ్గిపెట్ట గుర్తును కేటాయించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఆయన అభినందనలు తెలిపారు.



ఆశా వర్కర్ల వేతనాలు వెంటనే పెంచాలి

● సీఐటీయు నగర్ ఉపాధ్యక్షులు రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయు నగర ఉపాధ్యక్షులు రాములు అన్నారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అంబర్‌పేట ఎమ్మార్వో వీరాబాయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించామని ధర్నా సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారు. కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిశెంబర్ 10న ఆరోగ్య శాఖ కమీషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు 50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. ఇతర సమస్యల పైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశాడు. పై హామీల్లో ప్రింటెడ్ రిజిస్టర్స్ ఇచ్చారు. స్పూటం డబ్బాలు మోయటం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర సమస్యలు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదు. ఈ సమస్యలు పరిష్కా రం చేయాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి నేటి వరకు ఈ సంవత్సర కాలంలో మంత్రులకు, ఎంఎల్ఎలకు, ఉన్నతాధికారులకు ఆశాలు అనేక విజ్ఞప్తులు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజులు బస్సు జాత కూడా నిర్వహించారు. నిరంతరం అనేక ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్రమైన ఆందోళనకు ఆశాలు గురవుతున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభు త్వం స్పందించి ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం 180వేలు ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలతో కలిసి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ అంబర్‌పేట జోన్ నాయకు లు ఏ.సరస్వతి, దేవయాని, శోభ, విజయలక్ష్మి, అనిత, తదితరులున్నారు.

యువ శాస్త్రవేత్తలకు యువికా ఆహ్వానం

- ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- ఈనెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైన విద్యార్థులకు అంతరిక్ష శాస్త్ర అంశాలపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

యువ శాస్త్రవేత్తలకు అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆహ్వానం పలుకుతోంది. యువతకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ప్రతియేటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరిట నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమానికి తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 23వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇస్రో.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో పాల్గొనే విద్యార్థులకు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

ఎంపిక ఇలా..

ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. వీటితోపాటు స్పేస్, సైన్స్ క్లబ్‌ల్లో ఉంటే 5శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైన్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉంటే పది శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్ విభాగంలో 5శాతం ప్రాధాన్యత ఇస్తారు. విద్యార్థులు 2025 జనవరి 1వ తేదీ నాటికి తొమ్మిదో తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థి అంతకు ముందు సాధించిన సర్టిఫికేట్స్ అన్నింటిని స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రెండు వారాలపాటు విద్యార్థులకు శిక్షణ

యువికా శిక్షణ కార్యక్రమానికి ఎంపికయిన విద్యార్థులకు మే 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇస్రోకు సంబంధించిన దేశంలోని ఏడు సెంటర్లలో శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ఎంపికయిన విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు.

దరఖాస్తు ఇలా..

విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల్లో ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన 60 నిమిషాల అనంతరం యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువపత్రాలు జత చేయాలి. దరఖాస్తుకు ఈనెల 23వ తేదీ వరకు అవకాశమిచ్చారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఏప్రిల్ 7న ఎంపికయిన విద్యార్థుల జాబితాను ఇస్రో యువికా విభాగం విడుదల చేస్తుంది. మరిన్ని వివరాలకు జిల్లా డీఎస్‌వో ధర్మేందర్ రావును ఫోన్ నెం 7799171277పై సంప్రదించాలి.

యువ సైంటిస్ట్‌లను తయారు చేయడమే లక్ష్యం : ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్



పాఠశాలల విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) యువ విజ్ఞాన్ కార్యక్రమాన్ని(యువికా) నిర్వహిస్తోంది. ముఖ్యంగా విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష శాస్త్రం పై అవగాహన, శాస్త్ర ఆవిష్కరణల పైన ప్రాథమిక జ్ఞానం అందిస్తారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : సి.ధర్మేందర్ రావు, డీఎస్‌వో, హైదరాబాద్

ఇస్రో నిర్వహిస్తున్న యువికా కార్యక్రమానికి ఎంపికయిన 150 మంది విద్యార్థులకు మే నెలలో రెండు వారాల పాటు ఇస్రో సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడ సైన్స్ సంబంధించిన విశేషాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. ఇస్రో ప్రయోగ కేంద్రాలు, ప్రయోగశాలలను చూపిస్తారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖిగా మాట్లాడే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

గులాబ్ సింగ్ బౌలీ బస్తీలో సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

చార్మినార్ గులాబ్ సింగ్ బౌలీ బస్తీలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) చార్మినార్ జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. సీపీఐ(ఎం) చార్మినార్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గులాబ్ సింగ్ బౌలీ బస్తీలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. బస్తీలో అనేక సమస్యలు ప్రజలు పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికీ రేషన్ కార్డులు చాలా వరకు రాలేవని, పింఛన్లు ఇవ్వడం లేదని, గ్యాస్ సిలిండర్ పై సబ్సిడీ వంటి ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అందడం లేదని వాపోతున్నారన్నారు. 40 కుటుంబాలు గల బస్తీలో కేవలం 8 మందికే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చాయని, మిగిలిన అర్హులైనవారి ఇంటికి అధికారులు అనేకసార్లు వచ్చి సర్వే లు నిర్వహించి, ఫోటోలు దించారన్నారు. ఇండ్లు వస్తాయని అధికారులు వాగ్దానం చేశారని, అయినా మాకు డబల్ బెడ్ రూమ్ రాలేదన్నారు. సర్వే జరిగిన ఎవరు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారన్నారు. బస్తీలో డ్రయినేజీ మురుగు ఎప్పుడూ పొంగుతుండటంతో దుర్గంధం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బస్తీలో అంగన్‌వాడీ సెంటర్‌లో పై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఇది పిల్లలకి ఎప్పటికైనా ప్రమాదకరమేనని దీనిపై తక్షణమే అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఇంటింటి సర్వే కార్యక్రమంలో జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, నాయకులు ఏం మీనా, గులాబ్ నసీర్, ఎం. రఘు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు లైసెన్స్ ఇవ్వాలి

● హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షులు విట్టల్



నవతెలంగాణ-మెహిదీపట్నం

గుడి మల్కాపూర్ మార్కెట్‌లో పనిచేస్తున్న సుమారు 300 మంది హమాలీ కార్మికులకు లైసెన్స్, యూనిఫారాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయు మాజీ కార్యదర్శి, హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జి. విఠల్ డిమాండ్ చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు లైసెన్స్ రెన్యువల్ చేసి సంవత్సరానికి 2 జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ ఆవరణలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లోని కూరగాయల బస్తాలు 120 నుంచి 130 కేజీల బరువులు వస్తున్నాయని, మోయలేక ఒళ్ళు నొప్పులు వివిధ రకాల అనారోగ్యం పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. కార్మికులకు లైసెన్స్ రెన్యువల్ చేసి వారికి సంవత్సరానికి రెండు జతలు యూ నిఫాం బట్టలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.రాములు, ఎం శంకర్ నాయక్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల శక్తులు ఏకమై భగత్ సింగ్ ఆశయాల వైపు యువతను నడిపిద్దాం

● ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రగతిశీల ప్రత్యామ్నాయ శక్తులు ఏకమై భగత్ సింగ్ ఆశయాల బాటలో బాలలను, యువతను ప్రత్యామ్నాయ వైపు నడిపిద్దామని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. మంగళవారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశం సర్వత్ర సాంస్కృతిక సంక్షోభంలో ఉంది ప్రజల జీవితాలు ప్రజాస్వామిక హక్కులు ప్రజాస్వామిక సంస్కృతి పోరాట విలువలు తీవ్రమైన దాడికి గురవుతున్నాయని తెలిపారు. తిరోగమన సంస్కృతి పతన విలువలూ ప్రచారం చేస్తున్నా.. ఈ పరిస్థితుల్లో పురోగమన శక్తులు ప్రగతి శీల ప్రత్యామ్నాయ శక్తులు ఏకమై భగత్ సింగ్ ఆశయాల బాట లో బాలలను, యువత ను ప్రత్యామ్నాయ సంస్కృతి వైపు నడిపించాలని కోరారు. మార్చి 30 ఉగాది కవి సమ్మేళనలు మరోవైపు ఉగాది పచ్చడి సెవిద్దాం- భారత రాజ్యాంగాన్ని పరిద్దాం అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సాంస్కృతిక కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'సమభావన' ఉగాది - రంజాన్ సందర్భంగా సాంస్కృతిక సమాలోచనలు చర్చా గోష్టి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. దాశరథి, ఆరుద్ర శత జయంతి సభలను వారి సాహిత్యాన్ని పాటల పల్లకి కార్యక్రమం ఏప్రిల్ మొదటి వారంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం హైదరాబాద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గుమ్మడి నరేష్, రాజయ్య గౌడ్, ఎస్ నాగేశ్వరరావు, మహేష్ దుర్గే, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యతో ఏదైనా సాధించవచ్చు



● రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయ ముఖ్య గ్రంథ పాలకురాలు పీజీవీ రాణి..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బాలికలు ఉన్నత విద్య ద్వారానే సమాజంలో ఏదైనా సాధించవచ్చని, ఆ దిశగా ప్రాథమిక స్థాయి నుంచే పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయ సంస్థ ముఖ్య గ్రంథపాలకురాలు పీజీవీ రాణి అన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యలో రాణించేందుకు చేస్తు చిన్న సామాజిక సేవలో భాగంగా దేశంలోనే ఖ్యాతిగాంచిన ముత్తూట్ ఫైనాన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జోన్ ఆధ్వర్యంలో మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర,కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలకు చెందిన 50 ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8,9వ తరగతులకు చెందిన ప్రతిభావంతులైన 100 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3వేల చొప్పున నగదు పురస్కారం అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా పీజీవీ రాణి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముత్తూట్ ఫైనాన్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ విభాగం మేనేజర్ వై.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్ వ్యవస్థాపకులు ముత్తూట్ ఎం.జార్జి స్మారకార్థం పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు చొప్పున అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్-1 రీజనల్ మేనేజర్ పి.అనూప్ కుమార్, హైదరాబాద్- 2 రీజనల్ మేనేజర్ పి.బిందు, హైదరాబాద్ -3 రీజనల్ మేనేజర్ బాణాల రవి కిరణ్ రెడ్డి, హైదరాబాద్-4 రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐదు మంది లబ్ధిదారులకు రెండు లక్షల 70 వేల విలువగల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎం ఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్. మహమ్మ ద్ అలీ, చాంద్ పాషా, శంకర్ గౌడ్, మీడియా ఇన్‌చార్జి మచ్చకుర్తి ప్రభాకర్, ప్రవీణ్, కళ్యాణ్, బాక్సర్ కృష్ణ పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం పట్ల హర్షం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం ఎ.రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు బీసీ రిజర్వేషన్ బిల్లు ఒక నిదర్శనమన్నారు. జనాభాలో బీసీలు ఎంత శాతమో అధికారంలో అంత భాగం' అనే కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ ఆశయానికి అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చర్యలు చేపట్టారన్నారు. శాసన సభాపక్ష నాయకుడిగా తాను బీసీ రిజర్వేషన్ల సాధనకు నాయకత్వం వహిస్తానని, బీసీ రిజర్వేషన్లను సాధించే వరకు విశ్రమించబోనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆయన పరిపాలనా దక్షతను తెలియజేస్తుందన్నారు. కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతా మని ఎన్నికల సందర్భంగా 'కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్'కు తాము కట్టుబడి ఉన్నామని, బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం ద్వారా రేవంత్‌రెడ్డి రుజువు చేశారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై కులగణన చేసిన మొదటి రాష్ట్రం సీఎం నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రం కావడం గర్వకారణమన్నారు. నాలుగు ఎమ్మెల్సీ స్థానాలలో రెండు బీసీలకు, ఒకటి ఎస్సీ, మరోకటి ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వడం ద్వారా ఈ వర్గాలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారని ఆయన ప్రశంసించారు. బిల్లు రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్, బీజేపీ, సిపిఐ, ఎంఐఎం తదితర అన్ని రాజకీయ పార్టీలకు గుంజ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగ యువతకు వినూత్న పథకం రాజీవ్ యువ వికాసం

● బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరుద్యోగ యువతకు వినూత్న పథకాలు ప్రవేశపెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా "రాజీవ్ యువ వికాసం" అనే వినూత్న కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం యువ వికాసానికి మార్చి 17 నుండి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 6 నుండి 30 వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. క్యాటగిరి 1లో లక్ష వరకు రుణం 80 శాతం రాయితీ, క్యాటగిరి రెండులో రెండు లక్షల వరకు సహాయం 70 శాతం రాయితీ, మూడవ కేటగిరిలో మూడు లక్షల వరకు సహాయం 60 శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. పాలన ప్రక్షాళన పారదర్శకత తమ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులకే పథకాలు ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ఆరంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు వేల మందికి ఉపాధి కలిగించే అవకాశం ఉందన్నారు. జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పది..

● సారస్వత పరిషత్తు పురస్కార ప్రదానోత్సవంలో డాక్టర్ జి.చిన్నారెడ్డి..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఎంతో గొప్పనైన తెలుగు భాషను అభిమానించి, పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. విశ్వనాథ వేయి పడగలు, భరద్వాజ పాకుడు రాళ్లు, శ్రీ శ్రీ మహాప్రస్థానం, సినారె విశ్వంభర వంటి ఎన్నో ఉత్తమ గ్రంథాలు తెలుగు భాషకు వన్నె తెచ్చాయని, అవి చదువుతున్నప్పుడు భాష గొప్పదనం తెలుస్తుందన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన మంగళవారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన సభలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సారస్వత పరిషత్తు రెడ్డి ల్యాబ్స్ అధినేత డాక్టర్ కె. అంజిరెడ్డి స్మృత్యర్థం సుదీర్ఘకాలంగా అందిస్తున్న పురస్కారాన్ని పత్రికా సంపాదకుడు బైస దేవదాస్‌కు, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ బి.ఎన్.శాస్త్రి పురస్కారాన్ని తెలంగాణ చరిత్ర పరిశోధనలో విశేష సేవలు అందించిన డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణకు, ప్రముఖ కవి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి, సినీ గీతకర్త మౌనశ్రీ మల్లిక్‌కు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య మడుపు కులశేఖర రావు స్మారక పురస్కారాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ గుండె డప్పు కనకయ్యకు, శాసనమండలి పూర్వ సభ్యుడు ఎం రామచంద్రరావు మాతృ మూర్తి నారపరాజు రాఘవసీత పురస్కారాన్ని వరంగల్‌కు చెందిన డాక్టర్ టి. శ్రీరంగ స్వామికి, తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారాన్ని మహబూబాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మకు, బూర్గుల రంగనాథరావు ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని కామారెడ్డికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ వి.శంకర్‌కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగత ప్రసంగం చేశారు. శాసనమండలి మాజీ సభ్యుడు ఎన్. రామచంద్రరావు, మహాత్మ జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, కవి జీ.వి.శ్యాం ప్రసాద్ లాల్, డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య, మడుపు ప్రభాకర్ రావు, బి.గోపాలకృష్ణ అతిథులుగా పాల్గొన్నారు.ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ఏ. సిల్మా నాయక్ వందన సమర్పణ చేశారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



ప్రభుత్వ బాయ్స్ లకోటియా హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి

● బీఆర్ఎస్ బీసీ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ శేఖర్ చారి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మాజీ మంత్రి,ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెన్షన్ చేయడం రాజ్యాంగానికి విరుద్ధమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ బీసీ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ శేఖర్ చారి అన్నారు. మంగళవారం ఉస్మాన్‌గంజ్‌లోని శంకర్‌బాగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను అమలు చేయడం లేదన్నారు. 15 నెలల్లో ఏ పథకం పూర్తిగా ప్రజలకు అందడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీపై ప్రభుత్వాన్ని నిలదీస్తే జగదీష్ రెడ్డిని అన్యాయంగా సస్పెన్షన్ చేశారని ఆరోపించారు. జగదీష్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినీలకు కంటి అద్దాల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కింగ్ కోఠి ఆస్పత్రిలో పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు గురుకుల మైనారిటీ హాస్టళ్లకు విద్యార్థులకు 15 రోజుల క్రితం కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. మంగళవారం బొగ్గులకుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గురుకుల మైనారిటీ హాస్టల్ విద్యార్థినిలకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. 29 మంది విద్యార్థి నీలకు కంటి అద్దాలను అందజేసిన కార్పొరేటర్ మహాలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి లక్ష్మి ప్రసన్న, ఆర్ బీఎస్ కే డాక్టర్ రమేష్, పిహెచ్ ఎన్ యేసులత విద్యార్థిని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ హర్షనీయం



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై బిల్లు ప్రవేశ పెట్టడం బిల్లు ఆమోదం పొందడం హర్షనీయమని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కో కన్వీనర్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

లెప్రసీ సర్వే షురూ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుల్తాన్ బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో లెప్రసి సర్వే మొదలుపెట్టామని పీహెచ్ఎన్ యం. భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. సుల్తాన్ బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 52,901 జనాభా ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లేందుకు ఆశా వర్కర్లను 20 బృందాలుగా విభజించి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. కుష్ఠ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నామన్నారు. ఈ సర్వే ఈనెల 30 వరకు కొనసాగుతుందని తెలిపారు.

పిస్తా హౌస్ మండీ ప్రారంభించిన కార్పొరేటర్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/ అమీర్‌పేట్



సనత్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ మండీ రెస్టారెంట్‌ను సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బాల్ రెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినియోగదారులకు రుచికరమైన, నాణ్యత గల ఆహార పదార్థాలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓయూ



హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామ్‌రెడ్డినగర్‌కి చెందిన దొడ్డి వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు చెట్టుకూరి దినేష్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50 వేల ఎల్ఓసీని బాధితుడికి అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేతన హరీష్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమి రెడ్డి, డా.చారి, కైలాష్ పతి గౌడ్, చెట్టుకూరి దినేష్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బు, లిక్కర్ ప్రభావం లేకుండా చూడాలి



- సీపీఐ(ఎం) నాయకులు టి.సాయి శేషగిరిరావు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎలక్షన్లలో డబ్బు, లిక్కర్ ప్రభావం లేకుండా చూడాలని సీపీఐ(ఎం) సంబంధించి టి.సాయి శేషగిరిరావు కోరారు. యూసఫ్‌గూడా సర్కిల్ 19 డీఎంసీ చాంబర్‌లో ఎలక్షన్‌కు సంబంధించి, ప్రతివారం ఒకరోజు ఆల్ పార్టీ మీటింగ్ జరుగుతుంది. అందులో భాగంగా మంగళవారం డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషనర్ ఎలక్షన్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు నిర్వహించే పద్ధతుల్లో, లోపాలు అలాగే రాజకీయ పార్టీల సలహాలు మార్పులు, చేర్పులు గురించి నాయకులను అడిగారన్నారు. సీపీఐ(ఎం) సంబంధించి టి.సాయి శేషగిరిరావు మాట్లాడుతూ.. ఎలక్షన్లలో డబ్బు, లిక్కర్ ప్రభావం లేకుండా చూడాలని, ప్రతిసారి అధికారులు తనిఖీలు చేస్తున్న, ఈ ప్రభావం ప్రతి ఎలక్షన్ సమయంలో అధికారులు పూర్తిగా అడ్డుకోలేకపోతున్నారని, వచ్చే ఎన్నికల్లో అయినా డబ్బు మద్యం పంపిణీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఓటర్ కార్డులు విషయంలో లబ్ధిదారులకు కార్డులు పంపించే విషయంలో పూర్తిగా లోపాలు ఉన్నాయని, ఎలక్షన్ల కోసం నియమించే సిబ్బందికి, అంటే ఆశ వర్కర్లులు, అంగన్వాడీలు వివిధ కాంట్రాక్టు మున్సిపల్ సిబ్బందికి పారితోషికాలు ఇచ్చే విషయంలో చాలా ఆలస్యం జరగటం వల్ల వారి పనిలో లోపం జరుగుతుందని, ఆ ప్రభావం ప్రజల మీద ముఖ్యంగా ఓటర్ల మీద పడుతుందని అన్నారు. పోలింగ్ బూతులలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని, సాక్షాత్తు ఎలక్షన్ల సిబ్బంది స్థానిక నాయకులకు తెలియజేస్తున్నారని, వీటిని అన్నిటిని సరిచేయాలని, అలాగే బీఆర్ఎస్ నాయకుడు వినోద్ మాట్లాడుతూ.. ఓటర్ కార్డులకు ఆధార్ కార్డు లింక్ చేస్తే దొంగ ఓటర్లని అరికట్టవచ్చని దీనిని తప్పకుండా చేయాలని కోరారు. బీఎస్పీ సభ్యులు మాట్లాడుతూ.. ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే లిక్కర్‌ను బ్యాన్ చేయాలని, ఆ విధంగా ఆలోచించాలని కోరారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఏసీపీ ప్రసీద, ఎలక్షన్ సిబ్బంది శశి ప్రసాద్, సీపీఐ(ఎం) నాయకులు టి. సాయి శేషగిరిరావు, జాకటి స్వామి, టీడీపీ రాష్ట్ర నాయకులు జీవీజీ నాయుడు, బీఎస్పీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం, సభ్యులు హాజరు కాలేదు.

అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి

- ఓయూ విద్యార్థి సంఘాలు జేఏసీ
- 20న, పరిపాలన భవన్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఓయూ

ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన నియంతృత్వ సర్క్యులర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా విద్యార్థి సంఘాల సమావేశం మంగళవారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నేడు (బుధవారం) ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు రాస్తారోకో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికీ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్న వీసీ, రిజిస్ట్రార్ స్పందించకపోవడం దుర్మార్గామని పేర్కొన్నారు. ఈనెల 20న, ఓయూ పరిపాలన భవనం ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ ధర్నా కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్లు, పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజా పాలన చేపడతామని చెబుతూ ఒక వైపు యూనివర్సిటీలో ధర్నా, నిరసన తెలియజేయవద్దని చెప్పడం దేనికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల గొంతులనునొక్కే అప్రజాస్వామిక సర్క్యులర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అసెంబ్లీలో వివిధ ప్రతిపక్ష పార్టీలు స్పందించాయని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అప్రజాస్వామిక సర్క్యులర్ ఉపసంహరించుకొని ఓయూ అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం 1000 కోట్ల నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఉస్మానియా యూనివర్సిటీ అస్తిత్వాన్ని దెబ్బతీసే ఈ నియంతృత్వ అప్రజాస్వామిక సర్క్యులర్ వెనక్కి తీసుకోని దాకా జరిగే పోరాటంలో ప్రొఫెసర్స్, మేధావులు, ప్రజా సంఘాలు వివిధ పార్టీలు మద్దతుతో మరిన్ని ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ ఐక్య కార్యచరణలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, అధ్యక్షులు లెనిన్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర్, కార్యదర్శి సుమంత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అనిల్, జంగయ్య పెద్దమ్మ రమేష్ ముదిరాజ్ చటారి దశరథ్, ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు శేఖర్, అంజి, ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు నాగరాజు, ఎస్ఎస్‌యూ నవీన్, టీఎస్‌యూ నల్లగొండ అంజి, ఎన్ ఎం శ్రీకాంత్, వీజేఎస్ మాసంపల్లి అరుణ్ కుమార్ తదితరులు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంటి పరీక్షా శిబిరం ప్రారంభించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఐదోవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) ద్వారా కంటి పరీక్ష నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి లాలాపేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు అవసరమైన కంటి కంచాలు (స్పెక్టకిల్స్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకుని, వారి సమస్యలను ప్రశ్నించారు. డిప్యూటీ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా అభివృద్ధి కోసం ప్రభుత్వ చొరవను ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి, వ్యక్తిగత ఆసక్తి చూపుతూ.. విద్యాసంస్థల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కంటి పరీక్షల తరువాత అవసరమైన విద్యార్థులకు ఉచిత కంటి కంచాలను పంపిణీ చేయడం ద్వారా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ శాసనసభలో బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినందుకు ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి నగర ఇన్‌చార్జి బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలసి అభినందనాలు తెలిపారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

తాగునీటి సమస్య రాకుండా చూడండి

- వాటర్ వర్క్స్ మేనేజర్‌కు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

తాగునీటి సమస్య రాకుండా చూడాలని సీపీఐ(ఎం) నాయకులు వాటర్ వర్క్స్ మేనేజర్ రాజేంద్రను కోరారు. మంగళవారం సీపీఐ(ఎం) నాయకులు ఎస్పీఆర్ హిల్స్‌లోని మహాత్మా నగర్, ఆశయ్య నగర్, బీజేఆర్ నగర్ బస్తీలలో మంచినీరు ప్రెషర్ లేకుండా చాలా సన్నగా వస్తున్నాయని, అవి ఏమాత్రం సరిపోవటం లేదని, ఆయా బస్తీల ప్రజల సంతకాలతో కూడిన, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు, టి. సాయి శేషగిరిరావు, రహమత్ నగర్ డివిజన్ పార్టీ కన్వీనర్ జాకటి స్వామిలు మాట్లాడుతూ గత కొన్ని ఏండ్లుగా ఎంతోమంది మంచినీటి కోసం, వాటి మీద ఉన్న సమస్యల కోసం ఎన్నో పోరాటాలు చేశారని, మంచినీటి పోరాటంలో సీపీఐ(ఎం) ముందు బాగానే ఉందని, దానిలో భాగంగానే వాటర్ బోర్డ్ అధికారులు పెద్ద ట్యాంక్‌ని కట్టి ఈ మధ్యనే ప్రారంభోత్సవం చేశారని అన్నారు. అయినా సరే గతంలో కాకుండా ఇప్పుడు రోజు విడిచి రోజు మంచినీళ్లు వస్తున్నాయని, ఇది సంతోష దాయకమైన వార్త అని, మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాని ఇంకా కొన్ని సమస్యలు టెక్నికల్‌గా ఉన్నాయని, వాటిని కూడా పరిష్కారం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. దీనికి వాటర్ బోర్డ్ మేనేజర్ రాజేంద్ర స్పందిస్తూ ఇప్పుడున్న వాటర్ ట్యాంకు లెవెల్‌కి సమానంగా ఈ బస్తీలు ఉండటం వల్ల 25 ఫీట్లు నిండుగా ట్యాంకు లెవెల్ చేసి ఈ బస్తీలకు మంచి నీళ్ల వదిలితేనే తప్ప నీళ్ల మంచిగా వచ్చే అవకాశం లేదని, ఆ విధంగా చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయటానికి ప్రయత్నం చేస్తామని, నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బస్తీల ప్రజలు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో భాగ్యరాజ్, ఏఆర్ నరసింహ, పెదకురుమయ్య, రాజేష్, బాలయ్య, అలివేలు, లక్ష్మమ్మ, సావిత్రమ్మలు పాల్గొన్నారు.

నిమ్స్ సీఐటీయూ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో మంగళవారం ఏకగ్రీవంగా యూనియన్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా నాయకత్వంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వెంకటేష్, ప్రవీణ్, డిప్యూటీ సెక్రెటరీగా పి శ్రీనివాస్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఊర్మిళ బాలయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఈ నరసింహ, ఎస్ లక్ష్మి రాధిక, కోశాధికారిగా వెంకటేష్, ఆల్ ఇండియా ఈశ్వర, తెలంగాణ స్టేట్ లీడర్, జె.వెంకటేష్, కుమారస్వామి, ఇతర యూనియన్ నాయకులు ఎన్నికయ్యారు. కార్మిక కర్షక లోకం కోసం వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తీర్మానించారు.

డ్రయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డ్ 4వ వార్డ్‌లోని హరిజన బస్తీలో రూ.15 లక్షల కంటోన్మెంట్ బోర్డ్ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున్ మంగళవారం చేప ట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియో జకవర్గంలో ప్రగతిపదం తీసుకోవటమే తన ధ్యేయమని, నియోజకవర్గంలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మాట్లాడుతూ.. బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది వార్డులో సమస్యలు లేని బోర్డుగా తీర్చిదిద్దామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేను, నామినేటెడ్ సభ్యురాలును సన్మానించారు.

బాధితులను పరామర్శించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కంటోన్మెంట్



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్య నగర్‌కు చెందిన అద్దాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరే టర్ ముద్దం నరసింహ యాదవ్ వారి ఇంటికి వెళ్లి శ్రీనివాసుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారికి ధైర్యాన్ని చెప్పారు. పరామర్శించిన వారిలో హరినాథ్, పోచయ్య, ఐలేష్ శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, మట్టి శ్రీనివాస్, రాజు గౌడ్, ఉమాఅక్క, తిరుపతన్న, బుర్రి యాదగిరి, తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ కంటోన్మెంట్



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ.. అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం పట్ల సంతోషం కంటోన్మెంట్ కాంగ్రెస్ శ్రేణులు, బీసీ నేతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ ముందు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రు లకు, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీల చిత్రాపటాలకి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్ బాబు, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, మార్కెట్ కమిటి డైరెక్టర్ సంతోష్, పెద్దాల నర్సింహ, సంతోష్ యాదవ్, బద్రి యాదవ్, అర్వింద్ యాదవ్, సాయి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ సి.ఏ ప్రసన్నకుమార్

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సి.ఏ ప్రసన్న కుమార్‌ని సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రసన్నకుమార్ తన వృత్తి నైపుణ్యాల ద్వారా ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. డిజిటల్ యుగంలో వస్తున్న మార్పుల ఆధారంగా తమ నైపుణ్యాలను పెంచుకునే విషయంపై చార్టెడ్ అకౌంటెంట్లు ఎప్పటికప్పుడు మార్పులను గమనించాలని ఈ సందర్భంగా జరిగిన చర్చలో పాల్గొన్న అకౌంటెంట్ ప్రముఖులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏఐ, అవొపా జాతీయ అధ్యక్షులు, సీఏ బెల్డి శ్రీధర్, ఇతర ఆఫీస్ బేరర్స్, ఈసీ మెంబర్స్‌తో పాటు వైశ్య ప్రొఫెషనల్ అడ్వకేట్స్‌కి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ డివిజన్, వెంకటగిరి డివిజన్‌లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, టీడీపీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ జీవీజీ నాయుడు అన్నారు. మంగళవారం వెంకటగిరిలోని వాటర్ రిజర్వాయర్ వద్దకు, స్థానిక వాటర్ వర్క్స్ మేనేజర్‌తో కలిసి వెళ్లి వాటర్ ట్యాంకర్స్ డ్రైవర్లతో మాట్లాడారు. స్థానిక ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, బుక్ చేసుకున్న వెంటనే ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని కోరారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి గుండె చికిత్స

నవతెలంగాణ-సిటీబ్యూరో



బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ వైద్యులు 68 ఏండ్ల రోగి సుభాషిణినికి (పేరు మార్చబడింది) విజయవంతంగా చికిత్స చేసి ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడేశారు. ఆమె తీవ్రమైన గుండెపోటుతో బాధపడుతూ.. పలు వైద్య సమస్యలతో పోరాడుతూ హాస్పిటల్‌కు వచ్చారు. ఆమెకు ఇప్పటికే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, ఊపిరితిత్తుల వ్యాధి, షుగర్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. గుండె ధమనుల్లో తీవ్రమైన గడ్డలు, గుండె వైఫల్యంతోపాటు, ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. సంప్రదాయ గుండె శస్త్ర చికిత్స ప్రమాదకరమని భావించడంతో, వైద్యులు కొత్త మార్గాన్ని అన్వేషించారు. హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగ అధిపతి డాక్టర్ వి.సూర్య ప్రకాశరావు నేతత్వంలో నిపుణుల బందం పర్క్యుటేనియస్ కరోనా రీ ఇంటర్వెన్షన్ ద్వారా స్టెంట్ అమరిక చేయాలని నిర్ణయించింది. గుండె ధమనుల్లో మార్పులను ఖచ్చితంగా అంచనా వేయడానికి ఇన్‌ట్రా-వాస్క్యులార్ అల్ట్రాసౌండ్‌ను ఉపయోగించారు. శస్త్ర చికిత్స సమయంలో గుండె పనితీరును మద్దతుగా ఉంచేందుకు, ప్రపంచ స్థాయి మెకానికల్ సపోర్ట్ డివైస్ అయిన ఇంపెల్లా స్మార్ట్ అసిస్ట్‌ను వినియోగించారు. ఇది రక్తపోటు, గుండె పనితీరును మెరుగుపర్చింది. చికిత్స అనంతరం ఆమెను 5-7 రోజులు ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ.. "సుభాషిణి కేసు క్లిష్టమైనది. ఆధునిక సాంకేతికతలు, మల్టీ డిసిప్లినరీ వైద్య బృందం సహాయంతో ఆమెను రక్షించగలిగాం. ఈ విజయం మా గుండె సంరక్షణ నైపుణ్యాన్ని నిరూపిస్తుంది" అని అన్నారు. కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బిజు నాయర్ మాట్లాడుతూ.. "ఈ కేసు ఆధునిక వైద్య సాంకేతికత, నైపుణ్యం కలయిక ఎంత ప్రభావవంతంగా ఉంటుందో చూపిస్తుంది. కేర్ హాస్పిటల్స్‌లో మేం రోగుల ఆరోగ్య సంరక్షణకు కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నాము" అని పేర్కొన్నారు.

తొలి ప్రయత్నంలోనే ఏఓఆర్‌గా దేవ్

నవతెలంగాణ-ఓయూ



అతని కుటుంబం ఎలాంటి న్యాయ విద్యాకు సంబంధం కాదు. కానీ తొలి ప్రయత్నంలోనే శభాష్ అని పించుకున్నారు. ఓయూ పూర్వ న్యాయ కళాశాల విద్యార్థి దేవ్ ఏర్పుల.. ఓయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ (2012-2017), ఎల్ఎల్ఎం (2017-2019) పూర్తి చేశారు. ఇటీవలే వెలువడిన ప్రతిష్టాత్మక 'అడ్వకేట్ ఆన్ రికార్డ్ సుప్రీమ్ కోర్టు ఆఫ్ ఇండియా' (ఏఓఆర్), అర్హత పరీక్షలో ఎంపిక అయ్యారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఏర్పుల దేవ్. దేశంలో అతి పిన్న వయస్సులోనే న్యాయ వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎఓఆర్‌గా ఎంపికైన వారిలో ఒకరు. దీనితో దేవ్‌ను ఢిల్లీలో సుప్రీంకోర్టు అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ వారు, తెలంగాణ హై కోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్, ఓయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌లు వేరు వేరుగా ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో మానవ హక్కుల సంరక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)లో న్యాయ పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు చెప్పారు. అతని తల్లిదండ్రులు చందర్, లక్ష్మీ మిత్రులు లా కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్స్, సహ విద్యార్థులు దేవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రశంసించారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎంకు కృతజ్ఞతలు

- ఓయూ విద్యార్థి నాయకులు వలిగొండ నరసింహ

నవతెలంగాణ-ఓయూ




మాదిగ, మాదిగ ఉప కులాల 30 ఏండ్ల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ పోరాటానికి బాసటగా నిలిచి, భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ సామాజిక న్యాయ స్ఫూర్తికి అనుగుణంగా, పార్లమెంటరీ పార్టీ ప్రతీపక్ష నేత రాహుల్ గాంధీ ఆలోచనలకు మేరకు ఎస్సీ కులాల్లో అన్ని వర్గాలకి విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు సమాన పంపిణీ ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో, ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప జేసిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు కోసం కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, ప్రత్యేకంగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే వేముల వీరేశం, మాదిగ ఉద్యమాన్ని నడిపిన పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మాదిగ విద్యార్థి, యువత భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడంమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు పోవాలని విద్యార్థిని విద్యార్థులను ఆయన కోరారు.

తనను బంధించారంటూ.. వ్యక్తి 100కు కాల్

- విడిపించిన పోలీసులు

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఓ వ్యక్తి తననూ రాక్షించండి.. బంధించారంటూ 100 డైల్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలవంతంగా పిలిచి బంధించారంటూ రెండు నెలల క్రితం 'సుచిర్ ఇండియా' సంస్థలో ప్రియాంక్ అనే యువకుడు ఉద్యోగంలో చేరాడు. సుచిర్ ఇండియా సంస్థలో మార్చి నెల కావడంతో ఆడిటింగ్‌లో వరంగల్ వెంచర్‌కు సంబంధించిన లెక్కల్లో రూ.5 లక్షలు అవకతవకలు జరిగినట్టు తేలిందనీ సంస్థ జీఎం మధుసూదన్ ఆరోపించారు. ఆ మొత్తాన్ని ప్రియాంక్ తీసుకున్నారనే అనుమానంతో ఈ వ్యవహారాన్ని గురించి మాట్లాడదామనీ మధుసూదన్ సోమవారం ప్రియాంక్‌ను పిలిచారు. ఇద్దరు కలిసి నంది నగర్‌లోని సుచిర్ ఇండియా ఎండీ కిరణ్‌కు సంబంధించిన పాత ఆఫీసుకు పిలిపించారు. కాసేపటికి అక్కడికి వచ్చిన సుచిర్ ఇండియా కిరణ్ డబ్బులు ఎక్కడున్నాయ్ ఏం చేసావ్ అంటూ దుర్భాషలాడడంతో పాటు మర్యాదగా రూ.5 లక్షలు కట్టకపోతే అంతు చూస్తానంటూ బెదిరింపులకు గురి చేశారు. సాయంత్రం దాకా గదిలో కూర్చోబెట్టి బయటకు వెళ్లాడు. కిరణ్ బయటకి వెళ్లిన తర్వాత ప్రియాంక్ డయల్ 100కి కాల్ చేసి తనను గదిలో బంధించారు అని ఫిర్యాదు వేయడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని విడిపించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సుచిర్ ఇండియా ఎండీ కిరణ్ మీద పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కిరణ్ బంజారాహిల్స్ రాడిసన్ బ్లూలో డాక్టర్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా అన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు సయ్యద్ సోహెల్ తో పాటు ముస్లిం మత పెద్దలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతకారులను మరింత ప్రోత్సహించాలి

- అనన్య ఎ సిమ్హై

నవతెలంగాణ-బంజారాహిల్స్



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో నిర్వాహకులు జయేష్ గుప్తా ఏర్పాటైన హ్యాండ్ లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను సామాజిక వేత్త అనన్య ఎ సిమ్హై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హాలులో కొలువుదీరిన చేనేతకారుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ.. చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగి మాట్లాడారు. చేనేతకారులను మరింత ప్రోత్సాహించాలన్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

జవహర్‌నగర్‌లో ముగ్గురు అదృశ్యం..

నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్‌లో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 19 ఏండ్ల పాలపర్తి సోఫియా దమ్మాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్నది. సోమవారం ఉదయం హాల్ టికెట్ తీసుకోవడానికి సోఫియా వాళ్ళ అన్న స్కూల్ వద్ద బైక్ మీద ఆమెను దింపి వెళ్ళాడు. మధ్యాహ్నం సోఫియా తండ్రి ఇస్రాయిల్ ఆమెను తీసుకురావడానికి వెళ్లగా అక్కడ సోఫియా లేకపోవడంతో స్కూల్ లో అడుగగా స్కూల్‌కు రాలేదని చెప్పారు. దాంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం సోఫియా తల్లి నయోమి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో భర్త వెంకటేష్ 25 ఏండ్ల పొట్లా తన్మయి దంపతులు. తన్మయ ఒక ప్రయివేటు కంపెనీ లో ఉద్యోగం చేస్తున్నది. సోమవారం ఉదయం సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో 3జీ హెచ్ఆర్ సొల్యూషన్స్ వద్ద ఇంటర్వ్యూకి వెళ్తున్నాని చెప్పి వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. మంగళవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పాలపర్తి సోఫియా


పొట్లా తన్మయ


అలుకాపతి మారియమ్మ

భర్త నితేష్, 23 ఏండ్ల అలుకాపతి మారియమ్మ దంపతులు. యాప్రాల్ లోని ఒక సూపర్ మార్కెట్లో అలుకాపతి మారియమ్మ పనిచేస్తున్నది. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నాని ఇంటి నుండి బయలుదేరి ఇప్పటికి తిరిగి రాలేదు. సూపర్ మార్కెట్లో అడుగగా ఆమె డ్యూటీకి రాలేదని తెలిపారు. చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ తెల్వకపోవడంతో మంగళవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) మెమోరాండం

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని మొబైల్ అంగన్వాడి సెంటర్స్ వెంటనే రద్దు చేయాలని .కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిరసన దీక్ష కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కి మెమోరాండం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ కలెక్టర్ మాట్లాడుతూ వీరి సమస్యలను తన దృష్టిలో ఉన్నాయని.. పరిష్కరిస్తానని హామీనిచ్చారు. యూనియన్ హైదరాబాద్ నగర నాయకులు టీ మహేందర్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టులోని టీచర్లు హెల్పర్లకు ప్రతి నెలా వేతనం రాకపోవడంతో వారు పెద్ద ఎత్తున ఇబ్బందులకు గురవుతు న్నారని తెలిపారు. కావున తక్షణమే వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి నెలా వేతనము ఎందుకు రాలేదని అధికారులను అడిగితే తెలంగాణ ఐఎఫ్‌సీఎస్ కోడ్ వల్ల ఆలస్యం అవుతున్నాయని సమాధానం చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు వేతనాలు రావటం లేదన్నారు. పై అధికారులు చొరవ తీసుకొని తక్షణమే వేతనాలు వచ్చే రకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే రకంగా కూరగాయలు, గ్యాస్ బిల్లులు, మినీ సెంటర్ వాళ్లకు పెరిగిన వేతనాలు ఇవ్వాలనీ, ఫోన్స్, యాప్స్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుజరాత్ ప్రభుత్వంలాగా అంగన్వాడీ టీచర్లను ఆయాలని పర్మినెంట్ చేయాలని అలాగే సుప్రీంకోర్టు అంగన్వాడి టీచర్లకు ఆయాలకు గ్రాడ్యువిటీ ఇవ్వాలని చెప్పి కోరిన ఇప్పటివరకు ఆ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం పిఎం శ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ హెల్మెటీ కేంద్రాలను 28 జిల్లాల్లో 56 కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ నిర్ణయం ఐసీడీఎస్‌ను అంగన్వాడీ కేంద్రాలకు నిర్వీర్యం చేయడమే తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. దీనివలన అంగన్వాడీ సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న సేవలు దూరం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని అన్నారు. నాయకులు వై నరసమ్మ, ఆర్ అనురాధ, బి.వనిత, వి చంద్రకళ, ఏ పుష్ప ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఇవ్వాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్

కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని మంగళవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా సెక్రెటరీ ఎం రేవతి కళ్యాణి మాట్లాడుతూ.. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా నిర్వహించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఆశాలకు ఫిక్స్ వేతనం ఇస్తామని, హామీ ఇచ్చిందని తెలిపారు. ఏఎన్ఎం ట్రెనింగ్ చేసిన ఆశాలకు ఏఎన్ఎం ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, శిరీష, లలిత ప్రవీణ కవిత, కోమల యాదక్క పాల్గొన్నారు.



బీసీ బిల్లు అమలుపై న్యాయవాదుల సంబరాలు

నవతెలంగాణ-కాప్రా

బీసీ బిల్లును అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు, వారి క్యాబినెట్‌కు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మల్కాజిగిరి బార్ అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం వారు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70 సంవత్సరాలు నుంచి అన్యాయం జరుగుతుంది కాబట్టి బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయాలలో 42 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చేప్పడం, కేంద్ర ప్రభుత్వంతో కూడా అమలు చేయించడానికి బాధ్యత వహిస్తామని చెప్పడం చాలా సంతోషం అన్నారు. కేంద్ర మంత్రులు, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు దీనికి బాధ్యత తీసుకొని అన్ని పార్టీలను ఒప్పించి పార్లమెంటుల దాని అమలు చేయించాల్సిందిగా కోరారు. బీసీ బిల్లు అంటే ఇది ఎవరికి వ్యతిరేకం కాదని.. ఇది బీసీల న్యాయమైన ధర్మమైన వాటా అన్నారు. ఈ సంబరాలలో జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పొన్నం దేవరాజ్ గౌడ్, తురక రత్నయ్య కె వాసు, స్వాతి, సునీత రాజు, బుడంపల్లి సుధీర్ బాబు, మన్మోహన్ యాదవ్, జాహ్నవి, దుర్గ, పెద్ద ఎత్తున సీనియర్ అడ్వకేట్ జూనియర్ అడ్వకేట్, మహిళా అడ్వకేట్ అందరూ పాల్గొని విజయవంతం చేశారు.



ఓల్డ్ బోయిన్‌పల్లిలో పర్యటించిన కేటీఆర్

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-కంటోన్మెంట్

మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మంగళవారం రాత్రి కూకట్ పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పర్యటించారు. ఆయనకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బోయిన్‌పల్లిలో తెలంగాణ స్కూల్స్ వ్యాన్స్, క్యాబ్స్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ రావ్, శంబిపూర్ రాజు,కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మా యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఓల్డ్ బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మా యాదవ్ ఇంటి చేరుకున్న కేటీఆర్ కొద్దిసేపు అక్కడ ఉన్నారు. అనంతరం అస్మత్‌పేట్ బడేగూడలో బడే మసీదులో మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందుకు ముందుకు ప్రతి రంజాన్‌కు పేద ముస్లింలకు ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చే వాళ్ళ ం.. అలాగే గరీబ్ క్రిస్టియన్‌లకు అని కేటీఆర్ మాట్లాడుతుండగానే రోజా సమయం అయ్యిందని కార్పొరేటర్ అనడంతో ఆయన మాట్లాడకుండానే మైక్ ఇచ్చేశారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT: MALKAJGIRI
I.A No. 29 OF 2023 IN O.S.NO. 583 OF 2022

Between:
Pasula Narsimha .....Petitioner/Plaintiff
AND
Sri.P. Babu Naidu and others ...Respondents/Defendants

To,
1. Sri.P. Babu Naidu, S/o. P. Chinna swamy Naidu, R/o. HNo. 1-84/6, Annapurna Colony, Mallapur, Uppal Mandal, Hyd-500076.
2. Smt. S. Kalyani, W/o. S. Ashok, R/o. HNo. 12-10-405, Namalagundu, Secunderabad – 61.
3. Puli Shiva Kumar, S/o. P. Narsimha, R/o. H.No. 11-1-624/1/2/303, Dhood Bavi, Warasiguda, Secunderabad – 61.
4. Smt. K. Vasantha, W/o. Late. K. Balaiah,
5. Durgamma, D/o. Late. K. Balaiah,
6. K. Vijay Kumar, S/o. Late. K. Balaiah,
7. K. Yadagiri, S/o. Late K. Durgaiah,
8. K. Sanjeeva, S/o. Late. K. Durgaiah,
9. Y. Anjamma, W/o. Y. Sanjeeva (D/o. Late. K. Durgaiah)
Above 4 to 9 are R/o. HNo. 3-13-73/1, Mallapur, Nacharam, Hyderabad-500076.

Whereas the Petitioner/ Plaintiff have filed the above suit against you for Declaration and recovery of possession. The above IA is posted to **08.04.2025.** You are hereby summoned to appear either in person or through your advocate at 10:30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the petition will be heard and determined ex-parte.

(BY ORDER OF THE HON'BLE COURT)
(K. YADAGIRI RAO)
Advocate,
207 & 208 Aditya Towers, Vinayaka Nagar, Neredmet, Secunderabad.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRTICT & SESSIONS JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT : MALKAJIRI
I.A.NO.648 OF 2024 IN O.S.NO. 111 OF 2024

Between:
S.A.Mahaboob Basha. ...Petitioner/Plaintiff.
And
1. E. Keerti Bhaskar.
2. Sri Mettu Kishore Reddy.
3. Smt. Mettu Roja. ....Respondents/Defendants.

To,
1. K. Keerti Bhasker S/o E.Sudhakar Rao, R/o MIG 895, II Phase, KPHB, Kukatpally, Medchal-Malkajgiri Dist
2. Sri Mettu Kishore Reddy S/o Sri Mettu Krishna Reddy, R/o H.No.5-10-24/56, MIGH-56, APHB Colony, Moula Ali, Secunderabad.
3. Smt. Mettu Roja W/o Sri Mettu Kishore Reddy, R/o H.No.5-10-24/56, MIGH-56, APHB Colony, Moula Ali, Secunderabad.

This is to inform you that the above named Petitioner/plaintiff has filed the above I.A. No.648 of 2024 for grant of interim injunction against you. The Hon'ble Court issued notices to you on several occasions, but the same were returned unserved. Hence the Hon'ble Court ordered paper publication of notice to you as substitute service and posted the matter on 08-04-2025. Therefore you are required to appear before the Hon'ble Court on **08-04-2025** at 10:30 A.M. in person or through Advocate, otherwise the Hon'ble Court will pass necessary orders in this regard.

// By order of the Court //
Sd/-
Mohd. Shafiuddin, Advocate
Enrolment No:AP./32/1978
High Court Computer Code No. 3028
Cell No: 9394090786

MISSING DOCUMENT

I, **Mr.NAND KUMAR SINGH, S/o. LAXMI PRASAD,** age 63 years, Occ: Retd. Employee, R/o.H.No.1-4-180/A-23/2, BHEL RND COLONY Old Alwal, Secunderabad, Telangana, India. , I further submit that I have lost my above said **SALE DEED on 12.03. 2025,** while I was travelling from my home to Alwal Main Road on my bike. **I have lost the Sale Deed No.2023/1997,** Registered at S.R.O. Shameerpet, having Plot No.71, In Sy.No.409 & 412, Situated at Rampally Village, Keesara Mandal, Medchal-Malkajgiri District, Telangana.
I further submit that I have lodged a complaint to concerned Police Station Authorities Alwal, P.S., Hyderabad, through Online Petition ID No. I further submit that I tried and in spite of my best efforts I am unable to trace it and it is lost beyond recovery. In case if it is traced in future I shall submit it to the Concerned Authorities for cancellation.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE,RANGA REDDY DISTRICT AT KUKATPALLY
O.S.No: 586 of 2023

Between:
IDBI BANK Ltd., ... Plaintiff
AND
Sri. Shatgopam Bhaskar & another ..... Defendants

To,
D1. Sri. Shatgopam Bhaskar S/o. Venugopal Shatgopam proprietor M/s. Bhaskar Sai Enterprises Aged about: 42 years, Occ: Business R/o. H.No: 136/1/12, Vidhyanagar, Chanda Nagar,Hyderabad –50.
D2. Smt. Shatgopam Swapna W/o. S. Bhaskar Aged about: 37 years, Occ: Business R/o. H.No: 10-115/5, Vemukunta, Chanda Nagar, Hyderabad – 500 050.

Whereas the above named plaintiff filed suit against you for recovery of Rs.4,55,070/- and the same is posted to 19-03-2025 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.

K.P.SARADHI
Advocate
Flat No. 102, Ist Floor, Temple View Residence, Beside LPG Auto Gas Station, Hyderabad.
9246374879/ 64553849

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: MAHESHWARAM
O.S.No.53 of 2025

Between:
SATHURI JANGI REDDY @ JANGA REDDY and another, ...PLAINTIFFS
And
1.The Tahasildar Maheshwaramn Mandal
2.All Concerned ...DEFENDANTS

To
All Concerned.
Place take notice that the plaintiffs filed the present suit seeking relief to grant legal heir certificate in favour of plaintiffs as they are the legal heirs of the deceased namely SATTAR @ BOLLAVARAM GEETHA, she died on 06-07-2020 and the suit is posted on 01-04-2025, for appearance of defendants for any filing objections or required to appear before the HON'BLE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT MAHESHWARAM AT about 10-30 A.M. either personally or through advocate otherwise, the matter will be decided exparte.

"By Order of the Court"
M/S.S.MURALI GOUD, ADVOCATE.
H.NO.6-54, Kandukur X Road Village, Kandukur Mandal, R.R.District.9948872977.

IN THE COURT OF THE HON'BLE II ADDL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR.
O.S.NO.1189 OF 2019

Between:-
Sri.L.Papi Reddy and others ...Plaintiffs
And
Sri.Jammu Papa Rao ...Defendant

To
Sri.Jammu Papa Rao S/o Jammu Ramulu, aged about: 64 years, Occ: Advocate, R/o.Shop No.24 & 25, 3rd Floor, United Arcade Commercial Complex, Attapur, R.R.District-500 048.

Take notice that in the above matter the suit is coming for trial and the plaintiff no.1 filed his chief examination affidavit as PW1, the notices were sent to your address, but the same was returned unserved with endorsement that no person is residing in the said address. Hence the Hon'ble Court was pleased to order the publication of notices to you through the publication and posted the matter on 03-04-2025. As such you are hereby ordered to appear before the above mentioned Hon'ble court on 03-04-2025 at 10:30 am, as you being an advocate pursuing the matter as party in person, falling which the matter will be decided as per law.

// By order of the Court //
P.CHANDRASHEKAR
Shailaja,
Advocates.
Off: G-1, Ground Floor, Laxmi Residency, Barkatpura, Hyderabad. 9848933667

FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES
(Order V Rules 3 & 5)
IN THE COURT OF HON'BLE II JUNIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT: MEDCHAL
OS.No: 892 OF 2022

Between:Union Bank of India (erstwhile Corporation Bank), Medchal Branch, ... Plaintiff
AND
1. Lavanga Lalitha W/o L.Srinivas, R/o- 1-149, Krupa Colony,Edu Gullu, Medchal, Medchal-Malkajgiri Dist., T.S-501401.
2. M/s Varshita Saree Material Centre, Rep.by L. Lalitha, Situated Besides Seven Temples, Medchal,Medchal-Malkajgiri Dist.,-T.S-501401. ..... Defendants

Whereas the above mentioned plaintiff has instituted as suit against you for Recovery of moneyyou are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the 08th day of April 2025 at 10-30 O' clock. In the forenoon to answer the claim, and further you are hereby directed to file Within 30 days of service of summon a written statement of your defense And to produce on the said day all documents in your possession or power upon Which you base your defense.
Take notice that in default of your appearance and to file your written Statement within 30 days the suit will be heard and determined in your absence.
Given under my hand seal of this court this 18th Day of February 2025
JUDGE NOTICE: 1) Should you appeared your witness will not attend on their own Accord you can have summons from this court to compel the attendance of any witness and production of any document that you have a right to call necessary Expenses.
2) If you admit the claim you should pay the money into court together with Cost of the suit to avoid execution of the decree, which may be against your person or property or both.

M.Kanaka Durga,Advocate
H.No.19-4, Niharika Nivas, Gautam Nagar Road, Near Rail Gate, Malkajgiri,Medchal-Malkajgiri Dist- 500047. Cell No: 9030484458

IN THE COURT HON'BLE COURT XI ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR
M.V.O.P.No. 238 OF 2024

Between:
G.S Chakravarthi ...Claim petitioner
AND
Velagapuri varun& another ...Respondents

To,
R1:Velagapuri varun S/o. Someshwar Rao, Age: 24 Yrs, Occ: Occupation: Driver of the vehicle Bearing No: AP22E 4334 R/o.H.No.6-2-982/A, Old V.T. Colony Hyderabad road, Nalgonda Nalgonda district-508001
R2.B.Somasundar Rao S/o not known, Aged about: 40, Occupation:owner of the vehicle Bearing No: AP22E 4334R/o H.No.11-14-179, Haripuri colony R.K.Puram, Saroor Nagar, R.R.Dist. ...Respondents

Sir, Whereas the above named Petitioner has filed the above said MVOP seeking claim of compensation against NO.1&2 you, due to the motor accident in respect of injuries sustained by him. The Hon'ble court posted the matter on 03-04-2025 at 10.30.am for your appearance.
Therefore, you are hereby requested to appear before the Hon'ble XI addl. District judge at:L.B.Ngar-T.S. at 10.30.am on 03-04-2025 either in person or through your counsel duly instructed. Otherwise the matter will be heard and decided exparte in your absence.

(By order of the court)
(ANJAIAH KANDULA)
R.Malleshwari
Advocates
Road No.6, Kakathiya colony, L.B.Nagar, Hyderabad-
Ph.9949059075
Counsel for Petitioner

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE : SANGAREDDY DISTRICT :: AT: SANGAREDDY
I.A No.OF 2025 IN I.A No.397 OF 2024 IN A.S No.530 OF 2024

BETWEEN :
Neelisetty Venkateshwara Prasad ...Petitioner/Appellant
AND
Billakanti Venkataiah @ Venkatesham ...Respondent / Plaintiff
AND
Maa Sai Datta Estate Ltd, Rep.by M.D. G.Prasad Rao ...Respondent/Defendant

NOTICE

To,
R/D] M/s. MAA SAI DATTA ESTATE LTD., Rep. by its M.D.G.Prasad Rao, S/o.Venkata Subbaiah, R/o. Flat No.101, Haritha Apartments, Madhura Nagar, Hyderabad – 500 038.

Please take notice that the Petitioner/Appellant had filed the above Appeal seeking leave for filing the Appeal against the ex-parte Judgment and Decree dated 20.11.2006 in OS No.19/2006 on the file of the Hon'ble Senior Civil Judge, At : Sangareddy in which, the Petitioner / Appellant was not made as a party. I submit that along with the above Appeal, the Petitioner/Appellant also filed application for condonation of delay caused for filing leave petition for grant of leave to file above Appeal. I submit that the summons were sent to the Respondent/Defendant through this Hon'ble Court but were returned un-served. Hence, this Hon'ble Court was pleased to Order for substitute service for your appearance and posted the matter to 11.04.2025.
Hence, you are requested to appear before the Hon'ble Court at 10:30 a.m. on 11.04.2025 either personally or through your authorized Counsel for submitting your claim or otherwise, the matter will be adjudicated as per law. Hence, this notice.

(BY ORDER OF THE COURT)
AKULA MAHESH KUMAR
Advocate
Flat No.206, 2 nd Floor, Indra Dhanush Apartments, Beside Axis Bank, Road No.2, Banjara Hills, Hyderabad – 034.
Cell : 98489 33536

IN THE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE AT KAKINADA
HMOP - 235 / 2022

Between:
Pochiraju V.N.A Srikanth ... Petitioner
and
Pochiraju Srimadhu, (Kambampati Sai Madhu), D/o. (late) Venkateswara Prasad, D.No. 3-154/2/5/209, Mallikarjuna Enclave, Peerjadhiguda,Hyderabad, K.V. Ranga Reddy, Telangana - 500039. ... Respondent

వాయిదా తేది: 25-03-2025

పై నెంబరు కేసులో మీరు రెస్పాండెంట్ అయిఉన్నారు, మీ భర్త గారు మీ పై Divorce కేసు వేసియున్నారు. మీకు ఎన్ని సార్లు కోర్టు సమన్లు పంపినను మీరు తీసుకోనందున మీరు **ది.25-03-2025వ తేదీన ఉదయం గం. 10-30 గంటలకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లాయిర్ గారి ద్వారాగాని హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
B. KISHORE KUMAR, V. SATYAVENI, Advocates
Sriramnagar, Kakinada - 3, Cell: 9391317415

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE : SANGAREDDY DISTRICT :: AT: SANGAREDDY
I.A No.OF 2025 IN I.A No.396 OF 2024 IN A.S No.529 OF 2024

BETWEEN :
K.Suryanarayana ...Petitioner/ Appellant
AND
Billakanti Venkataiah @ Venkatesham ...Respondent / Plaintiff
AND
Maa Sai Datta Estate Ltd, Rep. by M.D.G.Prasad Rao ...Respondent/Defendant

NOTICE

To,
R/D] M/s. MAA SAI DATTA ESTATE LTD., Rep. by its M.D.G.Prasad Rao, S/o. Venkata Subbaiah, R/o. Flat No.101, Haritha Apartments, Madhura Nagar, Hyderabad – 500 038.

Please take notice that the Petitioner/Appellant had filed the above Appeal seeking leave for filing the Appeal against the ex-parte Judgment and Decree dated 20.11.2006 in OS No.19/2006 on the file of the Hon'ble Senior Civil Judge, At : Sangareddy in which, the Petitioner / Appellant was not made as a party. I submit that along with the above Appeal, the Petitioner/Appellant also filed application for condonation of delay caused for filing leave petition for grant of leave to file above Appeal. I submit that the summons were sent to the Respondent / Defendant through this Hon'ble Court but were returned un-served. Hence, this Hon'ble Court was pleased to Order for substitute service for your appearance and posted the matter to 11.04.2025.
Hence, you are requested to appear before the Hon'ble Court at 10:30 a.m. on 11.04.2025 either personally or through your authorized Counsel for submitting your claim or otherwise, the matter will be adjudicated as per law. Hence, this notice.

(BY ORDER OF THE COURT)
AKULA MAHESH KUMAR
Advocate
Flat No.206, 2 nd Floor, Indra Dhanush Apartments, Beside Axis Bank, Road No.2, Banjara Hills, Hyderabad – 034.
Cell : 98489 33536

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE: MEDCHAL - MALKAJGIRI DISTRICT, AT : MALKAJGIRI
O.S.No. 221 OF 2025

BETWEEN
1. **Smt. C.N Prasanna** W/o Late Chikula Rajaiah Naresh Nai
2. **Master Chikula Naresh Vignesh,** S/o Late Chikula Rajaiah Naresh Nai (Represented by her Natural Mother)
3. **Miss C.N. Rishika,** D/o Late Chikula Rajaiah Naresh Nai

All above are residing at H.No: 30-46/1/1, Shiva Nagar, Kanajiguda, VTC: Trimalagiri, District Medchal Malkajgiri, State Telangana- 500015 (Represented by her Natural Mother) ...Petitioners /Plaintiffs
AND
1) **The Tahsildar,** Alwal Mandal, Medchal- Malkajgiri District
2) **All Concerned** ...Respondents/Defendants

To,
1) **All Concerned** ... **Defendant No.2**

Please take notice that the above named Plaintiffs have filed the above suit for Declaration for declaring the plaintiffs as legal heirs of **LATE CHIKULA RAJAIAH NARESH NAI** and the case is posted on **04-04-2025**. If anybody having any objections, they are hereby directed to appear before the above mentioned court on the above said date at 10.30.A.M. either in person or through an Advocate, if failed to appear before the court, the matter will be decided as per law.

// By the Order of the Court //
D.HARSHA VARDHAN, P.MOHAN KRISHNA,
Advocates,
H.No. 8-3-944/1/b/3, Nagarjunanagar, Yellareddyguda, Ameerpet, Hyderabad–500 073.
Cell No.9849734062

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT:YADADRI
O.S.NO. 214 OF 2024

Between:
R.Sridevi ...Plaintiff
and
Anamala Shankaraiah ...Defendant

To
Anamala Shankaraiah S/o Laxmaiah, Aged:74Yrs, Oc: Rtd Govt Employee, R/o.H.No.01-90/12, Blur Archid Hotels, Habsiguda, Hyd. (DEFENDANT)

Please take Notice that my client i.e., the Plaintiff has filed the suit for perpetual injunction in the Yadadri court against you and now his matter is posted to 24-04-2025 for your appearance. Hence, you are informed to appear on **24-04-2025** at 10:30 A.M. before the Hon'ble Junior Civil Judge, YADADRI in person or through Advocate, failing which the matter will be decided in your absence

//By the Order of the Hon'ble Junior Civil Judge, YADADRI//
T.PRAVEEN SAGAR, ADVOCATE,
Flat No.103, Gharunda Apartments, Leelanagar, Ameerpet, Hyderabad-500016.

IN THE COURT OF THE HON'BLE 2nd ADDL. JUNIOR CIVIL JUDGE AT: RAJENDRANAGAR
O.S.NO. 743 OF 2024

Between:
1. Mohd Abdul Rafe S/o. Late Mohd Abdul Razzaq Age: 78 years, Occ: Arabic Teacher R/o. H.No.19-2-419, Fathe Darwaza,Gandhi Statue, Charminar,Hyderabad, T.S.
2. Umme Salma Siddiqua W/o. Syed Khaja Ahmed ,Age: 46 years, Occ: Home MakerR/o. 20-7-652, Inside fatha Darwaza,Hyderabad. T S ,
3. Hajera Iffat Siddiqua , W/o. Mohammed Abdul Hafeez Age; 44 years, Occ: Home Maker ,R/o. 9-4-29/13/A/5, Hakeem pet,Tolichowki, Golconda, Hyderabad. T S .
4. Safia Farheen Siddiqua W/o. Mohammed Abdul Rasheed Age: 43 years , Occ : Home maker R/o. 9-2-80/7/1, Hashmal Pet,Bowenpally, Secunderabad Tirumalagiri, Manovi kasnagar Tirumalagiri,Hyd.T.S.
5. Mohammed Abdul Rehman Siddiqui S/o. Mohd Abdul Rafe Siddiqui Age: 38 years , Occ : Business H.No.19-2-419, Fathe Darwaza, Charminar, Falaknuma, Hyderabad, T.S.
6. Mohammed Abdullah Siddiqui S/o. Mohd Abdul Rafe Age: 38 years , Occ : Business H.No.19-2-419, Fathe Darwaza, Charminar, Falaknuma, Hyderabad, T.S. ..Plaintiffs
AND
1.Tahsildar Shamshabad, R.R Dist.
2. Bommu Anjaiahgoud C/o. Bommu Bal Ram Goud H.NO.22-7/a/a/1, Moguls Garden, Shamshabad, K.V RangaReddy, Telangana. ...Defendants

To,
All concerned
(whom so ever it may concern)

NOTICE

The plaintiffs herein have filed the above suit for declaration to declare them as legal heirs of Late Smt.Tahira Khatoon against all concerned (D3). The Hon'ble Court was pleased to order for substitute service for any objections from anybody and posted the matter to **03-04-2025.** Hence, if any one got any objections are requested to appear before the above said Hon'ble Court at 10:30 a.m. on the said date either personally or through your authorised counsel, for submitting your claim or otherwise the matter will be adjudicated as per law. Hence, this notice.

(BY ORDER OF THE COURT)
M/s. HARSHEET REDDY LAW FIRM
P.DurgaRao,Y.Aravind, A.Mukund Raj Gokul
Advocates
Sri Lakshmi Nilayam Flat No. 202, Boduppal, Medchal Malkajgiri district,
Contact No.8885111125.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM II ADDI CHIEF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
M V .OP. NO. 1896 OF 2023

Between:
G Laxmi Narayana. ...Petitioner
And
Pebbeti Shirisha and Others. ....Respondents

To,
1. Pebbeti Shirish, W/o.P.Laxman, Occ:Owner of Crime Vehicle, R/o. H.No.2-80-3/A, Nanakram Guda,Sherlingam Pally,R.R.Dist. R1
2.Lamaiah,S/o.BalLingam,Occ: Driver Of the Crime Vehicle, R/o. H.No. 3-84/8,Pedduru Telkapally , Nagar kurnool,Telangana. R3

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **10-4-2025** .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.Krishna Kumar, Advocate,
Near Charmas, Malakpet,Hyderabad.

CHANGE OFNAME

I, BOYAPELLY HRITHIKA, D/o. BOYINAPALLI MALLESH Aged about 10 years, R/o. PLOT NO:65, Ramnagar colony, parvathapur(V),medipally(M), Medchal-Malkajgiri(Dist) - 500039, TS. Do Here by Declare that I have change My Daughter Name **Boyapelly Hrithika to Boyinapalli Nithya Sree.**

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICTAT MALKAJGIRI
I.A.NO. 573 OF 2023 IN O.S. NO. 1713 OF 2015

BETWEEN:
C.Ramu Goud and another ...Petitioner/Plaintiffs
AND
P.R.K.Dass & others ...Respondents/Defendants

To
1. A.Narsimha Reddy S/o. Note Known to the Petitioners Aged about: 69 years, Occ: Business R/o. Pocharam Village, Ghatkesar Mandal, Medchal Malkajgiri District.
2. P.Savitri, W/o. P.Ravinder, Aged about: 45 years, Occ: Housewife, R/o. H.No.10-15, Uppal Village & Mandal, Medchal Malkajgiri District. ..Respondent/Defendant No.2

NOTICE

That the Plaintiff has filed the above petition for restoration of the suit i.e. O.S.No.1713 of 2015 filed by the petitioners/plaintiffs and the said matter is posted on 04.04.2025 for appearance of Respondent/ Defendant Nos.2 & 4. Hence, you are hereby directed to appear before this Hon'ble Court on **04.04.2025** at 10.30 a.m. before the Hon'ble court, either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

// BY ORDER OF THE HON'BLE COURT //
Sd/-
V.Sunil Kumar & G.Roopa Reddy Advocates, Hyderabad
9848827695

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT:HYDERABAD
I.A.NO. 230 OF 2024 IN OS NO.492 OF 2020

BETWEEN:
Indian Bank, Srinagar Colony Branch, ...Petitioner/Plaintiff
And
Ragam Computers and others ...Respondents/Defendants

To,
1)M/s Ragam Computers Rep. by it's Partners. 1)R. Chinna Venkateswara Rao
2)Immidi.Prashanth KumarS-1, Plot No.40c,Adagutta, Society, Opp. JNTU,Kukatpally,Hyderabad-72.
2). R. Chinna Venkateswara Rao. S/o Ragam Subba Rao age 40 years Occupation Business R/o H. no. 2-22-203/1/101 Flat No. 101 Adibalaji Residency Jayyanagar Kukatpally, Hyderabad.

NOTICE TO RESPONDENTS/DEFENDANTS NO.1 AND 2

Please take notice that the above named plaintiff had filed the Order 9 Rule 9 Petition in OS No.492 of 2020 to restore the suit in their original number, In the above Petition as you were not taking the notices and avoiding the same, thus the Hon'ble Court was please to order notice through substitute service, by publishing the same in the news paper. Thus, take notice that the above Petition is posted to **03-04-2025** for your appearance. Therefore please take notice and appear in person or through advocate before the Hon'ble X Addl. Junior Civil Judge City Civil Court, Hyderabad District at Hyderabad on **03-04-2025** at: 10:30 AM. Failing which the matter will be adjudicated in your absence.

(By order of the court)
P.Venateshwar Rao
Advocate
#H.NO. 13-23-134, Flat No. 401, Sony Sai Residency, T,Nagar, Kothapet,Hyd -35.
Ph:94900 07306

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM III ADDI CHIEF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP. NO. 882 OF 2019

Between:
Smt.S.Sattavva . ...Petitioner
And
Madhu Nalmas and Others. ....Respondents

To,
1. Madhu Nalmas,S/o.Narayana Nalmas,Occ:Owner of Crime Vehicle ,R/o.H,No.1-2-13-27,Shanti Nagar,Adilabad,Telangana. R1
2. Rishal Ahmed,S/o.Tajub Ali, Occ :Driver of the Crime Vehicle ,R/o.Teliyahi,Bahuchara ,Lalganj,Pratapgarh,Uttarpradesh. R3

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **2-4-2025** .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.Krishna Kumar, Advocate,
Near Charmas, Malakpet,Hyderabad.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూ ర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసంలో నియోజకవర్గ ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలను స్వీకరించి సానుకూ లంగా స్పందించారు. ప్రజా సమ స్యల పట్ల సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టు వెంటనే భర్తీ చేయాలని మంగళ వారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు జేఎన్‌టీయూ హెచ్ విద్యార్థులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువుకుంటు న్న విద్యార్థులు ఫెలోషిప్, స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ త్వరగా విడుదల చేయాలని అన్నారు. యూనివర్సిటీలో నిర్మిస్తున్న ఎస్టీ హాస్టల్ తొందరగా పూర్తి చేయాలి అని, పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి అని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు లకావత్ భాను ప్రకాష్ నాయక్, ఆకాశ్ నాయక్, సన్నీ ఇమ్మాన్యుయల్, సురేష్, సాయి కిరణ్, భాను, ప్రేమ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఎండలు..
నడినెత్తిన భానుడి భగభగలు







● మండుతున్న ఎండలు - ఎండుతున్న గొంతులు
● ఎండల తీవ్రతతో పాటు వడగాలులు
● ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచన
● కొబ్బరి బోండాలకు డిమాండ్

నవతెలంగాణ-బాలానగర్

మార్చి నెలలోనే ఎండలు మండి పోతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటినట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది. అత్యధికంగా 41 డిగ్రీ ల ఉష్ణోగ్రత ఆదిలాబాద్ జిల్లాలో నమోదైనట్టు తెలిపింది. తెలంగాణలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ అలెర్ట్స్ జారీ చేసింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడ గాలులు వీచే అవకాశం ఉందని పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరిగింది. మార్చి 16 నుంచి వచ్చే మూడు రోజుల పాటు ఎండలు మరింత పెరగను న్నాయని తెలిపింది. మార్చి 20 వరకు ఎండల తీవ్రతతో పాటు రాష్ట్రంలో అక్కడకుడ వడగాలులు వీచే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలో ఎఫెక్ట్ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలతో పాటు అక్కడ వడగాలులు వీచే అవకా శం ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మధ్యాహ్నం 11 గంటల నుంచి 3.30 గంటల మధ్య అవసరముంటేనే బయటకు రావాలని తెలిపింది. మార్చిలోనే తెలంగాణాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. 41 డిగ్రీల పైనే గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా అన్ని జిల్లాలో దాదాపు 39 నుంచి 40 డిగ్రీల మధ్యన ఉష్ణోగ్ర తలు నమోదయ్యాయి. మండుతున్న ఎండలతో పాటు వడగా లుల తీవ్రత కూడా పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతు న్నారు. ఈ క్రమంలో రానున్న రెండు రోజుల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చ రికలు జారీ చేస్తున్నారు.

ఆశాలకు వేతనం రూ.18వేలు ఇవ్వాలి



● సీఐటీయూ సీనియర్ నాయకులు బిఎన్ సుదర్శన్
● బాలానగర్ ఎమ్మార్వోకు సీఐటీయూ వినతి

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ సీనియర్ నాయకులు బీఎన్ సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ఆశాల జీతాలు పెంచాలని, ఈ అసెంబ్లీ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరము గడుస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినపటికీ రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ బడ్జెట్‌లోనే రూ.18 వేతనం బడ్జెట్ కేటాయించి, ఆశాలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలిపారు. అదే విధంగా ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడి సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిత, ఆశాలు కవిత, విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎక్కడ పడితే.. అక్కడ వేయకూడదు



● సీఐ బాలానగర్ నరసింహ రాజు

నవతెలంగాణ-బాలానగర్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన పాలిథిన్ కవర్లలో మాత్రమే వేయాలని సీఐ బాలానగర్ నరసింహ రాజు సూచించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్‌లో నూతనంగా ఏర్పడిన మటన్ అండ్ చికెన్ షాప్ యజ మానుల సంఘం మంగళవారం బాలానగర్ సీఐ నర్సింహ రాజును వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్, సీఐ నర్సింహ రాజును శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం, సంఘం అధ్యక్షుడు జహంగీర్ అధ్యక్షతన సీఐ నర్సింహ రాజుతో సంఘం సభ్యులు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లోనూ మజీద్ పరిసర ప్రాంతాల్లో వేయకుండా పరిశుభ్రతను పాటించాలని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా షాపుల ఆవరణలో పరిశుభ్రత పాటించడం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు యొక్క ప్రాముఖ్యత పట్ల ప్రభుత్వం ఆమోదించిన సరైన తూనికలు, కొలత పరికరాలను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎండీ. ఇక్రాముద్దీన్, ఎండీ.నసీర్, ఎండీ. సలీం, ఎండీ.మక్బూల్, ఎండీ.రఫీక్, ఎండీ.అంజాత్, ఎండీ.ఇలియాస్, ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



● షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్
● కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ఉపయోగించుకుని ఎస్సీ వర్గ ప్రజలు సమాజంలో మెరుగైన జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు, ఆర్థిక ప్రయోజనాన్ని పొందే విధంగా అవగాహన కల్పించాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాకు విచ్చేసిన రాంచందర్‌కు జిల్లా కలెక్టర్ గౌతం పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జాతీయ కమిషన్ డైరెక్టర్ జి.సునిల్ కుమార్‌తో కలిసి రాంచందర్ హాజరై మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలకు హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీలు నిరాదరణకు గురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలు, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం కోసం రూపొందించిన చట్టాల అమలు తీరును కమిషన్ సభ్యులు శాఖల వారిగా సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీ లేని రుణాల పథకాలు ఎస్సీ వర్గాలకు అందేలా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ప్రభుత్వం అందించే ఎక్కువ సబ్సిడీ రుణాల గురించి ఎస్సీ మహిళలకు అవగాహన కల్పించి పారదర్శకత పాటిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా స్వయం ఉపాధి కోసం చిన్న కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక యువతను ప్రేరేపించాలని సభ్యులు సూచించారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూచార్ట్ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా..? అని సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సభ్యులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిపుల ద్వారా జిల్లాలో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఎస్సీ అభివద్ధి శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందించే స్కాలర్ షిప్పులు ఆలస్యమైతే విద్యార్థుల అడ్మిషన్‌లలో ఇబ్బంది కలుగకుండా కాలేజీల యాజమాన్యానికి, స్కాలర్‌షిప్ ద్వారా ఫీజు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా లేఖలను అందజేయాలని ఎస్సీ అభివద్ధి శాఖ అధికారికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై ప్రజల్లో అవగాహన లేకుండా పోతుందనీ, ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. క్రమం తప్పకుండా బ్యాంకర్స్ మీటింగ్ నిర్వహించి లబ్దిదారులకు రుణాలు అందించే విధంగా లీడ్ బ్యాంక్ మేనేజరు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కుల ధృవీకరణ సర్టిఫికెట్ లేనందు వల్ల జాప్యం కలుగకుండా సంబంధిత తహశీల్దార్ ధృవీకరణ పత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ బుక్ చేసి బాధితులకు అందించే ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను సూచించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా మద్యం దుకాణాలు ఎస్సీ వర్గాలకు కేటాయించిన వాటిని ఎస్సీలకు మాత్రమే అందించాలనీ, వారు ఇతరులకు అమ్ముకుంటే వారిపై చర్యలు తీసుకోవాలనీ, ఎస్సీలకు కేటాయించిన వాటిని ఎస్సీలకే అందించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారికి సభ్యులు సూచించారు. అంతకు ముందు జిల్లాలో అమలవుతున్న పథకాల్లో ఎస్సీలకు అందించే వివరాల శాతాలను జాబితాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌కు వివరించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి, మేడ్చల్ డీసీపీలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు శ్యాంప్రకాష్, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీలు, పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శిగా శరగడం నర్సింగ రావు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం ప్రాంతానికి చెందిన శరగడం నర్సింగరావు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ కార్మిక విభాగం చైర్మెన్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శరగడం నర్సింగరావు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కార్మిక విభాగంలో క్రియాశీలకంగా పని చేస్తున్నందుకు తన సేవలను గుర్తించి భాద్యతలు అప్పజెప్పారన్నారు. కార్మికులు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించినందు కు ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కార్మిక విభాగం చైర్మెన్ రాంబాగ్ ప్రకాశ్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలవగా తనను శాలువా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

దీన దయాల్ నగర్‌లో అసోసియేషన్ ఎన్నికలు



● పాల్గొన్న కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో దీన దయాల్ నగర్ బస్తీ అసోసియేషన్ ఎన్నికలు మంగళ వారం నిర్వహించారు. ఈ ఎన్నికల నేపథ్యంలో దీనదయాళ్ నగర్ అధ్యక్షుడుగా విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, స్థానిక బస్తీ ప్రజలు అధిక మెజారిటీతో గెలిపించడం పట్ల బస్తీ వాసులకు అభినందనలు తెలి పారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. బస్తీ అధ్యక్ష, కార్యదర్శులుగా గెలుపొందిన విజయభాస్కర్ రెడ్డి, హరిప్రసాద్‌లను బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దీనదయాళ్ నగర్ బస్తీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో చర్చిస్తానని తెలిపారు. దీన్ దయాల్ నగర్ బస్తీని అభివృద్ధి దిశగా తీర్చిదిద్దాలని బస్తీ వారి అందరితో సమైక్యంగా కలిసి ఉండాలని బండి రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య గోవింద్, శివ చౌదరి, రమణ, భరత్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం సోమవారం సాయంత్రం వాడి వేడిగా జరిగింది. బార్ సోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్రరమేష్, ఉపాధ్యక్షులు నటరాజ్, కార్యదర్శి యాదయ్య, కోశాధికారి ఖలీల్ పాషా, మహిళా న్యాయవాద ప్రతినిధి సదాలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి బార్ అసోసియేషన్‌లో సభ్యులైన న్యాయవాదులందరూ వార్షిక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడాదికాలంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను, ఆదాయ వ్యయాలకు సంబంధించి ఆడిటింగ్ రిపోర్ట్‌ను భార్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ కుమార్ కమిటీ సభ్యుల ముందు ఉంచారు. కాగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అర్చనపల్లి ప్రకాష్ రావు, జి. శ్రీనివాస్ రెడ్డి , జాకీర్ హుస్సేన్, అఖిలేష , శేఖర్ బాబు తదితరులు కొత్త కోర్టు కాంప్లెక్స్ ప్రారంభం సందర్భంగా తలెత్తిన ఇబ్బందులు, నిర్మాణ లోపాలపై సభ్యులు ప్రశ్నించారు. లైబ్రరీ, క్యాంటీన్ సదుపాయాల కోసం ఇటీవల కేటాయించిన 500 గజాల స్థలం సరిపోదని దానిని 1000 గజాలు స్థలం పొందేలా మరోసారి హైకోర్టుకు ప్రతిపాదించాలని ప్రస్తుత కమిటీకి సూచించారు. కాగా బార్ అసోసియేషన్ కమిటీలో 33 శాతం మహిళ రిజర్వేషన్ ఉండే విధంగా తీర్మానించాలని పలువురు మహిళా న్యాయవాద సభ్యులు ప్రతిపాదించారు. మాజీ అధ్యక్షులు వారికి మద్దతు పలికారు. దీనితో సమావేశం రసాభాసగా మారడంతో ఎటువంటి తీర్మానం లేకుండానే సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 27న కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కోసం బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో ఒక్కసారిగా కోర్టులో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పలువురు న్యాయవాదులు బార్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఇతర పదవులను దక్కించుకోవడానికి ఆశావాహులు తమ తమ వ్యూహాలకు పదును పెట్టారు. పెద్ద సంఖ్యలో ఆశావాహులు ఆయా పదవులకు పోటీ చేయడానికి ఆసక్తి చూపడంతో ఈసారి జరిగే ఎన్నికలపై విస్తృతమైన చర్చ జరుగుతుంది.

పేదలకు, పేద విద్యార్థులకు అండగా ఉంటా



● సామాజికవేత్త,సంఘసేవకులు ఉదయ్ గంజి ముదిరాజ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిరాధారణకు గురైన పేదలకు, పేద విద్యార్థులకు అండగా ఉంటానని ప్రముఖ సామాజికవేత్త, సంఘ సేవకులు, గిరినగర్ ప్రాంతవాసి ఉదయ్ గంజి ముదిరాజ్ భరోసా ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్, గిరినగర్ ప్రాంతానికి చెందిన బస్తీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి.మల్లేష్ ముదిరాజ్ గత కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఉదయ్ గంజి ముదిరాజ్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి రూ.5,000 నగదును ఆర్థిక సహాయంగా మల్లేష్‌కు అందజేశారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు బొడ్డు జనార్దన్, కొండా శ్రీకాంత్, టి.యశ్వంత్, నరేందర్, క్రాంతి గంజి, శరత్ గంజి, ప్రదీప్ శాగ, తిరుపతి పాల్గొన్నారు.

'ఎస్‌సీఈఆర్‌టీ' డైరెక్టర్ రమేశ్ పర్యటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర 'ఎస్‌సీఈఆర్‌టీ' డైరెక్టర్ రమేష్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్ మండలంలో ప్రాథమిక పాఠశాల కౌకూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి సందర్శించారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ప్రారంభించిన ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఎక్స్ఎల్ కార్యక్రమ నిర్వహణను సూక్ష్మస్థాయిలో పరిశీలించి రివ్యూ చేశారు. కంప్యూటర్ ల్యాబ్, అందులో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన ఇంటర్నెట్ స్పీడ్, హెడ్ ఫోన్స్ విత్ మైక్రోఫోన్ అందుబాటులో ఉండటం, టైం టేబుల్ అటెండెన్స్ రిజిస్టర్, విద్యార్థుల అభ్యసన ప్రక్రియను వివరంగా పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏఎక్స్ఎల్ టూల్‌లో భాషకు సంబంధించిన అభ్యసన గణితం సంబంధించిన అభ్యసన ప్రక్రియను వివరంగా పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లడం కోసం పలు సూచనలను చేశారు. పాఠశాలలో కార్యక్రమ నిర్వహణను పరిశీలించిన తర్వాత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రివ్యూ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, అల్వాల్ మండల విద్యాధికారి మురళీకృష్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

యాలమూరి పెంచల్ రెడ్డి సేవలు అజరామరం



● మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి
● భగత్ సింగ్ నగర్‌లో 28వ వర్ధంతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ వ్యవస్థాపకులు, స్థానిక ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు కీర్తిశేషులు యాలమూరి పెంచల్ రెడ్డి సేవలు అజరామరమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పెంచల్ రెడ్డి 28వ వర్ధంతి సభ భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కుటుంబ సభ్యులు, ఆ ప్రాంత పెద్దలు, పలువురు నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి పెంచల్ రెడ్డి, షాహిద్ భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచల్ రెడ్డి సేవలు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. పలువురు వక్తలు, ఆ ప్రాంత పెద్దలు మాట్లాడుతూ భగత్ సింగ్ నగర్ నిర్మాణం సాహసం త్యాగాలతో కూడుకున్నదని పేర్కొన్నారు. పేద ప్రజల గూడు కల్పించేందుకు కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పెంచల్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు యాలమూరు జనార్దన్ రెడ్డి, సోదరుడు యాలమూరు నరసింహారెడ్డి, దళిత చైతన్య కళామండలి అధ్యక్షులు నిషాని చందర్, బస్తీ ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) నాయకులు బి.సత్యం, నాయకులు జెల్లా వెంకటేష్, దేగల కృష్ణమూర్తి, మజ్జారి శ్రీనివాస్, ఎ.రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి అభినందనల వెల్లువ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్సీగా గెలిచిన అంజిరెడ్డిని శేర్లింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర యువ నాయకులు మారబోయిన రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి, భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజులు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మీ భట్రాజు కులబంధువులు అందరూ నా గెలుపుకు కృషి చేసినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఏ సమస్య ఉన్న తనను కలిస్తే సమస్య పరిష్కరించడంతోపాటు, తనవంతు సహకారాలు తప్పక అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు నియోజకవర్గ సీనియర్ నాయకులు రాంబాబు,రాజు కలసిన వారిలో ఉన్నారు.



శ్రీ రామ నవమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో, శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, శ్రీరామనవమి ఉత్సవాలల్లో భాగంగా.. ఏప్రిల్ 4వ తేదీ ఆదివారం రోజున శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణమహోత్సవం, అన్నదానం ఇతర కార్యక్రమాల ఏర్పాట్లపై క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు, మాజీ చైర్మెన్లు, మాజీ కమిటీ సభ్యులు, అండాళ్ కుంకుమార్చన సంఘం ఇతర భక్త బృందం పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి



మహిళా విజయాల వేడుక

'మహిళలు ఒకరినొకరు ఆదరించుకున్నప్పుడు అద్భుతమైన విషయాలు జరుగుతాయి'. గత ఎనిమిదేండ్లుగా యువర్‌స్టోరీ మహిళల కోసం షీస్పార్క్స్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. వివిధ రంగాలకు చెందిన మహిళా నాయకులను ఓ దగ్గరకు చేర్చుతోంది. అడ్డంకులను ఛేదించి, ఆంక్షలను బద్దలు కొట్టి, సమాజంలో మార్పు తీసుకురావడానికి వారు చేసిన కృషిని ప్రపంచానికి పరిచయం చేస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే మహిళల విజయాల వేడుక ఇది. ఈ ఏడాది కూడా షీస్పార్క్స్ కార్యక్రమానికి మార్చి 21న నిర్వహించ బోతోంది. ఈ సందర్భంగా తాము సాధికారత పొందుతూ మరెంతో మందికి సాధికారత కల్పిస్తున్న కొందరు మహిళా నాయకులను నిశితంగా పరిశీలిద్దాం.

చేతనా గాలా సిన్హా



1997లో చేతనా 'మన్ దేశీ' అనే మహిళా సహకార బ్యాంకును స్థాపించారు. ఇది గ్రామీణ మహిళల కోసం పని చేస్తోంది. అప్పటి నుండి బ్యాంక్ 780 మిలియన్లకు పైగా రుణాలను అందించింది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవాలనుకునే మహిళలకు ఇది చేయూతనిస్తోంది. చేతనా 2006లో గ్రామీణ మహిళల కోసం దేశంలో మొదటి వ్యాపార పాఠశాలను స్థాపించారు. విద్యను కీలకమైన సాధికారత సాధనంగా ఆమె భావించారు. 2013లో ఆమె టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. అలాగే మహిళా వ్యాపారస్తుల కోసం వాణిజ్య ఛాంబర్‌లను కూడా స్థాపించారు. ఆమె మార్గదర్శకత్వంలో మన్ దేశీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ రేడియో స్టేషన్, హెల్త్‌కేర్-ఫర్-ఆల్ ఇనిషియేటివ్, స్పోర్ట్స్ ఫర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, క్లైమేట్-స్మార్ట్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్ వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు మహిళల నేతృత్వంలోని రైతు-ఉత్పత్తి కంపెనీలు, సంస్థలను కూడా ఏర్పాటు చేసింది.

సక్షి జైన్



ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 1.7 మిలియన్ల మంది అనుచరులతో సక్షి జైన్ సోషల్ మీడియా ప్రపంచంలో ఎంతో ఉత్సాహంగా ఉంటారు. ప్రజలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడంలో సహాయపడే ప్రభావశీలిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. సోషల్ మీడియా పట్ల ఆమె విధానం సరళమైనది. రోజువారీ జీవితంలో అవసరమైన చిట్కాలను ఆమె అందిస్తుంది. రోల్ ప్లేలలో కూడా పాల్గొంటుంది. తన కంటెంట్ ద్వారా జైన్ మార్కెట్లో వివిధ రకాల నిధులు, రుణాలు, ఆర్థిక విధానాలు, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ సొంత ఆర్థిక నిర్ణయాలు తీసుకునేలా అనేక కష్టమైన అంశాలను సరళమైన పదాలలో వివరిస్తుంది.

మేఘనా అగర్వాల్



సీరియల్ వ్యవస్థాపకురాలిగా మేఘనా ప్రయాణం 25 ఏండ్ల వయసులో ప్రారంభమైంది. తయారీ, హెచ్ఆర్ కన్సల్టింగ్ నుండి రియల్ ఎస్టేట్ వరకు ఆమె పని విస్తరించి ఉంది. పురుషులు ఎక్కువగా ఆధిపత్యం చెలాయించే రంగంలో ఆమె తన అసమానమైన మార్గాన్ని ఏర్పరచుకుంది. గత తొమ్మిది ఏండ్లుగా తను స్థాపించిన ఇండిక్యూబ్‌ను 13 నగరాల్లో విస్తరింపజేసింది. తన వ్యాపారంతో రూ.867.6 కోట్లను ఆర్జించింది. ఫెమినా యొక్క '100 ఎమర్జింగ్ ఉమెన్ లీడర్స్', ఎంటర్‌ప్రెన్యూర్ మీడియా 'షెప్రెన్యూర్స్ టు వాచ్', ఎకనామిక్ టైమ్స్ 'పవర్ ఐకాన్స్' వంటి ప్లాట్‌ఫారమ్‌లలో ఆమె స్ఫూర్తిదాయక నాయకత్వం గుర్తించబడింది. మేఘన థర్డ్ వేవ్ కాఫీ రోస్టర్స్ వంటి స్టార్టప్‌లలో ఏంజెల్ ఇన్వెస్టర్, YPO (యంగ్ ప్రెసిడెంట్స్ ఆర్గనైజేషన్)లో క్రియాశీల సభ్యురాలు.

డాక్టర్ జాన్హవి నీలేకని



జాన్హవి తల్లుల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పబ్లిక్ పాలసీ ప్రొఫెషనల్. భారతదేశంలో జరిగే ప్రసవాలు ఆమెను నిరాశపరిచాయి. ఆమె అనుభవం దేశంలో ప్రసూతి సంరక్షణ ప్రమాణాలను వెలుగులోకి తెచ్చింది. రావల్సిన మార్పును ప్రేరేపించడానికి జాన్హవిని లోతుగా ప్రేరేపించింది. దీనికోసం 2019లో ఆమె ఆస్త్రికా ఫౌండేషన్‌ను స్థాపించింది. దీనికి నీలేకని ఫిలాంత్రోపీస్ మద్దతు ఇచ్చింది. ఆస్త్రికా ఫౌండేషన్ భారతదేశంలోని మాతృ ఆరోగ్య సంరక్షణ నాణ్యతలో విస్తృత మెరుగుదల కోసం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, వృత్తిపరమైన మిడ్‌వైఫరీ శిక్షణా కార్యక్రమాల ద్వారా కృషి చేస్తుంది. 2021లో బెంగళూరులో ఒక ఇంటర్ డిసిప్లినరీ జనన కేంద్రమైన ఆస్త్రికా మిడ్‌వైఫరీ సెంటర్‌ను స్థాపించారు.

అలిసియా సౌజా



అలిసియా సౌజా ఒక ప్రఖ్యాత చిత్రకారిణి, వ్యవస్థాపకురాలు, రచయిత్రి. బెంగళూరులో స్థిరపడిన ఆమె రోజువారీ జీవితాలు, సంబంధాల చుట్టూ విజయవంతమైన బ్రాండ్‌ను నిర్మించుకుంటున్నారు. స్టేషనరీ, ప్లానర్లు, గృహాలంకరణ, జీవనశైలి ఉత్పత్తులపై ఆమె పని చేస్తున్నారు. సౌజా తన సొంత బ్రాండ్‌ను స్థాపించడానికి ముందు చుంబక్‌ను స్థాపించారు. ఆమె పిల్లల పుస్తకాలను కూడా రచించారు. విభిన్నమైన పద్ధతుల్లో కథలు చెబుతున్నారు. జీవితంలోని ప్రతి చిన్న విషయాన్ని కథగా మలుస్తారు.

చంద్రికా దేబ్



భారతదేశంలో కాన్వా మొదటి ఉద్యోగిగా ఉన్న చంద్రికా ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థను 4వ స్థానంలో నిలబెట్టారు. ఆమె నాయకత్వంలో కాన్వా డిజైనింగ్ రంగంలో ఎన్నో కొత్త ఆవిష్కరణలు చేసింది. భారతదేశంలో దీనికి 100 మిలియన్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు, విద్యార్థులు, సోలోప్రెన్యూర్‌లు ఉన్నారు. కాన్వాలో భారతదేశం & SEA అధిపతిగా, చంద్రికా ఏఐకు కూడా నాయకత్వం వహిస్తున్నారు. కాన్వా హిందీ వెబ్‌సైట్ ఇటీవలె ప్రారంభించారు. సుమారు 12 భారతీయ భాషలలో అది అందుబాటులో ఉంది.

అక్కై పద్మశాలి



కర్ణాటకకు చెందిన అక్కై ట్రాన్స్‌జెండర్ కార్యకర్త, గాయని, మంచి వక్త. అలాగే LGBTQIA+ హక్కుల కోసం పోరాటంలో ముందంజలో ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, గౌరవం కోసం వాదించడంలో, విధానాలు, చట్టపరమైన సంస్కరణలు రూపొందించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. లింగ, లైంగిక, మైనారిటీ హక్కులపై పనిచేసే ఒండేడే అనే సంస్థను కూడా స్థాపించారు. వివక్షను ఎదుర్కోవడం నుండి న్యాయం కోసం శక్తివంతమైన స్వరంగా మారడం వరకు ఆమె ప్రయాణం స్థితిస్థాపకత, ధైర్యానికి నిదర్శనం.

డాక్టర్ గీతా మంజునాథ్



డాక్టర్ గీతా మంజునాథ్ నిరామయ్ హెల్త్ అనాలిటిక్స్ వ్యవస్థాపకురాలు. ఇది రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి కృత్రిమ మేధస్సును ఉపయోగించే హెల్త్‌టెక్ స్టార్టప్. 25 ఏండ్లుగా ఆమె ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్‌లో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం నాన్-ఇన్వాసివ్, రేడియేషన్-రహిత పద్ధతి అయిన థర్మాలి టిక్స్‌ను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. అన్నింటి కంటే ముఖ్యంగా అతి తక్కువ ఖర్చుతో మహిళ లకు ఆరోగ్య సంరక్షణ కల్పించడంలో ఆమె కృషి చేస్తున్నారు.

డాక్టర్ సౌందర్య రాజేష్



డాక్టర్ సౌందర్య రాజేష్ సామాజిక వ్యవస్థాపకురాలు. ప్రముఖ DEI వ్యూహకర్త, భారతదేశంలో సమ్మిళిత కార్యాలయాలను రూపొందించడంలో మార్గదర్శకురాలు. అవతార్ వ్యవస్థాపకురాలిగా ఆమె వైవిధ్యం, సమానత్వం, చేరిక (DEI) ఉద్యమానికి మార్గదర్శకురాలు. వేలాది మంది మహిళలు తిరిగి శ్రామిక శక్తిలోకి ప్రవేశించడానికి అవకాశాలు సృష్టించారు. ఆమె నాయకత్వంలో భారతదేశపు మొట్టమొదటి వైవిధ్య ఉద్యోగ పోర్టల్ అయిన myAvtar.com పేరుతో వెనుకబడిన బాలికల కోసం ఒక కొత్త కెరీర్ అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించింది.


హార్దిక షా



భారతదేశంలో చిన్న వ్యాపార వ్యవస్థాపకులకు ఆర్థిక అవసరాలు తీర్చే కంపెనీ కినారా క్యాపిటల్ వ్యవస్థాపకురాలు హార్దిక షా. 2011లో ప్రారంభమైనప్పటి నుండి కినారా క్యాపిటల్ వేగవంతమైన, సౌకర్యవంతమైన వ్యాపార రుణాలను అందిస్తోంది. రుణ ప్రక్రియను 24 గంటల్లోపు పూర్తి చేస్తోంది. అలాగే లింగ సమానత్వం కోసం పని చేసే బలమైన న్యాయవాది. కినారా క్యాపిట ల్‌ను ఆమె ఎక్కువ శాతం మహిళలతోనే నడిపిస్తున్నారు. ఇలా ఆమె మహిళా వ్యవస్థాపకులకు సాధికారత కల్పిస్తున్నారు.

ఇండస్ట్రియల్ పార్క్

భూసేకరణపై స్టేటస్‌కో



(మొదటిపేజీ తరువాయి)

జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. భూ సేకరణ ప్రక్రియ యథాతథస్థితి (స్టేటస్‌కో) ఉత్తర్వులను కొనసాగించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యాన్ని సత్వరమే విచారణ పూర్తి చేయాలని సింగిల్ జడ్జిని డివిజన్ బెంచ్ ఆదేశించింది. రెండు అప్పీళ్లను తిరిగి సింగిల్ జడ్జి వద్దకు పంపింది. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, తదితర గ్రామాల్లో భూ సేకరణ జరిపి మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో 1177.35 ఎకరాలు సేకరించేలా 2024, నవంబర్ 29న ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించింది. ఇందులో 534 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన 643 ఎకరాలు పట్టా భూమి. లగచర్లలో 110.32 ఎకరాలు, హకీంపేట్‌లో 351.10 ఎకరాలు సేకరిస్తామని ప్రకటించింది. భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హకీంపేట్‌కు చెందిన కె.శివకుమార్ మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పిటిషనర్ల భూ సేకరణపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారించింది. ఏజీ వాదిస్తూ, ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు జరిగిందని, స్టే ఉత్తర్వుల కారణంగా ఆ ప్రక్రియ జాప్యం అవుతోందని చెప్పారు. ఇలాంటి సమయంలో స్టే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు కూడా చేస్తున్నదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్లకు చెందిన సుమారు 8 ఎకరాల భూమిని సేకరణపై యథాతథస్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు కొనసాగించాలంది. స్టే ఉత్తర్వులను రద్దు చేయబోమని తేల్చి చెప్పింది. ఈ వివాదాన్ని సింగిల్ జడ్జి వద్దనే తేల్చుకోవాలని వెల్లడించింది. అప్పీల్‌ను సింగిల్ జడ్జి వద్ద పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ

హమాస్ లక్ష్యాలపై పెద్దఎత్తున వైమానిక దాడులు

బందీలకు మరణశిక్ష వేస్తారా అంటూ హమాస్ ఆగ్రహం

గాజా : ఇజ్రాయిల్ దళాలు గాజాపై విరుచుకుపడుతున్నాయి. జనవరి 19న హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడడం ఇదే మొదటిసారి. సంధి చర్చలు నిలిచిపోవడంతో ఇజ్రాయిల్ సేనలు మంగళవారం ఒక్కసారిగా హమాస్ లక్ష్యాలపై విస్తృత స్థాయిలో వైమానిక దాడులకు దిగాయి. ఈ దాడుల్లో కనీసం 330 మంది ప్రాణాలు కోల్పోయారు. పవిత్ర రంజాన్ నెలలో జరిగిన ఈ దాడుల్లో పలువురు పిల్లలు, మహిళలు, వృద్ధులు చనిపోయారని, 404 మందికి పైగా గాయపడ్డారని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. ఉత్తర గాజా, గాజా నగరంతో పాటు మధ్య, దక్షిణ గాజా స్ట్రిప్‌లోని దెర్ అల్- బలా, ఖాన్ యూనిస్, రఫా ప్రాంతాల్లో పేలుడు శబ్దాలు వినిపించాయి. గాజా నగరంపై జరిగిన దాడిలో హమాస్ పోలీస్, అంతర్గత భద్రతా సర్వీసుల అధినేత మహమూద్ అబూ వత్బా కూడా చనిపోయారని తెలిసింది.

రాజకీయ వ్యూహం మేరకే దాడులు

గాజా స్ట్రిప్‌లో హమాస్ ఉగ్రవాద సంస్థకు చెందిన లక్ష్యాలపై విస్తృతంగా దాడులు చేశామని ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలియజేశాయి. రాజకీయ వ్యూహం మేరకు దాడులు జరిపామని వివరించాయి. గాజా సమీపంలో ఉన్న ప్రాంతాలలోని పాఠశాలలన్నింటినీ మూసివేయాలని కూడా ఇజ్రాయిల్ ఆదేశాలు జారీ చేసింది. దాడుల అనంతరం ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తన వద్ద బందీలుగా ఉన్న వారిని విడుదల చేసేందుకు హమాస్ పదేపదే నిరాకరిస్తున్నందున దాడులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపింది. అదీకాక అమెరికా అధ్యక్షుని ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనలను కూడా హమాస్ తోసిపుచ్చిందని పేర్కొంది. 'యుద్ధ ఆకాంక్షలను నెరవేర్చడానికి గాజా స్ట్రిప్ వ్యాప్తంగా ఉన్న హమాస్ ఉగ్రవాద సంస్థ లక్ష్యా లపై ఐడీఎఫ్ దాడులు చేస్తోంది. సజీవంగా ఉన్న బందీలందరినీ విడిపించాలన్నదే మా రాజకీయ వ్యూహం. అందుకు ఐడీఎఫ్ కృతనిశ్చయంతో ఉంది' అని ప్రధాని కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వివరించింది. ఇనుమడించిన సైనిక శక్తితో హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ చర్యలకు దిగుతుందని స్పష్టం చేసింది.

హమాస్ మండిపాటు

ఇజ్రాయిల్ సైనిక చర్యపై హమాస్ తీవ్రంగా స్పందించింది. యుద్ధాన్ని తిరిగి ప్రారంభించడం ద్వారా బందీలను 'త్యాగం' చేసేందుకు నెతన్యాహూ నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానిం చింది. 'మా వద్ద బందీలుగా ఉన్న వారిని త్యాగం చేసి వారికి మరణశిక్ష విధించడానికే యుద్ధాన్ని పునఃప్రారంభించాలని నెతన్యాహూ నిర్ణయించారు' అని హమాస్ అధికారి ఒకరు తెలిపారు. అంతర్గత సంక్షోభాల నుండి తప్పించుకునేందుకు ఇజ్రాయిల్ నేత యుద్ధాన్ని రాజకీయ రక్షణ కవచంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు నెతన్యాహూయే బాధ్యత వహించాల్సి ఉంటుందని హమాస్ ఒక ప్రకటనలో హెచ్చరించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ద్వారా గాజాలోని ఖైదీల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చారని దుయ్యబట్టింది. కాగా దాడులు జరపడానికి ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇజ్రాయిల్ సంప్రదించిందని శ్వేతసౌధం ప్రతినిధి ఒకరు చెప్పారు.

నిలిచిపోయిన సంధి చర్చలు

ఇజ్రాయిల్, హమాస్ మధ్య ప్రారంభమైన సంధి చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకుండానే నిలిచిపోయాయి. మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందంలో మొదటి దశను పొడిగించాలని ఇజ్రాయిల్ కోరుతుండగా రెండో దశలోనే బందీలను విడుదల చేస్తామని హమాస్ తెగేసి చెప్పింది. వాస్తవానికి ఈ నెల 2న రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఏప్రిల్ మధ్య కాలం వరకూ మొదటి దశను పొడిగించాలని ఇజ్రాయిల్ కోరింది. రెండో దశలోకి వెళ్లాలంటే గాజాను పూర్తిగా నిస్సైనికీకరణ చేయాలని, 2007 నుండి గాజా ప్రాంతాన్ని తన అధీనంలో ఉంచుకున్న హమాస్‌ను సాగనంపాలని పట్టుపట్టింది. రెండో దశ ఒప్పందాన్ని వెంటనే అమలు చేసే విషయంపై చర్చలు ప్రారంభించేందుకు ఇజ్రాయిల్ అంగీకరిస్తే తన వద్ద బందీగా ఉన్న అమెరికన్-ఇజ్రాయిల్ సైనికుడు ఎడన్ అలగ్జాండర్‌ను విడుదల చేస్తానని, నలుగురు బందీల మృతదేహాలను అప్పగిస్తానని హమాస్ తెలిపింది.

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంపై సీపీఐ(ఎం) హర్షం

(మొదటిపేజీ తరువాయి)



బండి సంజయ్ చాలా సార్లు ఇక్కడ మాట్లాడతారని గుర్తు చేశారు. కేంద్రంలో ఆ పార్టీ కులగణనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలోని బీజేపీ నిజంగానే కులగణనకు అనుకూలమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని జాన్‌వెస్లీ తెలిపారు. దళితులంతా సంఘటితంగా, ఐక్యంగా ఉమ్మడి హక్కుల సాధన కోసం, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు కోసం, కేంద్రం నుంచి రావాల్సిన రిజర్వేషన్లలో వాటాలను అమలు చేసుకోవడం కోసం కేంద్రంతో కూడా పోరాడాల్సి ఉందని పేర్కొన్నారు. పెరిగిన జనాభాకనుగుణంగా రిజర్వేషన్లను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ రంగంలో నిధుల కేటాయింపుల్లో అసమానతలున్నాయని వివరించారు. దళితులు, సామాజిక న్యాయం కోరే శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని తెలిపారు. అలాంటి పోరాటాల ద్వారా మరిన్ని హక్కులను సాధించుకోవాలని పేర్కొన్నారు. శ్రామిక వర్గాలు, అణగారిన తరగతులు సంఘటితంగా, ఐక్యంగా ఒక ప్రత్యామ్నాయ శక్తిగా, హక్కులు సాధించేటట్టుగా ఉద్యమాలు ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దద్దరిల్లిన లోక్‌సభ

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయారు. ఈ విపత్తులకు కేంద్ర ప్రభుత్వం, యూపీ ప్రభుత్వ నిర్వహణ లోపమే కారణమని ప్రతిపక్షం ఆరోపించింది. అయితే, కుంభమేళా గొప్ప విజయం గురించి లోక్‌సభలో ప్రకటన చేసిన ప్రధాని, విషాదాలు, మరణాల గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు.

కేరళలో ఆశాలకు అధిక ప్రాధాన్యత

కేరళలో ఆశాలకు అక్కడి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బీహార్‌కు చెందిన ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అన్నారు. రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాలను లేవనెత్తారు. దీనికి అనుబంధంగా సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ మరిన్ని అంశాలను లేవనెత్తారు. కేరళ ఆశా వర్కర్లకు ఎక్కువ గౌరవ వేతనం చెల్లిస్తోందని మనోజ్ కుమార్ ఝా చేసిన ప్రకటన వాస్తవం కాదా? ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాస్తవాలను వక్రీకరించడానికి కాంగ్రెస్, బీజేపీ చేతులు కలపడం వాస్తవం కాదా? "కాంగ్రెస్ ఢిల్లీకి వచ్చి బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలియజేయగలదా?" అనే ప్రశ్నలను జాన్ బ్రిట్టాస్ లేవనెత్తారు.

రూ.15.69 లక్షల కోట్లు రుణం తీసుకోనున్న కేంద్రం

2025-2026 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.15.69 లక్షల కోట్ల రుణం తీసుకుంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 73.6 శాతం మార్కెట్ నుంచి అప్పుగా తీసుకోనుండగా, ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల ద్వారా రుణాలు తీసుకుంటున్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎంపీ వి. శివదాసన్ కు ఇచ్చిన సమాధానంలో తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు వనరులను సేకరించే మార్గాలను అడ్డుకోవడానికి అన్ని రకాల ఉపాయాలను ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రూపాయల అప్పు చేస్తోంది. ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో రాష్ట్రాలు భారీగా పెట్టుబడులు పెట్టకుండా నిరోధించే తన వైఖరిని కేంద్ర ప్రభుత్వం సరిదిద్దుకోవాలని వి. శివదాసన్ డిమాండ్ చేశారు.

పిటిషనర్‌కు కోటి జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు పొందడాన్ని తప్పుపట్టారు. బండ్లగూడ మండలం కందికల్ సర్వే నెంబర్ 310/1, 310/2లలో 9.11 ఎకరాల భూముందనీ, అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంకట్రామిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ బండ్లగూడ తహసీల్దార్ లేఖ రాశారని పిటిషనర్ తరఫున న్యాయవాది కందగట్ల ధీరజ్ వాదించారు. పిటిషనర్ తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ పేర్కొన్న సర్వే నెంబర్లు కందికల్‌లో లేవనీ, 309/5తోనే సర్వేనెంబర్ ముగుస్తుందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. తప్పుడు పత్రాలు సృష్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేసే కుట్రను అడ్డుకోవాలని కోరారు. ఈ భూమిపై గతంలోనే పిటిషనర్ తండ్రి హైకోర్టులో రెండు వేర్వేరు వ్యాజ్యాలను దాఖలు చేశాక వాటిని వాపస్ తీసుకున్నారని చెప్పారు. ఈ పిటిషన్ల గురించి వెంకట్రామిరెడ్డి తన అఫిడవిట్‌లో కనీసం ప్రస్తావన కూడా చేయలేదన్నారు. పాత పిటిషన్ల గురించి చెప్పకుండా వెంకట్రామిరెడ్డి కోర్టును తప్పుదోవ పట్టించారన్నారు. కందికల్‌లోని ప్రభుత్వ భూమి విషయంలో ఇప్పటికే యాజమాన్య హక్కులపై న్యాయవివాదాలు కోర్టుల్లో ఉన్నాయని బెంచ్ దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న తర్వాత పాత కేసులోని పత్రాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా కోర్టును తప్పుదోవ పట్టించడంతో పాటు, విలువైన కోర్టు సమయాన్ని వథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి రూపాయల జరిమానా విధించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

మే 20న సార్వత్రిక సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నామన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను కార్మికు లుగా గుర్తించాలని, వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 200 పని దినాలు ఉండేలా చూసు కోవాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, కనీస పెన్షన్ రూ. 9,000 చెల్లించాలన్నారు.

కాషాయీకరణ లక్ష్యంగా పెట్టుకున్న కొత్త విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, రైతుల డిమాండ్లను పరిష్కారించాలని కోరారు. ఈ సమావేశానికి కె.హేమలత (సీఐటీయూ), ఓఎస్ తోమర్ (ఐఎన్‌టీయూసీ), మోహన్ శర్మ (ఏఐటీయూసీ), జేఆర్ భోంస్లే (హెచ్ఎంఎస్), విజయ్‌పాల్ సింగ్ (ఏఐయూటీయూసీ), జి. శివశంకర్ (టీయూసీసీ), ఆశా బెన్ (ఎస్ఈడబ్ల్యూఏ), సంతోష్ రాయ్ (ఏఐసీసీటీయూ), ఆర్‌కె మౌర్య (ఎల్‌పీఎఫ్), శత్రుజిత్ సింగ్ (యూటీయూసీ) వంటి వారు అధ్యక్షత వహించారు. సీఐటీయూ తెలంగాణ నేతలు పాలడుగు భాస్కర్, భూపాల్, ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి. నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, బీమా, బొగ్గు, ఉక్కు, పోర్టు, డాక్, విద్యుత్, టెలికాం, పోస్టల్, రైల్వే, రక్షణ, రోడ్డు రవాణా, విద్య ఆరోగ్యం, నీరు, పౌర సేవలు మొదలైన ప్రభుత్వ రంగాల సంఘాలు, ప్రయివేట్ రంగాలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందినవారు, పారిశ్రామిక, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, పీస్ రేట్ వర్క్‌లో స్వయం ఉపాధి పొందుతున్నవారు, గృహ కార్మికులు, గిగ్, యాప్ ఆధారిత కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకాలు, బీడీ, నిర్మాణ రంగం మొదలైనవారు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో

ఆంక్షలు ఎత్తేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలను నిషేధిస్తూ వైస్ ఛాన్సలర్ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపారు. "ఉస్మానియా యూనివర్సిటీ దేశంలోనే ప్రతిష్టాత్మకమైందిగా పేరుతెచ్చుకుంది. అనేక ఉద్యమాలకు నిలయంగా ఉంది. తెలంగాణ ఉద్యమం, వామపక్ష పోరాటాలు, విద్యార్థుల సమస్యలపై జరిగిన పోరాటాల పురిటిగడ్డగా వెలుగొందింది. సామాజిక న్యాయం కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక భావాలపై చర్చలు జరుగుతున్న కేంద్రంగా ఉంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల్లో అన్యాయం జరిగిందన్న అంశాలపై నిరసనలు తెలిపి ప్రజలను చైతన్య పరిచిన చరిత్ర కలిగిన యూనివర్సిటీగా ఉంది. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. విద్యార్థుల వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను హరించే విధంగా ఉన్న ఈ అప్రజాస్వామిక సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించాలి. యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించే విధంగా చూడాలి...." అని జాన్ వెస్లీ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

దేవాదుల పూర్తికి కట్టుబడి ఉన్నాం

ఏఐబీపీ నిధుల కోసం ప్రయత్నం

- అర్ధరాత్రయినా ఒక్క మోటర్‌నైనా స్విచ్ ఆన్ చేస్తాం
- పంటలకు నీరందిస్తాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- దేవన్నపేటలో మూడో ప్యాకేజీ పంప్‌హౌస్ సందర్శన



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేవాదుల మూడు దశల్లోని పనులను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో దేవాదుల ప్రాజెక్టు మూడో ప్యాకేజీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. మోటర్‌ను స్విచాన్ చేసి వెళ్లాలని భావించినా, ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు మూడో దశలోని ప్యాకేజీ 3కి సంబంధించి దేవన్నపేట పంప్‌హౌజ్‌లో మూడు మోటర్లను బిగించాల్సి ఉండగా, బుధవారం ఒక్క మోటర్‌నైనా రన్ చేయాలని నిర్ణయించామన్నారు.

బుధవారం కేబినెట్ సమావేశంతోపాటు బడ్జెట్ సమావేశం ఉండటంతో మంగళవారమే ఇక్కడికి రావాల్సి వచ్చిందని తెలిపారు. ఆస్ట్రియా కంపెనీకి చెందిన మోటర్లను ఆ కంపెనీ ఇంజనీర్లు అమర్చుతున్నారని, ఎంత రాత్రయినా ఒక్క మోటర్‌నైనా స్విచ్చాన్ చేసి వెళ్తామని స్పష్టంచేశారు. దీని ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న సుమారు 50-60 వేల ఎకరాల రెండో పంటను కాపాడుకోవడానికి అవకాశముంటుందన్నారు. మోటర్ల స్విచ్చాన్ ప్రక్రియను ఆస్ట్రియా దేశానికి చెందిన 'ఆంద్రిట్జ్' కంపెనీ ఇంజనీర్ల బృందం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఇంజనీర్లు చేస్తున్న పనులను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు ఏఐబీపీ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు తాను కూడా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసినట్టు చెప్పారు. దీనికి సంబంధించి డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేసి కేంద్రానికి సమర్పిస్తామన్నారు.

గత ప్రభుత్వం నిర్వాకం వల్లే సాగు, తాగునీటి ఎద్దడి : మంత్రి పొంగులేటి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్లే రాష్ట్రంలో సాగు, తాగునీటి ఎద్దడి ఏర్పడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టును గతంలో వైఎస్ హయాంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే 'జలయజ్ఞం'లో భాగంగా పనులు ప్రారంభించినట్టు గుర్తుచేశారు. అప్పుడే మొదటి దశ పనులు పూర్తయ్యాయని, కానీ గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం జేబులు నింపుకోవడానికి పనులు చేసిందే తప్పా చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. మళ్లీ అదే పార్టీ నేతలు పంటలు ఎండిపోతున్నాయని గగ్గోలు పెడుతున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో రెండో పంటలు ఎండిపోకుండా కాపాడుకోవడంలో భాగంగా బడ్జెట్ సమావేశాలు, క్యాబినెట్ మీటింగ్ ఉన్నా దేవన్నపేట పంప్‌హౌస్‌లో మోటర్‌ను రన్ చేయడానికి విచ్చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఆయిల్‌ఫెడ్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు నాకు కాదు..రాహుల్‌కి

- బీసీ సంఘాలనేతలతో సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ అభినందనలు నాకు కాదు.. రాహుల్ గాంధీకి అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ సంఘాల నేతలకు సూచించారు. బీసీ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదానికి కృషి చేసినందుకు మంగళవారం అసెంబ్లీలో ఆయా నేతలు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వారితో మాట్లాడుతూ అధికారంలోకొచ్చిన రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులసర్వే నిర్వహించామన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకోవాలంటే ముందుగా జనాభా లెక్క తేలాలని గుర్తు చేశారు. ఆ లెక్కలకు చట్టబద్ధత కల్పించాలనీ,.. అప్పుడే రిజర్వేషన్లు పెంచుకునేందుకు వీలుంటుందన్నారు. అందుకే రాష్ట్రంలో బీసీ కులసర్వే నిర్వహించామని వివరించారు. అసెంబ్లీలో ఫిబ్రవరి నాలుగుకు ప్రత్యేక స్థానముందని చెప్పారు. అందుకే ఆ రోజును ' సోషల్ జస్టిస్ డే'గా ప్రకటించామని చెప్పారు. పక్కా ప్రణాళికతో మంత్రివర్గ ఉపసంఘం, అ తరువాత డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఒక టైం ఫ్రేమ్ లో కులసర్వే పూర్తి చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లెక్కలు తేల్చాలన్నా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలనేదే తమ ఆలోచన అని చెప్పారు. కులసర్వే చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. కేవలం డాక్యుమెంట్ చేసి వదిలేయకుండా బిల్లు చేశామని చెప్పారు. రాజకీయ పరమైన రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల కోసం వేర్వేరుగా రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించామని ఆయన గుర్తు చేశారు.



అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



థాయ్‌లాండ్‌లో ఎఫ్1 రేసు?

ఆ దేశ ప్రధానితో ఎఫ్1 సీఈఓ భేటీ

బ్యాంకాక్ (థాయ్‌లాండ్) : ప్రపంచవ్యాప్తంగా మోటార్‌స్పోర్ట్స్‌కు ప్రేక్షకాదరణ గణనీయంగా పెరుగుతోంది. మౌళిక సదుపాయాల కల్పన, పర్యాటకం సహా వాహన రంగ వాణిజ్యం పుంజుకునేందుకు నేరుగా దోహదం చేస్తున్న ఫార్ములా వన్ రేసును నిర్వహించేందుకు పలు దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎఫ్1 సీజన్ క్యాలెండర్‌లో చోటు కోసం ఫ్రాన్స్, జర్మనీ, టర్కీ పోటీపడుతుంగా.. ఆసియా పసిఫిక్ రీజియన్ నుంచి థాయ్‌లాండ్ రేసులోకి వచ్చింది. ప్రస్తుతం ఆసియా పసిఫిక్ రీజియన్‌లో ఆస్ట్రేలియా, చైనా, జపాన్, సింగపూర్ మాత్రమే ఎఫ్1 రేసులు నిర్వహిస్తున్నాయి. ఎఫ్1 ప్రెసిడెంట్, సీఈవో స్టెఫానో డొమెనికాలి మంగళవారం థాయ్‌లాండ్ ప్రధాని షినవాత్రతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్1 రేసు నిర్వహణకు అవసరమైన సహకారం అందించాలని స్టెఫానోను షినవత్ర కోరినట్టు సమాచారం. ఫార్ములా వన్ స్ట్రీట్ రేసు నిర్వహణకు అవసరమైన అనుకూలతలు, ఆర్థికపరమైన అంశాలు, నిర్వహణ వ్యయం, ఆర్థిక లాభాలపై థాయ్‌లాండ్ ప్రభుత్వం ఓ అధ్యయనం చేయనుంది. బ్యాంకాక్ పర్యాటకంపై ప్రధానంగా ఆధారపడుతోంది. ఎఫ్1 నిర్వహణతో ప్రతి ఏడాది క్రీడా ప్రేమికులు బ్యాంకాక్ పర్యటనకు వస్తారని అంచనా వేస్తున్నారు. థాయ్‌లాండ్ బురియమ్ సర్క్యూట్ ఇప్పటివరకు మోటోజీపీ రేసులకు ఆతిథ్యం ఇచ్చినా.. ఎన్నడూ ఎఫ్1 స్థాయి పోటీలను వేదిక కాలేదు. థాయ్‌లాండ్ రేసర్ అలెక్స్ అల్బన్ విలియమ్స్ తరఫున ప్రస్తుత ఫార్ములా వన్ సీజన్‌లో పోటీపడుతున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీలో అలెక్స్ అల్బన్ ఐదో స్థానంలో నిలిచి పది పాయింట్లు సాధించాడు.

షట్లర్లు మెరిసేనా?

నేటి నుంచి స్విస్ ఓపెన్



బసెల్ (స్విట్జర్లాండ్) : భారత బ్యాడ్మింటన్‌కు కొంతకాలంగా ప్రతికూల ఫలితాలు వస్తున్నాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ టూర్ ఈవెంట్లలో మన షట్లర్లు పతక వేటలో పేలవ ప్రదర్శన కనబరుస్తున్నారు. స్టార్ షట్లర్లు పి.వి సింధు, లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్‌లు అంచనాలను అందుకోవటం లేదు. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో అందరూ చేతులెత్తేయగా.. తాజాగా మన షట్లర్లు స్విస్ ఓపెన్ సవాల్‌కు సిద్ధమయ్యారు. మంగళవారం అర్హత పోటీలు ముగియగా.. నేటి నుంచి ప్రధాన టోర్నమెంట్ ఆరంభం కానుంది. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ పి.వి సింధు తొలి రౌండ్లో డెన్మార్ అమ్మాయి జాకబ్‌సెన్‌తో తలపడనుంది. బర్మింగ్‌హామ్‌లో తొలి రౌండ్లోనే ఓడిన సింధు బసెల్‌లో ఏం చేస్తుందో చూడాలి. మాళవిక బాన్సోద్, ఆకర్షి కశ్యప్, అన్మోల్, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత సైతం బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టైటిల్ రేసులో నిలిచారు.



శ్రీకాంత్ వర్సెస్ ప్రణయ్ :

పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ నేడు తొలి రౌండ్లో సహచర షట్లర్ హెచ్. ఎస్ ప్రణయ్‌తో తలపడనున్నాడు. ఇటీవల వరుసగా చెత్త ప్రదర్శనలతో ర్యాంకింగ్స్‌లో దిగజారిన శ్రీకాంత్ మంచి ఫామ్‌లో ప్రణయ్‌కి పోటీ ఇవ్వటం అనుమానమే. ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్‌లు ఓ బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నారు. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్‌చిరాగ్, చిరాగ్ శెట్టిలు వ్యక్తిగత కారణాలతో టోర్నమెంట్‌కు దూరంగా ఉన్నారు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జంటకు నాల్గో సీడ్ లభించింది. ప్రియ, శృతిలు తొలి రౌండ్లో చైనా షట్లర్లతో పోటీపడనున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆష్మిత్ సూర్య, అమృత.. సతీశ్ కుమార్, ఆద్య జోడీలు అదృష్టం పరీక్షించుకోనున్నారు. అర్హత రౌండ్‌లోనూ భారత నుంచి వర్ధమాన షట్లర్లు బరిలో నిలిచారు. ప్రధాన టోర్నమెంట్‌లో ప్రవేశం కోసం చెమటోడ్చుతున్నారు.

స్పోర్ట్స్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలి

శాట్ చైర్మెన్ శివసేనారెడ్డికి ఎస్‌జాట్ ప్రతినిధుల వినతి

హైదరాబాద్ : క్రీడా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కే. శివసేనా రెడ్డికి స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జేఏటీ) ప్రతినిధులు మంగళవారం ఎల్బీ స్టేడియంలోని కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందించారు. తెలంగాణలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావటం, రాష్ట్ర స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి పాటుపడుతూ, క్రీడాకారులకు ప్రభుత్వానికి వారధిగా పని చేయటంలో స్పోర్ట్స్ జర్నలిస్టులు, ఎస్‌జాట్ విశేష కృషి చేస్తున్నారు. ఏండ్లుగా క్రీడా పాత్రికేయులుగా సేవలందిస్తున్న జర్నలిస్టులను గుర్తించి, ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని శివసేనా రెడ్డిని ఎస్‌జాట్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ క్రీడాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవటంతో పాటు క్రీడా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావటంలో స్పోర్ట్స్ జర్నలిస్టుల పాత్ర విలువైనది. క్రీడా పాత్రికేయుల ఇళ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జాట్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. కష్యారెడ్డి, శ్రీనివాస్ దాస్ మంతటి, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్‌బి సంజయ్, సంయుక్త కార్యదర్శి సిహెచ్. రాజశేఖర్ సహా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సాయికిరణ్ రెడ్డి, సునీల్ గౌడ్, రానా ప్రతాప్, మహేశ్ గౌడ్, అనిల్ యాదవ్, ప్రేమ్ దాస్, పి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.



శాట్ చైర్మెన్ శివసేనా రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌జాట్ ప్రతినిధుల బందం

నవచిత్రం

ఈతరానికీ కనెక్ట్ అయ్యే కథ



నాగ్ అశ్విన్

"'ఎవడే సుబ్రహ్మణ్యం' ఒక లవ్ ఎటాచ్‌మెంట్ ఉన్న అరుదైన సినిమా. పదేళ్లకు ముందు ఎంత రిలవెంట్‌గా ఉండేదో, ఇప్పటికీ సినిమా అంతే రిలవెంట్‌గా ఉంటుందని భావిస్తున్నాను. సినిమాకి ఇప్పుడు ఇంకా ఇంపార్టెన్స్ పెరిగింది. రీరిలీజ్‌లో సినిమాని ఎంతమంది చూస్తారో, అందులో పదిశాంతం ఆడియన్స్ బెటర్‌గా ఫీల్ అయితే, ఒక చిన్న పాజిటివిటీ సినిమా వాళ్లకి ఇస్తే.. థట్స్ గ్రేట్' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. నాని హీరోగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ 'ఎవడే సుబ్రహ్మణ్యం'. విజయ్ దేవరకొండ, మాళవిక నాయర్, రీతు వర్మ కీలక పాత్రల పోషించారు. స్వప్న సినిమా బ్యానర్ పై స్వప్న దత్, ప్రియాంక దత్ నిర్మించిన ఈ సినిమా పదేళ్ళు పూర్తి చేసుకుంది. 10 ఇయర్స్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈనెల 21న సినిమాని గ్రాండ్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ,' పెద్ద సినిమాలు, బ్లాక్‌బస్టర్లు రావచ్చు. కానీ కొన్ని సినిమాలతోనే ఒక లవ్, ఎటాచ్‌మెంట్ ఉంటుంది. ఒక పదేళ్ళ తర్వాత ఈ జనరేషన్ కూడా ఈ సినిమాను చూసి ఎంతో కొంత బెనిఫిట్ పొందుతారనే ఆలోచన ఉండేది. ఎందుకంటే అప్పటికీ ఇప్పటికీ ప్రపంచమే మారలేదు. ఈ తరానికీ కనెక్ట్ అయ్యే కథ' అని అన్నారు. మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు దర్శకుడు నాగ్ అశ్విన్ సమాధానాలు ఇచ్చారు.

'కల్కి2' సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది?

నాగ్ అశ్విన్ : ప్రిపరేషన్ జరుగుతుంది. ఇయర్ ఎండింగ్‌లో ఉండొచ్చు.

'ఎవడే సుబ్రహ్మణ్యం'కి సీక్వెల్ ఉంటుందా?

నాగ్ అశ్విన్ : సీక్వెల్ చేయలేం. కానీ ప్రీక్వెల్ చేయగలం.

వైజయంతి మూవీస్ బ్యానర్ ప్రాజెక్ట్స్‌ని హ్యాండిల్ చేయడం ఎలా అనిపిస్తుంది?

నాగ్ అశ్విన్ : 'కల్కి' రిలీజ్ అయ్యే ముందు ఒక ఒత్తిడి ఉండేది. చాలా భారీ పిక్చర్. చాలా బాధ్యత ఉంది. రిలీజ్ అయిన తర్వాత చాలా హ్యాపీగా అనిపించింది. మేము ఒక ల్యాండ్ మార్క్‌ని క్రియేట్ చేయగలిగాం. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైనటువంటి ప్రాజెక్ట్ చేయగలమని నమ్మకం వచ్చింది.

'కోర్టు' విజయం మాకు ప్లస్ అవుతుంది



ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందిన ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు.

చిత్రవాహిని, ఆర్‌వైజి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈనెల 21న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను మేకర్స్ వైభవంగా నిర్వహించారు.

దర్శకుడు సుప్రీత్ సి. కృష్ణ మాట్లాడుతూ, 'టీజర్‌కు, ట్రైలర్‌కు, ఏఐ పాటకు వస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈనెల 21న అందరూ ఓ కొత్త తెలుగు సినిమా చూడబోతున్నారు. ఓ కమర్షియల్ ప్యాకేజీలో ఇలాంటి సినిమా చేయడం గొప్పగా అనిపించింది. తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను. రోషన్ నటించిన 'కోర్టు' మంచి విజయం సాధించింది. ఈ సినిమాలో కూడా రోషన్ ఓ మంచి పాత్రను చేశాడు. తప్పకుండా కోర్టు సక్సెస్ మా సినిమాపై కూడా రిఫ్లెక్ట్ అవుతుంది' అని అన్నారు.

'ఫాంటసీ థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఈనెల 21న చిత్రాన్ని అందరూ థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాం' అని నిర్మాతల్లో ఒకరైన రాహుల్ రెడ్డి చెప్పారు.



ఇది మ్యాడ్ కాదు.. మ్యాడ్ మ్యాక్స్

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. ఈ చిత్రం నుంచి విడుదలైన 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటలు మారుమోగిపోతున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో గీతం 'వచ్చారోయ్' విడుదలైంది.

మ్యాడ్ గ్యాంగ్‌కి తిరిగి స్వాగతం పలకడానికి సరైన గీతం అన్నట్టుగా 'వచ్చారోయ్' ఎంతో ఉత్సాహభరితంగా ఉంది. 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటల బాటలోనే.. 'వచ్చారోయ్' కూడా విడుదలైన నిమిషాల్లోనే శ్రోతల అభిమాన గీతంగా మారిపోయింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ఈ పాటను స్వయంగా ఆలపించగా.. దర్శకుడు కె.వి.అనుదీప్ సాహిత్యం అందించడం విశేషం.

భీమ్స్ తనదైన ప్రత్యేక శైలి సంగీతంతో మరోసారి కట్టిపడేశారు. భీమ్స్ సంగీతం, గాత్రం ఈ పాటను చార్ట్ బస్టర్‌గా మలిచాయి. ఇక కె.వి. అనుదీప్ సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'ఏసుకోంద్రా మీమ్స్, చేసుకోంద్రా రీల్స్, రాసుకోంద్రా హెడ్ లైన్స్.. ఇది మ్యాడ్ కాదు మ్యాడ్ మ్యాక్స్' వంటి పంక్తులతో అందరూ పాడుకునేలా గీతాన్ని రాశారు. యువత కాలు కదిపేలా ఉన్న ఈ గీతం, విడుదలైన కొద్దిసేపటిలోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ త్రయం.. 'మ్యాడ్ స్క్వేర్'లో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. 'మ్యాడ్'లో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్, కె.వి.అనుదీప్ కీలక పాత్రలలో అలరించనున్నారు. అలాగే రెబా మోనికా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. భారీ అంచనాల నడుమ ఈనెల 28న ఈ చిత్రం థియేటర్లలో అడుగు పెట్టనుంది.

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: కళ్యాణ్ శంకర్, సమర్పణ: సూర్యదేవర నాగ వంశీ, నిర్మాతలు: హారిక సూర్యదేవర, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: శామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి.

అదే ఈ బర్త్‌డే ప్రత్యేకత..



మోహన్‌బాబు

విలక్షణ నటుడిగా, నిర్మాతగా అటు సినిమా రంగంలో, విద్యావేత్తగా ఇటు విద్యారంగంలో డాక్టర్ మంచు మోహన్ బాబు తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. ఇక ప్రజా నాయకుడిగా తనదైన మార్క్‌తో చెరగని ముద్ర వేశారు. నేడు (బుధవారం) ఆయన పుట్టినరోజు. ఈ పుట్టిన రోజుతో ఆయన 73వ వసంతంలోకి అడుగు పెడుతున్నారు.

ఆయన పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప' నుంచి ఓ బిగ్ అప్డేట్ రాబోతోంది. ఈ చిత్రంలో మోహన్ బాబు మహాదేవశాస్త్రి పాత్రలో కనిపించబోతున్న సంగతి తెలిసిందే. ఆయన బర్త్‌డే సందర్భంగా మహా దేవ శాస్త్రి పరిచయ గీతాన్ని విడుదల చేయనున్నారు.

ఆయన బర్త్‌డే నేపథ్యాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ఆయన గురించి పలు ఆసక్తికర విశేషాలను మీడియాతో షేర్ చేసుకుంది. 1975 నుంచి 1990 వరకు భారతీయ సినిమాల్లో విలన్ పాత్రకు మోహన్ బాబు కొత్త నిర్వచనాన్ని తీసుకువచ్చారు. 1990వ దశాబ్దంలో ఆయన హీరోగా మారి ప్రేక్షకులను తనదైన శైలితో అలరించారు.

'అల్లుడు గారు, అసెంబ్లీ రౌడీ, పెదరాయుడు' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు ఆయన స్థాయిని పెంచాయి. ఆయన నటించిన అనేక చిత్రాలు హిందీ, తమిళ భాషల్లో రీమేకై, అక్కడ కూడా భారీ విజయాలు సాధించాయి.

నటుడిగానే కాకుండా నిర్మాతగానూ 75 చిత్రాలను నిర్మించారు. ఎక్కువ చిత్రాలు నిర్మించిన ఏకైక నటుడిగా ఆయన రికార్డులు నెలకొల్పారు. సినిమా రంగంలో విశేష విజయాలను సాధించిన ఆయన శ్రీ విద్యానికేతన్ విద్యా ట్రస్ట్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విశేష సేవలను అందిస్తున్నారు.

సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్



సుశాంత్ అనుమోలు

సుశాంత్ అనుమోలు తన ప్రాజెక్టుల విషయంలో చాలా సెలెక్టీవ్‌గా ఉన్నారు. తన మైల్ స్టోన్ 10వ మూవీని సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా అఫీషియల్‌గా మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి పృథ్వీరాజ్ చిట్టేటి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సంజీవని క్రియేషన్స్ బ్యానర్‌పై వరుణ్ కుమార్, రాజ్ కుమార్ నిర్మిస్తున్నారు.

ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌ని స్ట్రైకింగ్ పోస్టర్ ద్వారా చేశారు. పోస్టర్‌లో సుశాంత్ రెండు డిఫరెంట్ లుక్‌లలో ఆసక్తిని పెంచారు. పోస్టర్ పై భాగంలో అతను స్టైలిష్, ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు.

నేలపై పుర్రెలతో చుట్టుముట్టబడి, పిల్లి అతనిని చూడటం టెర్రిఫిక్‌గా ఉంది. అలాగే దీనికి డిఫరెంట్‌గా పోస్టర్ దిగువ భాగం ఉంది.ఇది హీరో క్యారెక్టర్‌లోని మరో కోణాన్ని ప్రజెంట్ చేస్తోంది. ఇక్కడ సుశాంత్ ఎమోషనల్‌గా గర్జిస్తున్నట్లు కనిపిస్తుంది. ఇది అతను పోషించే పాత్ర వెర్సటైల్ నేచర్‌ని సూచిస్తుంది.

ఇది సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ అని పోస్టర్ చెప్పకనే చెప్పింది. ఈ పాత్ర కోసం సుశాంత్ మేకోవర్ పోస్టర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్రానికి అనిరుధ్ కృష్ణమూర్తి స్క్రీన్‌ప్లే రాయడంతో పాటు, దర్శకుడు పృథ్వీరాజ్ చిట్టేటితో కలిసి డైలాగ్స్ అందించారు. ఈ చిత్రానికి నిర్మాతలు: వరుణ్ కుమార్ - రాజ్ కుమార్, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం: పృథ్వీరాజ్ చిట్టేటి, స్క్రీన్ ప్లే - డైలాగ్స్: అనిరుధ్ కృష్ణమూర్తి, డీవోపీ: వైవిబి. శివ సాగర్, ఆర్ట్ డైరెక్టర్: ఆశిష్ తేజ పులాల, కాస్ట్యూమ్ డిజైనర్: సుమయ్య తబస్సుమ్.

థ్రిల్ చేసే 'కిల్లర్ ఆర్టిస్ట్'



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటించిన సినిమా 'కిల్లర్ ఆర్టిస్ట్'. ఎస్ జేకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించారు. రతన్ రిషి దర్శకుడు.

ఈ మూవీ ఈ నెల 21న రిలీజ్‌కు రెడీ అవుతోంది. నైజాం ఏరియాలో ఈ సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తుండటం విశేషం. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ప్రొడ్యూసర్ జేమ్స్ వాట్ కొమ్ము మాట్లాడుతూ, 'హీరో సంతోష్, హీరోయిన్ క్రిషేక, సోనియా. .వీళ్లందరికీ మంచి పేరొస్తుంది. డైరెక్టర్ రతన్ రిషి కూడా వరుసగా సినిమాలు దక్కించుకుంటాడని నమ్ముతున్నా. ఈ చిత్రంతో సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ చూస్తారు. ట్రైలర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ ఇచ్చారు. సినిమాని కూడా సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు.

'సెన్సార్ వారి సూచన మేరకు 'కిల్లర్ ఆర్టిస్ట్' అని పెట్టుకున్నాం. హత్య చేయడాన్ని కళగా భావించే ఓ వ్యక్తి కథ ఇది. మన సొసైటీలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నాను. ఈ మర్డర్స్ ఒకరు చేస్తున్నారా ఇద్దరా అనేది ట్రైలర్‌లో సస్పెన్స్ క్రియేట్ చేశాం. సినిమాలోనూ అదే క్యూరియాసిటీ క్రియేట్ అవుతుంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ నుంచి ఈ కథ మొదలై, రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా టర్న్ తీసుకుంటుంది. బాహుబలి ప్రభాకర్, ఛత్రపతి శేఖర్..ఇలాంటి ఆర్టిస్టులంతా కొత్తగా మీకు కనిపిస్తారు. ఈ సినిమా మీకు కొత్త సినిమాటిక్ ఫీల్ కలిగిస్తుంది' అని డైరెక్టర్ రతన్ రిషి చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



ఎట్టకేలకు మురిసిన దలాల్ స్ట్రీట్

సెన్సెక్స్ 1131 పాయింట్ల పెరుగుదల

ముంబయి : చాలా రోజులుగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న దలాల్ స్ట్రీట్ ఎట్టకేలకు మురిపించింది. పలు సానుకూల సంకేతాలతో మంగళవారం భారత మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1131 పాయింట్లు లేదా 1.53 శాతం పెరిగి 75,301కి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 326 పాయింట్లు లేదా 1.45 శాతం లాభపడి 22,834 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర ర్యాలీ చేసి 75,385 గరిష్టాన్ని తాకింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల విలువ రూ.6.85 లక్షల కోట్లు పెరిగి రూ.400.03 లక్షల కోట్లకు చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి 86.54గా నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిక నష్టాలు చవి చూశాయి. అమెరికా, ఆసియా మార్కెట్లలో లాభాలు చోటు చేసుకోవడం భారత మార్కెట్లలోనూ విశ్వాసాన్ని నింపాయి. చైనా ఆర్థికాభివృద్ధి చర్యల కారణంగా హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఏకంగా 2 శాతం మేర పెరిగి మూడేండ్ల గరిష్టానికి ఎగిసింది. అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో చైనా దేశీయంగా వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ఆ దేశ మార్కెట్లు పరుగులు పెట్టాయి. వాణిజ్య యుద్ధ భయాలతో ఇటీవల భారీగా పడిపోయిన షేర్ల విలువలు కొనుగోళ్లకు ఆకర్షణీయంగా ఉండటంతో మార్కెట్లకు మద్దతు లభించిందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్ఈలో అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. రియాల్టీ, మీడియా రంగాలు 3 శాతం చొప్పున పెరిగాయి. ఆటో, పీఎస్‌యూ బ్యాంక్, లోహ, కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రంగాలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి.

వైద్య బీమాలోకి ఎల్ఐసీ

ఈ నెలలోనే ఓ సంస్థలో వాటా కొనుగోలు

ఎల్ఐసి ఛైర్మన్ సిద్ధార్థ మోహంతి వెల్లడి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) అతి త్వరలోనే వైద్య బీమా రంగంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతోంది. ఇదే విషయాన్ని ఎల్ఐసీ ఛైర్మెన్ సిద్దార్థ మోహంతి మంగళవారం వెల్లడించారు. వైద్య బీమా కంపెనీలో వాటాల కొనుగోలు అంశంపై మార్చి 31 కల్లా పూర్తి స్పష్టతను ఇవ్వనున్నామని చెప్పారు. అయితే ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేసే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. కాగా.. మెజారిటీ వాటా 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటాను మాత్రం కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో మైనార్టీ వాటాను కొనుగోలు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఎల్ఐసీ విలువ, బోర్డు నిర్ణయాలు ఇతరత్రా అవకాశాల్ని పరిగణనలోకి తీసుకొని వైద్య బీమా సంస్థలో వాటా కొనుగోలు ఉంటుందన్నారు.

ప్రస్తుతం జీవిత బీమా సంస్థలు పాలసీ తీసుకున్న వ్యక్తులు ఏదైనా కారణంతో ఆస్పత్రిలో చేరితే ఎటువంటి ఆరోగ్య బీమా కవరేజ్‌లను అందించడం లేదు. ఇటీవల మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎల్ఐసీ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు రిపోర్టులు వచ్చాయి. బీమా రంగంలోకి ప్రవేశించడం ద్వారా తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని ఎల్ఐసీ లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి స్పష్టత కోసం రెండు వారాలు ఆగాలి. మోహంతి ప్రకటనతో మంగళవారం బీఎస్ఈలో ఎల్ఐసీ షేర్ విలువ 1.70 శాతం పెరిగి రూ.757.65 వద్ద ముగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసీ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

టఫే వైస్ చైర్మెన్‌గా లక్ష్మీ వేణు నియామకం



హైదరాబాద్ : ప్రముఖ ట్రాక్టర్ల తయారీదారు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) వైస్ చైర్మెన్‌గా డాక్టర్ లక్ష్మీ వేణు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ ఆటోమోటివ్ విడిభాగాల తయారీ సంస్థ సుందరం క్లేటన్ లిమిటెడ్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. టఫే డైరెక్టర్‌గా లక్ష్మీ వ్యవసాయ యాంత్రీకరణ, ఆటోమొబైల్ భాగాల వ్యాపారంలో ఆమె సాధించిన విజయాలు గొప్పవని టఫే సీఎండీ మల్లికా శ్రీనివాసన్ పేర్కొన్నారు. తన విశేష సహకారాన్ని గుర్తించి బోర్డు ఆమెను వైస్ చైర్మెన్‌గా ఎంపిక చేసిందన్నారు.

టాటా మోటార్స్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు ఉంటుందని ఆ కంపెనీ వెల్లడించింది. వచ్చే ఏప్రిల్ నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. పెరుగుతున్న వ్యయాలను పాక్షికంగా భర్తీ చేసుకోవడానికి ధరలను పెంచాల్సి వస్తోందని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలోనూ వాహన ధరలను 3 శాతం వరకు పెంచింది. ఇటీవల మారుతి సుజుకి ధరలు పెంచిన విషయం తెలిసిందే. మిగితా ఆటోమొబైల్ కంపెనీలు కూడా ఇదే బాటలో ధరలను పెంచనున్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

అమెజాన్‌లో 14,000 ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : అమెరికాకు చెందిన దిగ్గజ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఏకంగా 14,000 మంది ఉద్యోగులపై వేటు వేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. పొదుపు చర్యల్లో భాగంగా వేలాది సిబ్బందిని ఇంటికి పంపించాలని నిర్ణయించింది. ఖర్చులను తగ్గించుకోవడానికి, లాభాలను పెంచుకోవడానికి 13 శాతం ఉద్యోగులను తీసివేయనుంది. దీని ద్వారా సంస్థ 2.1 బిలియన్ డాలర్ల నుంచి 3.6 బిలియన్ డాలర్ల వరకు ఆదా చేయనున్నట్టు తెలుస్తోంది. ఉద్యోగాల కోత పూర్తయితే సంస్థలో పనిచేస్తున్న వారి సంఖ్య 1,05,770 నుంచి 91,936కు తగ్గనుంది. కంపెనీలో ఉద్వాసనలు అనేవి సంస్థ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతాయని అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లోనూ 18 వేల మందిని తొలగించింది. ఎఐ కారణంగా ఉద్యోగుల తొలగింపు జరుగుతోందని విమర్శలు వస్తోన్నాయి. మరోవైపు భారత్‌లో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కోసం అమెజాన్ ఇండియా కసరత్తును ప్రారంభించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించినట్టు రిపోర్టులు వస్తోన్నాయి. ఇందుకోసం జెపి మోర్గాన్ సహా ఇండియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులతో కూడా అమెజాన్ చర్చలు ప్రారంభించిందని సమాచారం.

ఫిబ్రవరిలో పదిశాతం తగ్గిన భారత్ ఎగుమతులు



న్యూఢిల్లీ : గత నెల ఫిబ్రవరిలో భారతదేశ వాణిజ్యలోటు మూడున్నర సంవత్సరాల కనిష్టస్థాయి 14.05 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ప్రపంచ పెట్రోలియం ధరలు తగ్గడం, అమెరికా వాణిజ్య ఆంక్షల వల్ల పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి మధ్య భారతదేశ ఎగుమతులు, దిగుమతులు బాగా తగ్గాయని భారత వాణిజ్యశాఖ తెలిపింది. ఫిబ్రవరి 2024 వాణిజ్యలోటు, ఎగుమతులు - దిగుమతుల మధ్య అంతరం 19.54 బిలియన్లుగా ఉంది. ఎగుమతుల విషయానికొస్తే.. 20 నెలల కనిష్టస్థాయికి చేరాయని, ఇది సంవత్సరానికి 10.9 శాతం తగ్గి 36.91 బిలియన్ డాలర్లకు చేరుకుందని భారత వాణిజ్యశాఖ సోమవారం విడుదల చేసిన సమాచారం పేర్కొంది. అయితే ఎగుమతుల క్షీణతకు గతేడాది ఇదే కాలంలో 41.4 బిలియన్ డాలర్ల హైబేస్ కారణమని అధికారులు తెలిపారు. దిగుమతులు 16.3 శాతం తగ్గి 50.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది 20 నెలల్లో అత్యంత గణనీయమైన తగ్గుదల. చమురు దిగుమతులు 29.6 శాతం తగ్గి.. 11.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇక బంగారం దిగుమతులు 62 శాతం మేర తగ్గి 2.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అమెరికా ఏప్రిల్ నుండి భారత్‌పై భారీగా సుంకాల్ని విధించనుంది. ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతుల అంచనా అనిశ్చితిగానే ఉంది.

అమెరికా ఇప్పటికే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకాన్ని విధించింది. భవిష్యత్తులో మరిన్ని సుంకాల్ని విధించే అవకాశముందని ఊహించి అమెరికన్ దిగుమతిదారులు ఆర్డర్‌లను వెనక్కి తీసుకుంటున్న ఆందోళనకరమైన ధోరణి నెలకొందని ఎగుమతిదారులు నివేదించారు.

వివిధ దేశాల ఎగుమతుల్ని పరిశీలిస్తే..

ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య దేశమైన చైనా ఈ ఏడాది జనవరి- ఫిబ్రవరిలో 7.1 శాతం ఎగుమతులు పెరిగాయి. ఇదే కాలంలో వియత్నాం ఎగుమతులు 8.4 శాతం పెరిగాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ వస్తువులు, సేవల ఎగుమతుల్లో 800 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని వాణిజ్య కార్యదర్శి సునీల్ బార్త్వాల్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం 778 బిలియన్ల విలువైన వస్తువులు, సేవలను ఎగుమతి, దిగుమతి చేసుకుందని వాణిజ్య కార్యదర్శి తెలిపారు. భారత్ నుంచి పెట్రోలియం, రత్నాలు, బంగారు ఆభరణాల ఎగుమతులు ఫిబ్రవరి నెలలో 5 శాతం తగ్గి.. 28.57 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కీలకమైన రత్నాలు, ఆభరణాలు (-20.7 శాతం), ఔషధ ఉత్పత్తులు (-1.5 శాతం), సేంద్రీయ రసాయనాలు (-24.5 శాతం), పెట్రోలియం ఉత్పత్తులు (-29.2శాతం), ఇంజనీరింగ్ వస్తువులు (-8.6 శాతం)మేర తగ్గాయి. ఇదిలా ఉండగా.. బియ్యం ఎగుమతులు (13.2 శాతం), ఎలక్ట్రానిక్ వస్తువులు (26 శాతం), రెడీమెడ్ దుస్తులు (4 శాతం) పెరిగాయి. ఫిబ్రవరిలో సేవల ఎగుమతులు 23.6 శాతం పెరిగి 53.03 బిలియన్లకు చేరుకోగా.. సేవల దిగుమతులు 8.6 శాతం పెరిగి 16.55 బిలియన్లకు చేరుకున్నాయి. మొత్తంగా సేవల ఎగుమతులు దిగుమతులు 18.5 బిలియన్ డాలర్ల మిగులు ఏర్పడిందని రిజర్వ్‌బ్యాంకు అంచనా వేసింది.

భారత వాణిజ్యలోటు 42 నెలల కనిష్టస్థాయికి తగ్గడానికి ముడి చమురు, బంగారం, వెండి దిగుమతులు గణనీయంగా తగ్గడమే కారణమని రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్‌పై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో (ఐసిఆర్ఎ) చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు. 'భారత్ వాణిజ్య లోటు ఈ ఏడాది మొదటి పది నెలల్లో సగటున 23 బిలియన్ డాలర్లకంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. బహుశా ఇదే ధోరణి కొనసాగితే.. ఈ ఏడాదిలో 5 బిలియన్ల డాలర్ల మిగులు (ఇది జిడిపిలో దాదాపు 0.5 శాతానికి సమానం)ను నమోదు చేసే అవకాశం ఉందని మేము ఆశిస్తున్నాము' అని అదితి అన్నారు. భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఇఓ) అధ్యక్షుడు అశ్వని కుమార్ మాట్లాడుతూ.. ఎగుమతులు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రత్యేకంగా గ్లోబల్ టారిఫ్ వార్ జరుగుతున్న ఈ సమయంలో.. విదేశీ దిగుమతులపై ప్రభావం పడుతుంది. దీంతో విదేశీ వస్తువుల డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. దీంతో దేశీయ పరిశ్రమలకు, ఉత్పత్తులకు అవకాశాలు సృష్టించే అవకాశం ఉంటుంది. ఈ పరిణామంతో దేశీయ పరిశ్రమలు బలం పుంజుకునే అవకాశం ఉంది' అని ఆయన అన్నారు. అలాగే భారత్ ఎగుమతులను వైవిధ్యపరచడానికి, కొత్త మార్కెట్లు, ఉత్పత్తులను అన్వేషించడానికి వాణిజ్య సులభతర చర్యలను నిర్వహించడానికి కేంద్రీకృత విధానం అవసరం. ప్రపంచ పోటీతత్వానికనుగుణంగా.. ఎగుమతుల్ని పెంచేవిధంగా చర్యలు తీసుకోవడం అవసరం అని ఆయన అన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కోటా

కర్నాటక అసెంబ్లీలో బిల్లు



బెంగుళూరు : ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కర్నాటక అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టారు. ది కర్నాటక ట్రాన్స్‌పరెన్సీ ఇన్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ (కేటీపీపీ) (అమెండ్మెంట్) బిల్ 2025ను రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ ఎఫైర్స్ శాఖ మంత్రి హెచ్ కె పాటిల్ ప్రవేశపెట్టారు. కేటీపీపీ యాక్ట్ 1999కు సవరణలతో ప్రతిపాదించిన ఈ బిల్లుపై బుధవారం చర్చ జరగనుంది. ఈ నెల 7న 2025-26 రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన సందర్భంలో ఈ బిల్లు ప్రతిపాదన గురించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొదటిసారిగా వెల్లడించారు. ఈ నెల 14న జరిగిన రాష్ట్ర క్యేబినేట్ సమావేశంలో కెటిపిపి బిల్లుకు సవరణలు ఆమోదించారు. దీని ప్రకారం రూ. 2 కోట్ల వరకూ విలువైన ప్రజా పనులు, రూ. 1 కోటి వరకూ విలువైన వస్తు, సేవల కాంట్రాక్టుల్లో 4 శాతం ముస్లింలకు కేటాయిస్తారు. ప్రస్తుతం కర్నాటకలో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్‌సీ, ఎస్‌టీలకు 24 శాతం, ఓబీసీ కేటగిరి 1కు 4 శాతం, ఓబీసీ కేటగిరి 2ఎకు 15 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

కాగా, ప్రభుత్వ కాంట్రాక్టులలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రభుత్వ చర్యను 'రాజ్యాంగ విరుద్ధమైన దుస్సాహసం', 'బుజ్జగింపు రాజకీయాలు'గా ప్రధాన ప్రతిపక్షం బీజేపీ ఆరోపించింది. దీన్ని కోర్టులో సవాలు చేస్తామని కూడా ప్రకటించింది.

ఓబీసీల గుర్తింపునకు కసరత్తు

సుప్రీంకోర్టుకు తెలిపిన పశ్చిమ బెంగాల్



న్యూఢిల్లీ : రాష్ట్రంలోని ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జాబితాలో చేర్చడానికి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు (ఎస్ఈబీసీ) గుర్తింపునకు కసరత్తు ప్రారంభించినట్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. వివిధ కులాలను ముఖ్యంగా ముస్లిం కులాలను ఒబిసి జాబితాలో చేర్చడాన్ని కొట్టివేస్తూ కొల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత విచారణలో సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని గుర్తించడానికి చేపట్టిన సర్వే వివరాలు, అలాగే ఓబీసీ జాబితాలో చేర్చడానికి అవసరమైన అర్హతలను స్పష్టం చేయాలని సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్‌ను కోరింది. అదేవిధంగా ఓబీసీ ల గుర్తింపునకు ముందు పశ్చిమ బెంగాల్ వెనుకబడిన తరగతుల కమిషన్‌తో ప్రభుత్వం ఎటువంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదనే ఆరోపణలపై స్పందించాలని కూడా ఆదేశించింది.

ముఖ్యంగా రిజర్వేషన్ల కోసం ఈ కులాలను ఉప-వర్గీకరణ చేసేటప్పుడు సంప్రదింపులు జరిగాయా లేదా అనేది స్పష్టం చేయాలని సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్‌ను కోరింది. దీనికి స్పందిస్తూ మంగళవారం విచారణలో బెంగాల్ ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. 'రిజర్వేషన్లు అవసరమయ్యే తరగతులను గుర్తించడానికి పశ్చిమ బెంగాల్ వెనుకబడిన తరగతుల కమిషన్ కసరత్తు చేపడుతోంది' అని తెలిపారు. దీంతో ఈ పిటిషన్ తదుపరి విచారణను జులైకు జస్టిస్ బిఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం వాయిదా వేసింది.

బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం అప్‌లోడ్

పిటిషనర్లతో భేటీకి ఈసీ అంగీకారం

న్యూఢిల్లీ : ప్రతి దశ పోలింగ్ తరువాత బూత్‌ల వారీగా నమోదైన స్పష్టమైన ఓటింగ్ శాతాన్ని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌దారులతో సమావేశమై వారి డిమాండ్లపై చర్చించాలని ఈసీఐను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనికి ఎన్నికల సంఘం అంగీకరించింది. దీంతో వచ్చే 10 రోజుల్లోగా ఈసీఐ ముందు సమావేశానికి హాజరుకావాలని పిటీషనర్లను సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ప్రతి దశ పోలింగ్ తరువాత బూత్‌ల వారీగా నమోదైన స్పష్టమైన ఓటింగ్ శాతాన్ని ఇసిఐ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరుతూ ఎన్‌జీఓ ఏడీఆర్ పిటిషన్ దాఖలు చేసింది. ఎడిఆర్ తరుపున న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహ రతి, చెర్లీ డి సౌజ వాదనలు వినిపించారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇసిఐ ప్రారంభంలో విడుదల చేసి ఓటింగ్ శాతానికి, తరువాత విడుదల చేసిన తుది ఓటింగ్ శాతానికి తీవ్రమైన వ్యత్యాసం వుందని, అలాగే ఈ తుది వివరాలు విడుదల చేయడానికి విపరీతమైన జాప్యం జరిగిందని పిటిషన్ తరుపు న్యాయవాదులు వాదించారు.

'పౌరులకు తెలుసుకునే హక్కు ఉంది. అభ్యర్థుల నేర చరిత్ర పౌరులకు తెలిసేలా సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. ఈ కేసులోనూ జోక్యం చేసుకోవాలి' అని అభ్యర్థించారు. దీంతో పిటిషనర్ల డిమాండ్ల విషయంలో వారితో సమావేశం నిర్వహించాలని ఇసిఐను సుప్రీంకోర్టు ఆదేశించింది. గత విచారణలో ఓటింగ్ శాతం డేటాను బహిర్గతం చేయడాన్ని వ్యతిరేకిస్తూ అఫిడవిట్ దాఖలు చేసిన ఎన్నికల సంఘం, తాజా విచారణలో మాత్రం పిటిషనర్లతో సమావేశానికి అంగీకరించింది. ఇసిఐ ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ గత నెలలో బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఈ వైఖరిలో మార్పు వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ కుల గణన దేశానికి రోల్ మోడల్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



నవతెలంగాణ- సిటీబ్యూరో

తెలంగాణ కుల గణన దేశానికి రోల్ మోడల్ అయిందని రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రస్తావించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వి.శంకరయ్య, వి.శ్రీహరితో కలిసి ఆయన మాట్లాడారు. బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అసెంబ్లీ చరిత్రలో 2025, మార్చి 17 సువర్ణ అక్షరాలతో రాసుకునే రోజు అని, కుల గణన ఆధారంగా బలహీన వర్గాలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించామని అన్నారు. బీసీ బిడ్డ కానప్పటికీ రేవంత్‌రెడ్డి బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించారన్నారు. రాజకీయ, విద్యా, ఉపాధిపరంగా బిల్లు ఆమోదించే సమయంలో సభలో తాము ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

ప్రతిపక్షాలు గతంలో కుల గణనను తప్పుపట్టినా బిల్లుకు మద్దతు తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రం తొమ్మిదో షెడ్యూల్‌కు రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్లు అమలు చేయడంలో ప్రతిపక్ష పార్టీలు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఎమ్మెల్యే వి.శంకరయ్య మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు న్యాయం చేయాలని తీసుకున్న నిర్ణయం ఇదన్నారు. మేధావులు, ప్రజా సంఘాలతో చర్చలు చేసి, చిత్తశుద్ధితో బిల్లు ప్రవేశపెట్టామన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించే వరకూ ముఖ్యమంత్రి వెంట ఉండాలని కోరారు.

మోడీ తప్పక అనుకూలంగా వ్యవహరిస్తారని నమ్మకం ఉందన్నారు. బీజేపీ నేతలు దీనికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే వి.శ్రీహరి మాట్లాడుతూ.. ఎవరి వాటా ఎంతో చూపించే ప్రయత్నం కుల గణన ద్వారా చేశామన్నారు. పీఎం మోడీ అపాయింట్‌మెంట్ కోరామని, బీజేపీ నేతలు ఈ విషయంలో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.



బీఈడీ పరీక్షల్లో పాత సిలబస్ ప్రశ్నలు..

- కొత్త సిలబస్ ప్రకారం టైటిల్..
- ఓయూ బీఈడీ ప్రథమ సంవత్సర ప్రథమ సెమిస్టర్ ప్రశ్నాపత్రం కూర్పులో నిర్లక్ష్యం
- ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు
- ఈ విషయం మా దృష్టికి రాలేదు : ఓయూ కంట్రోలర్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన బీఈడీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫిలాసఫికల్ ఫౌండేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రశ్నాపత్రంలో పాత సిలబస్ ప్రశ్నలు రావడం గందరగోళానికి దారి తీసింది. ముందుగా ప్రశ్నాపత్రం టైటిల్ సహా అలాగే రావడంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. ఓయూ అధికారులు ఈ తప్పును గ్రహించి టైటిల్‌ను మార్చి అదే పాత ప్రశ్నలతో కూడిన పాత సిలబస్ ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారు. అంటే తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా కేవలం టైటిల్‌ను మార్చి విద్యార్థులను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత సిలబస్ ప్రకారం ప్రశ్నాపత్రం ఉన్నప్పుడు ఈ ప్రశ్నపత్రాన్ని రద్దు చేస్తూ నూతన ప్రశ్నాపత్రాన్ని వెంటనే ఇవ్వడానికి అవకాశం ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి పూర్తి బాధ్యత బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ అండ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, బీఈడీ పరీక్షను మళ్లీ నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలతో న్యాక్ గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్న విశ్వవిద్యాలయ ప్రమాణాలు దిగజారకుండా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఓయూ కంట్రోలర్ ప్రొ.శశికాంత్‌ను వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

క్వశ్చన్ హవర్ నిర్వహించాలి

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో క్వశ్చన్ హవర్‌లో సమస్యలపై చర్చించాలని అడుగుతుంటే.. ప్రభుత్వం ప్రశ్నోత్తరాలను రద్దు చేసి.. తప్పించుకోవాలని చూస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రజలు తిరుగబడుతున్నారని, ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల్లో సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. రైతు రుణ మాఫీపై క్వశ్చన్ హవర్ రద్దు చేశారని, ఎక్కడ సమస్యలు లేవనెత్తాలో చెప్పాలని ప్రశ్నించారు. ఎందుకు ప్రభుత్వం దాటవేసే ధోరణితో వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. యాసంగి పంటకు రైతులకు నీళ్ల అందక ఇబ్బంది పడుతున్నారని, దీనిపై చర్చ లేదన్నారు. మోటార్లు కాలిపోతున్నాయని, నాణ్యమైన కరెంటు సరఫరాపై క్వశ్చన్ హవర్‌లో పెట్టామన్నారు. రైతు భరోసాపై చర్చ జరగాలన్నారు. కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, దాన్ని పక్కకు పడేశారని.. దీనిపై సమాధానం లేదన్నారు. వడ్ల సేకరణపై తాము క్వశ్చన్ హవర్‌లో లేవనెత్తాలని చూశామని, ఇవన్నింటి నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలని ప్రశ్నోత్తరాలను చేసిందని ఆరోపించారు. క్వశ్చన్ హవర్ నిర్వహించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

డైమ్లర్ విద్యుత్ ట్రక్ అమ్మకాల్లో 17 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డీఐసీవీ) మాతృసంస్థ డైమ్లర్ ట్రక్ తన 2024 ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. యూరప్, ఆసియా మార్కెట్లలో బలహీన డిమాండ్ నెలకొన్నప్పటికీ మెరుగైన ప్రగతిని కనబర్చినట్టు తెలిపింది. 2024లో తమ బ్యాటరీ, విద్యుత్ ట్రక్ అమ్మకాలు 17 శాతం పెరిగాయని వెల్లడించింది. స్థూలంగా గ్రూప్ రెవెన్యూ 3 శాతం తగ్గి 54.1 బిలియన్ యూరోలుగా నమోదయ్యిందని పేర్కొంది. గతేడాది అంతర్జాతీయంగా 12 శాతం తగ్గుదలతో 4,60,409 యూనిట్ల ట్రక్‌లను విక్రయించినట్టు తెలిపింది. ఆసియా సెగ్మెంట్ రెవెన్యూ 13 శాతం తగ్గి 6,111 మిలియన్ డాలర్లుగా చోటు చేసుకుందని పేర్కొంది.

శరత్ సిటీ మాల్‌లో నొబెరో అవుట్‌లెట్ ఏర్పాటు

హైదరాబాద్ : ఫ్యాషన్ లీజర్ బ్రాండ్ నొబెరో తాజాగా హైదరాబాద్‌కు విస్తరించినట్టు ప్రకటించింది. నగరంలోని శరత్ సిటీ మాల్‌లో తమ మొదటి ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్‌ను ప్రారంభించినట్టు తెలిపింది. ప్రస్తుతం తమకు 30 అవుట్‌లెట్‌లు ఉన్నాయని.. 2026 చివరి నాటికి దేశ వ్యాప్తంగా 25 స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నొబెరో సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రశాంత్ ఆలూరు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో స్మార్ట్‌వర్క్స్ నాలుగు కేంద్రాలకు విస్తరణ

SMARTWORKS

హైదరాబాద్ : వర్క్ స్పేస్ ప్రొవైడర్ స్మార్ట్‌వర్క్స్ కో వర్కింగ్ స్పేసెస్ హైదరాబాద్‌లో మరో 2.20 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకుంది. గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ సైబర్ సిటీలోని బ్లాక్3లోని వాణిజ్య స్థలాన్ని తీసుకున్నట్టు ఆ కంపెనీ వెల్లడించింది. దీంతో ఆ సంస్థ ఇక్కడ నాలుగు సెంటర్లకు విస్తరించినట్లయ్యింది. ఇప్పటికే రాయదుర్గాలోని పూర్వ సమ్మిట్, కొండాపూర్‌లోని గెలాక్సీ, మాధాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్‌లోని బిల్డింగ్ 3ఎ, 3బిల్లో కేంద్రాలను కలిగి ఉంది. అన్ని రంగాల నుంచి హైదరాబాద్ స్థిరమైన డిమాండ్‌ను కలిగి ఉందని స్మార్ట్‌వర్క్స్ ఫౌండర్ నితీష్ సర్దా పేర్కొన్నారు. ఆధునిక పని ప్రదేశాలు, సౌకర్యాలను పలు కంపెనీలు కోరుకుంటున్నాయన్నారు.

తమిళనాడులా మాదిరిగా బీసీ రిజర్వేషన్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తమిళనాడు రాష్ట్రం తరహాలో బీసీ రిజర్వేషన్లను అమలు కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంగళవారం శాసనమండలిలో ఆయన రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రెండు వేర్వేరు బీసీ రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం శాసనసభలో ఈ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించుకున్నామని తెలిపారు. బిల్లులకు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒక్క తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుందామని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా అందరం కలిసి ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుదామని చెప్పారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు భవిష్యత్తులో దేశానికి రోల్ మోడల్‌గా అవతరించబోతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఈ బిల్లులకు మండలిలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం సభ్యులు మద్దతుగా మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సముచితమైందిగా అభివర్ణించారు. ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

జోగులాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లంకు తెలిపారు. మంగళవారం ప్రజాభవన్‌లో వారిద్దరూ జోగులాంబ ఆలయ అభివృద్ధిపై చర్చించారు. గతంలో దేవాదాయశాఖ కమిషనర్‌గా అజయ్‌కల్లం జోగులాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆలయ కమిటీతో ఇప్పటికే రెండు సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 20వ తేదీ మరోసారి భేటీ కానున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అజయ్‌కల్లం తన అనుభవాలను ఆయనతో పంచుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామనీ, బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చీల ఏర్పాటు, లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాలనీ, అందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు సహా ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని కమిటీని కోరామని చిన్నారెడ్డి తెలిపారు. ఈ భేటీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవరెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ, సీడ్స్ గ్రోవర్స్ సంఘం అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే బీసీ రిజర్వేషన్లు

- ఆమె ఇంటి ఎదుట తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంబురాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే బీసీ రిజర్వేషన్ల రెండు బిల్లులు వచ్చాయని తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంఘాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆ సంఘాల నేతలు మంగళవారం ఎమ్మెల్సీ కవిత ఇంటి ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు కవితకు ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేర్వేరు బిల్లులు పెట్టాలని కవిత పోరాటం చేశారని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్లా శివశంకర్ తెలిపారు. ఆమె పోరాటాలకు తలొగ్గే రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు అంగీకారం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు ఆర్వీ మహేంద్ర, గోప సదానందం, కొట్టాల యాదగిరి, హమాలీ శ్రీను, విజేందర్ సాగర్, ఏల్చాల దత్తాత్రేయ, నరహరి, నరేష్, కుమారస్వామి, ప్రవీణ్, లింగం, అశోక్, మేకల లలిత యాదవ్, పావని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పటం కాంగ్రెస్ నైజం

- మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాట తప్పడం, మడమ తిప్పడం కాంగ్రెస్ పార్టీ నైజమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. మంగళవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాలను వంచించినట్టు విద్యార్థులనూ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో తామిచ్చిన హామీలను అమలు చేయలేమని కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిందని తెలిపారు. డిగ్రీ, ఆపై చదివే విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు సమీక్షించుకోవాలని, అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తులం బంగారం ఇయ్యబోమని శాసనమండలి సాక్షిగా చెప్పారని తెలిపారు. ఆడపిల్లలకు స్కూటీలు ఎగ్గొట్టే పని చేస్తున్నారని విమర్శించారు. రూ.ఒక లక్ష 50 వేల కోట్ల అప్పు చేసి హామీలు విస్మరించారని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీకి విద్యార్థినీలు పోస్ట్ కార్డులు రాస్తున్నారని చెప్పారు.

పోస్టాఫీసుల్లో రాములోరి ముత్యాల తలంబ్రాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవంలో తపాలశాఖ భాగస్వామ్యం అవుతున్నది. భద్రాచలం వెళ్లి నేరుగా కళ్యాణాన్ని దర్శించలేని భక్తుల కోసం పోస్టాఫీసుల ద్వారా అంతరాలయ అర్చన, కళ్యాణ తలంబ్రాలను రూ.450 కి బుక్ చేసుకుంటే ఇంటికే పోస్టాఫీసు సిబ్బంది తెచ్చి ఇస్తారు. అలాగే ముత్యాల తలంబ్రాలను రూ.150కి బుక్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 1వ తేదీ వరకు ఈ సేవల్ని ప్రజలు పోస్టాఫీసుల్లో బుక్ చేసుకోవచ్చు. సీతారాముల కళ్యాణం తర్వాత స్పీడ్ పోస్ట్ ద్వారా వీటిని భక్తుల ఇండ్లకు చేరవేస్తారు. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ (బీడీ) హెచ్ శరత్‌కుమార్ తెలిపారు. భక్తులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి

- ఏపీ, కేంద్రానికి నోటీసులు జారీ చేసిన సుప్రీం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ పరీవాహకంలో ఉన్న ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించాలన్న కేంద్రం నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 2021 జులై 15న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ, నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను, అంతకు ముందు కృష్ణానది ప్రాజెక్టుల నుంచి అనధికారికంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటున్నారని, అందుకు అనుగుణంగా తెలంగాణ జారీ చేసిన జీవో రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలన్న ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. రెండు ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేసిన వారం రోజుల్లో రీజాయిండర్ ఫైల్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బాలిక అపహరణ.. వ్యభిచారం రొంపిలోకి దింపే యత్నం

ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ నగరంలో ఓ బాలికను అపహరించి లైంగికదాడికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు.. ఒక బాలిక, ఒక మహిళ, నలుగురు వ్యక్తులున్న సభ్యుల ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కిలో 800గ్రాముల గంజాయితో పాటు ఒక కారు, రూ.75వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లతో పాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీస్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం జరిపిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న ఓ బాలిక అదృశ్యంపై ఫిర్యాదు రాగా మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి పోలీసుల సంరక్షణలో తీసుకొని విచారించారు. తనను కొంతమంది వ్యక్తులు అపహరించి గంజాయి తాగించారని, అనంతరం లైంగికదాడికి పాల్పడినట్టు బాలిక పోలీసులకు వెల్లడించింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు.. సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ అధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తు భాగంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో నిందితులు వరంగల్ జిల్లా దామెర మండలం ల్యాదేళ్ళ గ్రామానికి చెందిన ముస్కు లత, ఓ బాలిక, వరంగల్‌లోని శంభుని పేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్‌బేగ్ అలియాస్ వదూద్‌ను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు.

ప్రధాన నిందితురాలు ముస్కులత ల్యాదేళ్ళ గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తుంది. తల్లిదండ్రులు మరణించడంతో మరో మైనర్ నిందితురాలికి తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. కొత్త మహిళలుగానీ, బాలికలను గానీ తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని, నీకు కొంత డబ్బు ఇస్తానని సదరు మైనర్ నిందితురాలికి తెలిపింది. దాంతో ఆ బాలిక తన స్నేహితురాలితో పరిచయమైన బాధిత బాలికను లక్ష్యంగా చేసుకొని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుంది.

బాలిక స్కూల్‌కు వెళ్ళే సమయంలో కలవడంతో పాటు నిందితురాలి ప్రియుడు అబ్దుల్ అఫ్నాన్‌తో కలిసి బాలికను అపహరించారు. మద్యం, గంజాయి తాగించడం అలవాటు చేసి షాపింగ్ మాల్స్‌కు తీసుకెళ్లి దుస్తులు ఇప్పించారు. సదరు బాధిత బాలిక వారిని నమ్మి ఈ నెల 11న మరో ఇద్దరు షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌తో కలిసి కారులో గంజాయి విక్రయాలు చేసే మీర్జా ఫైజ్ బేగ్ వద్దకు వెళ్లారు. గంజాయి కొనుగోలు చేసి నర్సంపేట శివారు ప్రాంతంలో షేక్‌సైలానీ బాబాకు చెందిన ఓ పురాతన ఇంటిలో బాధిత బాలికను తీసుకెళ్ళి గంజాయి తాగించి షేక్ సైలాని బాబా బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇదంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించామని, బెదిరిస్తూ సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వదిలిపెట్టి నిందితులు పరారయ్యారు. కేసు దర్యాప్తులో నిందితులను పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్ఐలు శ్రీకాంత్, సురేష్‌లతో పాటు ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

నాలుగు బిల్లులకు మండలి ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాలుగు బిల్లులకు శాసనమండలి మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన రెండు బిల్లులను, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టిన యాదగిరిగుట్ట ఆలయ ధర్మకర్తల మండలి (బోర్డు) ఏర్పాటుకు సంబంధించిన బిల్లు నాలుగు బిల్లులు ఆమోదం పొందినట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆ బిల్లులు ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. అనంతరం సభను బుధవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్టు సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

బీసీ రిజర్వేషన్ 56 శాతానికి పెంచాలి : తీన్మార్ మల్లన్న

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వారిని అభివృద్ధి చేయకుండా పాలక పార్టీలు మోసం చేశాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీలు అధికారంలోకి వచ్చినపుడే వారి బతుకులు మారతాయని చెప్పారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేదన్నారు. ఈ పదేండ్లలో బీసీల కోసం కేంద్రం రూ.15,855 కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. 2019లో 15 మంది కార్పొరేట్లకు రూ.3.50 లక్షల కోట్లు మాఫీ చేసిందని వివరించారు. దేశంలో పేదలంటే అంబానీ, అదానీలేనని చెప్పారు. అగ్రవర్ణాలు 500 ఏండ్లు అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ పొందారనీ, బీసీలు వెయ్యేండ్లు వెనకబడి ఉన్నారని అన్నారు. బీసీల రిజర్వేషన్ 42 శాతం కాదనీ, 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. వెనకబడిన తరగతుల శాఖ కాకుండా వెనకబడిన కులాల శాఖగా మార్చాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పది శాతం ఈ గణాంకాల ప్రకారం అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. దానివల్ల నష్టపోతున్నది బీసీలేనని అన్నారు.

బీసీ బిల్లులకు మద్దతు : మధుసూదనాచారి

బీసీ బిల్లులకు శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మద్దతు ప్రకటించారు. కులగణన లెక్కల విషయంలో కొన్ని అనుమానాలున్నాయనీ, వాటిని నివృత్తి చేయాలని సూచించారు. కోదండరామ్ మాట్లాడుతూ బీసీ బిల్లులకు మద్దతు ప్రకటించారు. ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్ అమలయ్యేందుకు ఉమ్మడి వ్యూహంతో సంఘటితంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ అంశంపై శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్, ఎంఐఎం సభ్యులు ఎఫెండి, బీఆర్ఎస్ సభ్యులు భానుప్రసాదరావు, తాతా మధు, కాంగ్రెస్ సభ్యులు అమీర్‌అలీఖాన్, జీవన్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు.

ఎస్సీ రిజర్వేషన్ 18 శాతానికి పెంచాలి : సత్యవతి రాథోడ్

ఎస్సీ రిజర్వేషన్‌ను పెరిగిన జనాభాకనుగుణంగా 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని బీఆర్ఎస్ సభ్యులు సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమె స్వాగతించారు. ఈ వర్గీకరణ కోసం మాదిగలు అనేక పోరాటాలు చేశారని అన్నారు. అయితే 2004లో ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టేసిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు ఈ అంశాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. పలువురు సభ్యులు ఈ అంశంపై మాట్లాడారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిచ్చారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్ రెడ్డికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి

ఇండ్లస్థలాల సంగతి తేల్చాలని విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బందం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య నేతత్వంలో ప్రతినిధి బందం మంగళవారం అసెంబ్లీలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఇండ్ల స్థలాలు, ఆరోగ్య బీమా పథకం, అక్రిడిటేషన్ కార్డులు, పెన్షన్ పథకం, మహిళా జర్నలిస్టులకు రాత్రి సమయం లో రవాణా సౌకర్యం, అర్హత ఉన్న చిన్న, మధ్యతరహా పత్రికలకు ఎంప్యానల్ మెంట్, తదితర సమస్యలు పరిష్కరించాలని సీఎంను కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎంను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్‌కుమార్, నాయకులు క్రాంతి, సీనియర్ జర్నలిస్టులు జాన్ రాస్, రాజేష్ జైన్, గంగాధర్, పూర్ణ చంద్రరావు, బస్వ రాజ్, తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీది బీసీ విద్రోహ చరిత్ర

బీసీ రిజర్వేషన్ల బిల్లులను కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దు

రాజకీయ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం అనవసరం

బూసాని కమిషన్ నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలి : శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశంలో బీసీలకు ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, బీసీల వెనుకబాటుతనానికి ఆ పార్టీ వైఖరే కారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. మండల్ నివేదికపై గతంలో రాజీవ్ గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని తెలిపారు. ప్రస్తుతం రాహుల్‌గాంధీ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మంగళవారం శాసనమండలిలో బీసీ బిల్లులపై ఆమె మాట్లాడుతూ ఆ బిల్లులు విప్లవాత్మకమైనవనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. అయితే రెండు బిల్లులు కాకుండా మూడు బిల్లులు పెట్టాల్సిందని అభిప్రాయపడ్డారు. రాజకీయ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం అవసరం లేదని తేల్చి చెప్పారు. బూసాని కమిషన్ నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీ.పీ.మండల్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పదేండ్లు అమలు చేయలేదని గుర్తుచేశారు. అనంతరం వచ్చిన వీ.పీ.సింగ్ ప్రభుత్వం 1990లో అమలు చేసిందని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందంటూ నాడు రాజీవ్ గాంధీ వాదించారని ఆమె చెప్పారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ మాటలను కవిత వక్రీకరించారని ఆరోపించారు. కవిత మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం బీసీ గణన కోసం రూ.4,300 కోట్లు విడుదల చేసినా, నివేదికను మాత్రం బయటపెట్టలేదని తెలిపారు. ఆ నివేదికపై రాహుల్ గాంధీ, సోనియాగాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీ వర్గీకరణ కోసం మోడీ సర్కారు వేసిన జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికనూ కేంద్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించారనీ, ఆ లెక్కను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 9 నెలలు కాపయాపన చేసిందనీ, బీఆర్ఎస్, ప్రజాసంఘాల ఒత్తిడితో డెడికేటెడ్ కమిషన్ వేసిందని తెలిపారు. ఆ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ లెక్కలు తప్పు చెబితే భవిష్యత్తులో ఆ వర్గాలకు రిజర్వేషన్లు, ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజకీయ రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి వర్తించబోదనీ, కాబట్టి దానికి కేంద్రం ఆమోదం కావాలంటూ ఢిల్లీకి వెళ్లాలంటూ ప్రజలను మభ్యపెట్టవద్దని సూచించారు. రాజకీయ ,విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లులో గ్రూపుల వారీగా రిజర్వేషన్లను ఎందుకు విభజించలేదని ప్రశ్నించారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి గతేడాది రూ.9,200 కోట్లను మాత్రమే కేటాయించిందని, ఈ బడ్జెట్‌లోనైనా ఇచ్చిన మాట ప్రకారం రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బీసీల కోసం చేసిన ఖర్చులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఉన్నా ఇప్పటికీ 23 శాతానికి మించి ఎప్పుడూ భర్తీ కాలేదని తెలిపారు. యూపీఎస్సీలో 8 శాతం అవకాశాలే దక్కాయని చెప్పారు. దేశంలో 50 శాతం జనాభా ఉన్న బీసీల వద్ద 15 శాతం మాత్రమే సంపద ఉందనీ, ఈ అసమానతలను సరి చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

22న మణిపూర్‌కు సుప్రీం న్యాయమూర్తుల బృందం

పర్యటించనున్న ఆరుగురు న్యాయమూర్తులు



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

అల్లర్లు జరిగి ఏడాది గడిచినా అటువైపు చూడని ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలు వెల్లువెత్తున్న నేపథ్యంలో మణిపూర్‌ను ఆరుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బృందం సందర్శించనుంది. అల్లర్ల బాధితులకు చట్టపరమైన పునరావాస సహాయాన్ని అంచనా వేయడానికి, బలోపేతం చేయడానికి ఈనెల 22వ తేదీన పర్యటించనుంది. ఈ న్యాయమూర్తులు సహాయ శిబిరాలను కూడా సందర్శిస్తారు. జాతీయ న్యాయ సేవల అథారిటీ (ఎన్ఎల్ఎస్ఎ) ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్‌కె సింగ్ తదితరులు మణిపూర్‌లో పర్యటించనున్నారు.జస్టిస్ గవాయ్ అన్ని జిల్లాల్లో అల్లర్ల బాధితుల కోసం న్యాయ సహాయ శిబిరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. బాధితులకు సహాయంగా అవసరమైన వస్తువులను పంపిణీ చేయనున్నట్టు ఎన్ఎల్ఎస్ఎ ప్రకటించింది. అల్లర్ల సమయంలో ఇండ్లను వదిలి వెళ్లిన ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా సహాయం అందేలా చూస్తామని పేర్కొంది. న్యాయమూర్తుల సందర్శన న్యాయం పట్ల వారి దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తుందని ఎన్ఎల్ఎస్ఎ పేర్కొంది. మరోవైపు బాధితులకు పునరావాసం కల్పించాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ పదవీ కాలాన్ని జులై 31 వరకు పొడిగిస్తూ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. ప్రధానమంత్రి మణిపూర్‌ను సందర్శించాలన్న ప్రతిపక్షాల డిమాండ్ బలంగా ఉన్న తర్వాతే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మణిపూర్‌ను సందర్శిస్తున్నారు.

హెచ్‌సీయూ భూములను అమ్మడం విధ్వంసపు చర్య

బీజేవైఎం నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం : డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హెచ్‌సీయూలోని 400 ఎకరాలను రాష్ట్ర సర్కారు అమ్మకానికి పెట్టడం విధ్వంసపు చర్య అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆ భూములను రక్షించాలని చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన బీజేవైఎం నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడాన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సింది పోయి భావితరాలకు ఉపయోగపడే విద్యాసంస్థల భూములను అమ్మడం దారుణమని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్సిటీ కోసం 2300 ఎకరాలను కేటాయిస్తే ఇప్పుడు కేవలం రూ.10 వేల కోట్ల కోసం యూనివర్సిటీ భూములను అమ్మడం భావితరాల విద్యాహక్కును హరించడమేనన్నారు. ఆ విశ్వవిద్యాలయం మష్రూమ్‌రాక్, పీకాక్‌లేక్‌తో ప్రకృతి సంపదకు నిలయమని చెప్పారు. ఉద్యమాల పురిటిగడ్డగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీలో విధించిన ఆంక్షలు అప్రజాస్వామికమని చెప్పారు. స్వేచ్ఛ-ప్రజాస్వామ్య తెలంగాణ-ప్రజాపాలనే తమ ప్రభుత్వ ఏడో గ్యారంటీ అని రేవంత్‌రెడ్డి చెప్పడం పెద్ద మోసం అని విమర్శించారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

మే 7 నుంచి 31 వరకు మిస్‌వరల్డ్ పోటీలు

140 దేశాల నుంచి హాజరు కానున్న ప్రతినిధులు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ అందాల పోటీలకు తెలంగాణ వేదిక కానుంది. మే 7 నుంచి 31 వరకు మిస్‌వరల్డ్ పోటీలకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. పర్యాటకానికి ఊతమిచ్చే వేదికగా ఈ ఈవెంట్‌ను మలుచుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ టూరిజం శాఖ తగు చర్యలు చేపట్టింది. వైద్యులు, ఇంజినీర్లు, క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, సృజనాత్మక కళాకారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్న ఈ పోటీల్లో 140 దేశాలకు చెందిన మాడల్స్ తమ అందచందాలతో కనువిందు చేయనున్నారు. మిస్ వరల్డ్ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక పర్యాటక అంశాలను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితంగా ఇక్కడి కళాకారుకు అంతర్జాతీయంగా గుర్తింపు దక్కనుందని భావిస్తున్నారు. చేనేత, గీత, సిల్వర్ ఫిలిగ్రీ తదితర స్థానిక వృత్తులను ఇందులో ప్రత్యేంగా ప్రదర్శించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఈ పోటీలు తెలంగాణ టూరిజానికి తోడ్పాటునందిస్తాయని భావిస్తున్నారు.

థాంక్యూ సీఎం

బీసీ బిల్లు చారిత్రాత్మకం

సీఎంను సన్మానించిన బీసీ రాజ్యాధికార సమితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును తీసుకువచ్చి అసెంబ్లీలో ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీల తరఫున బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ నేతృత్వంలో ముఖ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా అసెంబ్లీలో బీసీ సంఘాలు, ప్రజా సంఘాలతో అసెబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రిని శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనను చట్టబద్ధం చేయడం బీసీ రాజ్యాధికార సాధనకు తొలిమెట్టు అని దాసు సురేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లును '9 'వ షెడ్యూల్లో చేర్చటానికి అవసరం అయిన రాజ్యాంగ సవరణను సాధించటానికి త్వరలోనే బీసీ రాజ్యాధికార సమితి క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన యువ నాయకత్వ కమిటీలను కలుపుకొని ఢిల్లీలో భారీ బహిరంగ ధర్నాను నిర్వహించనున్నామని తెలిపారు. జల్లికట్టు వివాదంపై తమిళనాడులో పార్టీలకు అతీతంగా సంఘాలు, సమాజం ఉద్యమించిన విధంగా బీసీల రిజర్వేషన్ల పెంపును ఆకాంక్షించే ప్రతి రాజకీయ పార్టీ ఇందుకు అనుగుణంగా వ్యవహరించే విధంగా తమ వ్యూహాలను ముందుకు తీసుకువెళ్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడే పార్టీలను వ్యక్తులను బీసీ ద్రోహులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో గ్రేటర్ హైదరాబాద్ చైర్మెన్ బండారు పద్మావతి, తాళ్ల భాగ్యలక్ష్మి, అచ్చ నాగమణి, గుండి నగేష్, మారేపల్లి లక్ష్మణ్, గూడూరు తిరుపతి, ప్యారసోని దుర్గేష్, జ్యోతి, శారద, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు 1.36 లక్షల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 1,36,425 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 98,046 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 38,273 మంది రెండింటికీ 106 మంది కలిపి మొత్తం 1,36,425 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

15 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో 15 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ డీజీపీ జితేందర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో డీఎస్పీలు శ్రీకాంత్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, కుషాల్కర్, సుదర్శన్, శ్రీపతిరావు, తదితరులున్నారు. వీరంతా 1991, 1985 బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలు. పదోన్నతులు పొందిన వీరిని కొత్త పోస్టింగ్‌లు ఇచ్చేంత వరకు డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

అమ్మేసే నిర్ణయంలో మార్పు లేదు

- 'ఉక్కు' ప్రైవేటీకరణ ఆగిందా? అన్న పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుపై కేంద్రం తాజా సమాధానం
- టిడిపి కూటమి మోసానికి మరో సాక్ష్యం
- ఆందోళనలో కార్మికులు, నిర్వాసితులు



విశాఖ : విశాఖ ఉక్కును నూటికి నూరు శాతం అమ్మేయాలనుకున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో మార్పేమీ లేదన్నది మరోసారి స్పష్టమైంది. 'రూ.11440 కోట్లు ఇచ్చాం. ఉక్కును నిలబెట్టాం. ప్రైవేటీకరణ లేదా అమ్మేస్తున్నాం' అంటూ ఎవరైనా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదు' అంలూ విశాఖకు చెందిన బిజెపి నేతలు మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, ఎంఎల్ఎ విష్ణుకుమార్ రాజు సహా కూటమిలోని టిడిపి, జనసేన నేతలు కొద్దిరోజుల క్రితం వరకూ ఊదరగొట్టి రాష్ట్ర ప్రజలను, ఉక్కు కార్మికులను మోసం చేశారనేది మరోసారి రుజువైంది. పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా కార్మిక నాయకుడు పాడి త్రినాధరావు 'నాలుగేళ్ల క్రితం కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ (సిసిఇఎ) వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తామని స్టీల్‌ప్లాంట్‌పై నిర్ణయం చేసిందని, తాజా పరిస్థితి ఏమిటని' వివరణ కోరారు. 'అప్పటి నిర్ణయంలో ఏ మార్పూ ఇంతవరకూ జరగలేదు' అని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అజయ్ నాగ్‌పాల్ నుంచి సమాధానం వచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉండే డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్ మేనేజిమెంట్ (దీపం) నుంచి పైవిధంగా సమాధానం రావడంపై ఉక్కు కార్మికుల్లో ఆందోళన నెలకొంది.

ఉక్కుపై టిడిపి కూటమి మోసం

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, సహాయ మంత్రి ఇద్దరూ కొద్ది రోజుల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. పలు దఫాలుగా కార్మికులు, ఉద్యోగులు, అధికారులతో చర్చలు జరిపారు. 'ప్రైవేటీకరణ ప్రశ్నే లేదు' అంటూ కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి చెప్పుకొచ్చారు. కార్మిక సంఘాలు పోరాటాన్ని విరమించాలని ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఉచిత సలహా ఇచ్చారు. అన్నీ సర్దుకుంటాయని, ఓపిక పట్టాలని మభ్యపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా టిడిపి కూటమి నేతలంతా రూ.11440 కోట్ల ప్యాకేజీ ప్లాంట్‌కు రావడం 'కూటమి సాధించిన గొప్ప విజయమంటూ ప్రకటనలు గుప్పించి రాష్ట్రమంతటా విజయోత్సవాలు జరిపారు. ఇది ఎంత మోసమన్నది తాజాగా అర్థం చేసుకుని కార్మికులు మండిపడుతున్నారు. బ్యాంకులకు స్టీల్‌ప్లాంట్ పడిన అప్పులను తీర్చడానికి, పన్నులు కట్టడానికి తప్ప ఈ ప్యాకేజీ వాడకూడదన్న కేంద్రం షరతులను ఇప్పుడిప్పుడే కార్మికులు అర్థం చేసుకుంటున్నారు. విశాఖ ఉక్కును అమ్మేయడానికి సన్నాహాలు తెరవెనక సాగిపోతున్నాయని వారంతా భయపడుతున్నారు. మరోవైపు కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలను ఉక్కు యాజమాన్యం ఆపడం లేదు. జీతాల చెల్లింపులూ అరకొరగానే సాగుతున్నాయి. రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలెవరూ ప్లాంట్‌ను పట్టించుకున్న పరిస్థితి కనిపించడం లేదు. టిడిపి విశాఖ ఎంపి భరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు పూర్తిగా ఉక్కు వైపు కన్నెత్తి చూడకుండా ముఖం చాటేశారన్న విమర్శలు కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి.

ఖనిజ సంపద దోపిడీకే 'ఆపరేషన్ కగార్'

- ప్రొఫెసర్ హరగోపాల్



విశాఖ : దేశంలోని అటవీ ఖనిజ సంపద దోపిడీకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరిట 2026 మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామనే నినాదాన్ని ఎత్తుకుని ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనాన్ని తరిమేసే కుట్రలకు పాల్పడుతోందని సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. 'ఆపరేషన్ కగార్' అనే అంశంపై విశాఖలోని పౌర గ్రంథాలయంలో సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖనిజాల విధ్వంసం, పర్యావరణ నాశనాన్ని 'కగార్' కోరుతోందన్నారు. కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపిది ప్రస్తుతం నయా ఫాసిస్ట్ విధానమని, ఇది తీవ్రరూపం దాల్చితే ఫాసిస్ట్ చర్యలు పెరుగుతాయన్న సిపిఎం అంచనా, ఆందోళన సరైనదేనని అన్నారు. దాదాపు 200 ఏళ్లుగా ఆదివాసీలు దేశంలో తమ అటవీ హక్కుల కోసం పోరాడుతున్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన అభివృద్ధి నమూనా 'ఆపరేషన్ కగార్' పేర నడుస్తోందని తెలిపారు. కగార్‌పై ప్రజాస్వామ్య వాదులు పోరాడాలని, లేదంటే బిజెపి తన ఫాసిస్టు స్వభావంతో దేశంపై దాడి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు విఎస్.కృష్ణ, ఆదివాసీ హక్కుల నేత రామారావు దొర, పర్యావరణవేత్త గంజివరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సంపన్నులకు రాయితీలు.. పేదలపై పన్నుల భారాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- పీఎన్ఎం ఆధ్వర్యంలో ఓటరు చైతన్య యాత్ర



నవతెలంగాణ-వలిగొండరూరల్

బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ చేపట్టిన ఓటరు ప్రజా చైతన్యయాత్ర మంగళవారం వలిగొండ మండలంలోని పులిగిల్ల, తుర్కపల్లి, పొద్దుటూరు, సుంకిశాల గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకొచ్చాక దేశంలో ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగం పెరిగిపోతోందని, సామాన్యులు మూడు పూటలా తిండి తినలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. దేశంలో సంపన్నులకు భారీ రాయితీలు కల్పిస్తూ పేదలపై విపరీతమైన పన్నులు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2500 ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో విఫలమయ్యారని, కమ్యూనిస్టుల పాలనలో ఉన్న కేరళలో రైతుల పంటలకు మద్దతుతో కూడిన ధరను ఇస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోండి..

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే సీపీఐ(ఎం) నాయకులను ఎన్నుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. గతంలో సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధుల పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండే ప్రజానాయకులను ఎన్నుకోవాలన్నారు. వందల కోట్ల రూపాయల్ని ఖర్చుపెట్టి ప్రజాసేవ పేరుతో కొంతమంది రాజకీ యాలు చేయడానికి ముందుకు వస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డబ్బు, మద్యం రాజకీయాలను తిరస్కరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారు గోవర్ధన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య సీపీఐ(ఎం) నాయకులు సిర్పంగి స్వామి, గణపతిరెడ్డి, గడ్డం వెంక టేష్, వాకిటి వెంకటరెడ్డి, మెరుగు వెంకటేశం, కందాడి సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు బుగ్గ ఐలయ్య, సల్లనర్సమ్మ, ఐలయ్య పాల్గొన్నారు.

డీలిమిటేషన్‌తో మోడీ సర్కారు మరో కుట్ర

- మావోయిస్టుల పేరుతో గిరిజనులపై దాడులు :
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



అమరావతి: నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) పేరుతో మోడీ ప్రభుత్వం మరో కుట్రకు తెరతీస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో బిజెపి ప్రభావం లేకపోవడంతో అక్కడ బలం పుంజుకోవడానికి అనేక కుయుక్తులు పన్నుతోందని చెప్పారు. మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాల హక్కులను కాల రాస్తోందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ చర్యల్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య పార్టీలతో దేశ స్థాయిలో ఇండియా ఐక్య సంఘటన ఏర్పడిందన్నారు. పోలీసుల పహారాలో చత్తీస్‌గఢ్ ఉందని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కనుసన్నల్లో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల అణచివేత ముసుగులో భద్రతా దళాలు అమాయక గిరిజనులపై దాడులకు తెగబడుతున్నాయని చెప్పారు. మావోయిస్టులు, గిరిజనులను అణచివేసి ఆ భూములను కార్పొరేట్ రంగాలకు అప్పగించ దానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ చరిత్రను తిరిగి రాయడానికి మితవాద, మతవాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఎయిర్ టెల్, జియో కలిసి స్పెక్ట్రమ్‌ను ఎలాన్ మస్క్‌కు ధారాదత్తం చేయడానికి సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. మస్క్ పెంటగాన్‌కు మద్దతు ఇస్తున్నాడని, తద్వారా దేశ రహస్యాలను అమెరికా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నికలు తదితర రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. ఉత్తరాది,దక్షిణాది అనే ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ, ప్రజల మధ్య చిచ్చు రేపేలా ఈ విధానాలు ఉన్నాయని తెలిపారు. సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా క్షేత్ర స్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యంగా దృష్టి కేంద్రీకరించా మని, ఆ దిశగా పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్నట్లు తెలిపారు. శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఈ ఏడాది డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడ కేంద్రంగా జాతీయ సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి జాతీయ స్థాయి నేతలు, వివిధ కమ్యూనిష్టు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. డిసెంబరు 26వ తేదీన తెలంగాణలోని ఖమ్మంలో శత వార్షికోత్సవ ముగింపు సభ జరుగుతుందన్నారు. 9 నెలల తరువాత అంతరిక్షం నుంచి సునీతా విలియమ్స్ స్వదేశానికి తిరిగి రావడం శుభ పరిణామమని తెలిపారు. శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఏపీలో మోగిన డప్పులు!

- మహాధర్నాకు భారీగా తరలివచ్చిన కళాకారులు
- భోజనానికి వెళుతున్న నాయకుల అరెస్టు
- తీవ్ర నిరసనతో విడుదల



అమరావతి : డప్పు కళాకారుల డప్పుల దరువుతో విజయవాడ ధర్నాచౌక్ మంగళవారం హోరెత్తింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం (ఎపిడికెఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతల నుండి తరలివచ్చిన డప్పు కళాకారులు ధర్నా చౌక్‌లో కదం తొక్కారు. వయో పరిమితి లేకుండా డప్పు కళాకారులందరికి డప్పు డ్రస్సు, గజ్జెలు ఇచ్చి డప్పు పండుగ నిర్వహించాలని, జిల్లాల్లో డప్పు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నినదించారు. వీరి నినాదాలు, డప్పుల మోతతో ఈ ప్రాంతం మారుమ్రోగింది. కార్యక్రమం ముగిసిన తరువాత భోజనానికి వెడుతున్న సంఘ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ దురుసుగా ప్రవర్తించడం, నోటికొచ్చినట్లు మాట్లాడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం కావడంతో అరెస్ట్ చేసిన వారిని పోలీసులు విడిచిపెట్టారు. అంతకుముందు ఎపిడికెఎస్ అధ్యక్షులు ఎండి ఆనంద్ అధ్యక్షతన జరిగిన సభలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ డప్పు కళాకారులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. డప్పు కళాకారులకు పింఛన్ నాలుగు వేలు మాత్రమే ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటక కళాకారులకు ఇచ్చిన విధంగానే డప్పు కళాకారుల పింఛన్ ఏడు వేల రూపాయలకు పెంచాలన్నారు. డప్పు కళాకారుల పింఛను వయో పరిమితిని 45 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. రాజకీయ కారణాలతోగానీ, సర్వేల పేరుతో గానీ డప్పుకళాకారుల పింఛన్లు తొలగించడాన్ని అంగీకరించబోమన్నారు. పింఛను పొందుతున్న డప్పు కళాకారులను ధ్రువీకరణ పత్రాలు చూపాలని అడగడం మానుకోవాలని అన్నారు. డప్పు కళాకారుల సమస్యల పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ డప్పు కళాకారుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజు, ఎపిడికెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.కుటుంబరావు, నాయకులు కె.రంగమ్మ, రమణ ధర్నాలో పాల్గొన్నారు.

సిఐ దురుసు ప్రవర్తన

విజయవాడ సత్యన్నారాయణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణ అత్యుత్సాహం, దురుసు ప్రవర్తన ధర్నా చౌక్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. అన్నక్యాంటిన్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ధర్నా ముగించుకుని డప్పులు మోగించుకుంటూ శాంతి యుతంగా అంబేద్కర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన భోజనానికి వెళుతున్నారు. వారిని బెజ్ పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ధర్నా ముగించుకుని వెళ్లిపోతున్నామని కళాకారులు చెబుతున్నా వినిపించుకోలేదు. ఈ సందర్భంగా సిఐ సంఘ నేతలను దుర్భాషలాడారు. తాము భోజనానికివ మాత్రమే వెళుతున్నామని, ఎటువంటి కార్యక్రమమూ లేదని చెప్పినా ఆయన వినలేదు, నోటికొచ్చినట్లు దూషించారు. దీంతో పరస్పర వాగ్వివాదం జరిగింది.

రెచ్చిపోయిన సిఐ నాయకులను ఈడ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కళాకారులు ప్రతిఘటించారు. ఎపిడికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కెవిపిఎస్ అనంతపురం జిల్లా అధ్యక్షులు జి. వెంకటేష్ తదితరులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీస్ వ్యాన్‌లో వేసి, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన నేతలు స్టేషన్‌లో నిరసనకు దిగారు, అరెస్టు వార్త తెలుసుకుని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, పార్టీ నాయకులు రమణారావు, దుర్గారావు, కె.శ్రీనివాస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. నిరసన తీవ్రమవుతుండటంతో పోలీసులు అరెస్టు చేసిన వారిని వదిలిపెట్టారు.

బెట్టింగ్ యాప్స్ కేసులో విష్ణుప్రియ, టేస్టీ తేజకు నోటీసులు

- వారి తరఫున పోలీస్ స్టేషన్‌కు హాజరైన శేఖర్ భాషా



నవతెలంగాణ-బంజారాహిల్స్

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌పై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన 11 మందిపై హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా తదుపరి చర్యల్లో భాగంగా బిగ్‌బాస్ కంటెస్టెంట్‌లు విష్ణుప్రియ, టేస్టీ తేజకు మంగళవారం పోలీసులు నోటీసులు పంపారు. సాయంత్రం విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. అయితే, వారు విచారణకు హాజరు కాకపోవడం గమనార్హం. విష్ణుప్రియ, టేస్టీ తేజ తరఫున మరో బిగ్‌బాస్ కంటెస్టెంట్ శేఖర్ భాషా రంగంలోకి దిగాడు. వీరిద్దరి తరఫున పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. విష్ణుప్రియ, టేస్టీ తేజ తరఫున పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌ను కలిశానని తెలిపారు. వారు విచారణకు హాజరు కావడానికి సమయం కావాలని, వాళ్ల తరఫున కోరినట్టు చెప్పారు. అందుకు మూడ్రోజులపాటు పోలీసులు సమయం ఇచ్చినట్టు తెలిపారు. అనుకున్న సమయంలో వారు హాజరై పోలీసులకు సహకరిస్తారని వివరించారు. బెట్టింగ్ యాప్స్ పర్యావసనాలు తెలియకుండా వాళ్ల ప్రమోషన్స్ చేశారని, అవి ఏడాది కిందట చేసిన ప్రమోషన్లేనని తెలిపారు. బెట్టింగ్ యాప్‌లను తెలిసి ప్రమోట్ చేసినా, తెలియక ప్రమోట్ చేసినా తప్పేనన్నాడు. ఇదే అంశం గురించి తమ బిగ్‌బాస్ గ్రూప్‌లో కూడా చాలా పెద్ద చర్చ జరిగిందని చెప్పుకొచ్చాడు. ఇకపై తమ బిగ్‌బాస్ ఫ్యామిలీలో ఎవరూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేయరని తెలిపారు. ఇదిలా ఉండగా, నటి మంచు లక్ష్మి కూడా ఇంతకుముందు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చెక్కర్లు కొడుతున్నాయి. దాంతో ఆమెపై కూడా పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

భారత్‌కు రండి

- సునీతా విలియమ్స్‌కు మోడీ ఆహ్వానం

న్యూఢిల్లీ : భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షం నుండి భూమికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆమెను భారత్‌కు ఆహ్వానించారు. ఈ నెల ఒకటవ తేదీన సునీతకు రాసిన లేఖను నాసా మాజీ వ్యోమగామి మైక్ మాసిమినో ద్వారా పంపారు. ఆమె వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తమ మనసులకు దగ్గరగానే ఉన్నారని తెలిపారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, భూమికి విజయవంతంగా చేరుకోవాలని భారతీయులందరూ ఆకాంక్షిస్తున్నారని వివరించారు.మోడీ లేఖ రాసిన విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో గడిపిన సునీతా విలియమ్స్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో భూమికి చేరుకుంటారు.

ఓటరు ఐడీతో ఆధార్ అనుసంధానం

- సీఈసీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ : ఓటరు కార్డుతో ఆధార్‌ను అనుసంధానించాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నిర్ణయించింది. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించబోతోంది. న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి సీఈసీ ఉన్నతాధికారులు, కేంద్ర హోం శాఖ అధికారులు హాజరయ్యారు. ఓటరు ఐడీతో ఆధార్ అనుసంధానంపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. దీనిపై సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు ప్రారంభిస్తామని సీఈసీ తెలిపింది. 1950వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఆర్టికల్ 326, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పింది.

చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగమే ఎస్సీ వర్గకరణ బిల్లు ఆమోదం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగానే ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసన సభలో ఆమోదించుకున్నామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశంతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. యావత్తు మాదిగ జాతి మరచిపోని విధంగా చిత్తశుద్ధితో బిల్లు ఆమోదించేందుకు కృషి చేశామన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు కట్టుబడి కమిటీ వేశామనీ, ఆ రిపోర్టు ఆధారంగా వర్గీకరణ బిల్లు ఆమోదించినట్టు తెలిపారు. దీని వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. ఆయన 35 లక్షల మాదిగల గుండెల్లో నిలిచిపోతారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియా పాయింట్‌లో స్వీట్లు పంచారు.

ట్రస్టు బోర్డు ఏర్పాటు మంచి నిర్ణయం : బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి

యాదగిరి గుట్టకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయటం మంచి నిర్ణయమని ప్రభుత్వ విప్ బీర్లఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ యాదగిరి గుట్టకు పూర్వవైభవాన్ని తేవటానికి ప్రభుత్వం తగిన కృషి చేస్తున్నదని చెప్పారు. బోర్డు ఏర్పాటు చేయటం వల్ల భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో ఆలయ ప్రతిష్ట మరింత పెరుగుతుందని చెప్పారు.

నాగపూర్‌లో హింస...కర్ఫ్యూ

ఉద్రిక్తతలకు దారితీసిన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రదర్శన

- రెచ్చిపోయిన అల్లరిమూకలు
- వాహనాలు, ఇళ్లు, దుకాణాలకు నిప్పు : 'ఛావా' సినిమాయే కారణమన్న సీఎం ఫడ్నవీస్
- ఔరంగజేబును కీర్తిస్తే సహించబోమన్న వీహెచ్‌పీ





నాగపూర్ : ఔరంగజేబు సమాధిని కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సోమవారం నిర్వహించిన ప్రదర్శన నాగపూర్‌లో ఉద్రిక్తతలకు దారితీసింది. పరిస్థితిని అదుపు చేసేందుకు అధికార యంత్రాంగం పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ప్రకటించారు. కర్ఫ్యూను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలంతా శాంతియుతంగా వ్యవహరించాలని, సంయమనం పాటించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కోరారు. వదంతులను నమ్మవద్దని, అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఔరంగజేబు సమాధిని తొలగించాలంటూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రదర్శన నిర్వహిస్తున్న సమయంలో ముస్లిం మతానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని దహనం చేశారంటూ వదంతులు వ్యాపించాయి. దీంతో ఆగ్రహావేశాలకు గురైన ఓ వర్గం ప్రజలు పోలీస్ స్టేషన్‌పై రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జీ చేశారు. భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. లాఠీఛార్జిలో పలువురికి గాయాలయ్యాయి. ఆ తర్వాత హింస మరికొన్ని ప్రాంతాలకు వ్యాపించింది. బజరంగ్‌దళ్ ప్రదర్శనకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయని, దీంతో రెండు మతాల మధ్య వివాదం చెలరేగి అల్లర్లు జరిగాయని పోలీసులు తెలిపారు.

అల్లరిమూకలు వాహనాలకు నిప్పంటించి విధ్వంసానికి పాల్పడ్డారు. నివాస గృహాలు, దుకాణాలను ధ్వంసం చేశారు. ఔరంగజేబు సమాధిని కూల్చేయాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. హింసకు దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రతిపక్ష శివసేన (యూబీటీ) ఆరోపించింది. అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. హింసకు పాల్పడిన 50 మందిని అరెస్ట్ చేశామని, ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఔరంగజేబుపై ప్రజల ఆగ్రహానికి 'ఛావా' సినిమాయే కారణమని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఆరోపించారు. ఇది ముందస్తు కుట్రలో భాగమేనని ఆయన అన్నారు. హింసాకాండలో ముగ్గురు డీసీపీలు సహా 33 మంది పోలీసులు గాయపడ్డారని ఆయన శాసనసభలో తెలిపారు. నాగపూర్ హింస ప్రభుత్వ వైఫల్యమా లేక పోలీసు వైఫల్యమా అని కాంగ్రెస్ నాయకుడు నానా పటోలే ప్రశ్నించారు. తన సమాధిని తానే తవ్వుకోవడంలో జాతి యావత్తూ బిజీగా ఉన్నదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝూ వ్యాఖ్యానించారు. కాగా ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నదని జిల్లా కలెక్టర్ దిలీప్ స్వామి తెలిపారు. దౌలతాబాద్, ఖులాదాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని మోహరించామని చెప్పారు.

ఔరంగాబాద్‌ను కీర్తించడానికి ప్రయత్నిస్తే సహించబోమని వీహెచ్‌పీ హెచ్చరించింది. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో ఓ మత గ్రంథాన్ని 'ఛాదర్'తో సహా తగలబెట్టారంటూ వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. కాగా నాగపూర్ హింసపై శాసనమండలిలో మంగళవారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. 'ఔరంగజేబు ఎవరు? మన రాష్ట్రంలో ఆయన్ని కీర్తించడాన్ని ఎందుకు అనుమతించాలి? ఆయన మన చరిత్రపై మాయని మచ్చ' అని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛావా చిత్రం ప్రజల మనోభావాలను గాయపరచిందని కేంద్ర మంత్రి రాందాస్ అథావలే అన్నారు.